




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 2 మంగళవారం | సెప్టెంబర్2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 349
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

### బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెండ్..?



2

### తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై కమిటీ ఏర్పాటు



2

### ఈసీపై త్వరలో పెద్ద బాంబు పేలుస్తా..రాహుల్ గాంధీ



2

## ఆఫ్ఘనిస్తాన్‌లో విలయం

- ఆఫ్ఘనిస్తాన్‌లో 6.0 తీవ్రత భూకంపం
- 812 మందికి పైగా మృతి, 3 వేల మందికి గాయాలు
- కునార్, నాన్గర్‌హార్ జిల్లాల్లో ప్రాణ, ఆస్తి నష్టం
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం కొనసాగుతున్న శోధన
- పర్వత గ్రామాలకు చేరుకోలేని సహాయక బృందాలు
- పాక్ సరిహద్దు సమీపంలో భూకంప కేంద్రం
- మృతుల పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం
- భారత్ ఎల్లప్పుడూ ఆఫ్ఘాన్‌కు అండగా ఉంటుందని హామీ

2



**కాబూల్-నవభూమి బ్యూరో**

కాబూల్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి తర్వాత సంభవించిన భూకంపం ఆఫ్ఘనిస్తాన్‌ను తీవ్ర విషాదంలోకి నెట్టింది. కునార్, నాన్గర్‌హార్ ప్రావిన్సుల్లో భూమి 6.0 తీవ్రతతో కంపించగా, ఇప్పటివరకు 812 మంది ప్రాణాలు కోల్పోయారు. మూడువేల మందికి పైగా గాయపడ్డారు.అమెరికా జియోలాజికల్ సర్వే సమాచారం ప్రకారం, నాన్గర్‌హార్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ నగరానికి 27 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. పర్వత ప్రాంతాలు కావడంతో సహాయక చర్యలకు పెద్ద అడ్డంకులు ఎదురవుతున్నాయి. అనేక గ్రామాలకు రహదారి మార్గం లేకపోవడం వల్ల హెలికాప్టర్ల ద్వారానే చేరుకోవాల్సి వస్తోంది.స్థానికులు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాబూల్ ప్రభుత్వం అత్యవసర సహాయక చర్యలు ప్రారంభించింది. భూకంపం ప్రభావిత ప్రాంతాల్లో మౌలిక వసతులు ధ్వంసమై, అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి.

స్థానిక కాలమానం ప్రకారం గత రాత్రి 11:47 గంటలకు భూమి కంపించినట్టు అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) తెలిపింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 6.0గా నమోదైంది. భూమికి 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ (జీఎఫ్‌జెడ్) పేర్కొంది. భూకంప కేంద్రం బసావుల్ పట్టణానికి 36 కిలోమీటర్ల ఉత్తరాన ఉన్నట్టు గుర్తించారు. లోతు తక్కువగా ఉండటంతో నష్టం తీవ్రత ఎక్కువగా ఉంది.కునార్ ప్రావిన్స్‌లోని నూర్ గల్, సావ్కి, వాత్‌పుర్, మనోగీ, చపా దారా జిల్లాల్లో అత్యధిక ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. ఈ భూకంప ప్రభావం ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్ నుంచి సుమారు 370 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వరకు కనిపించింది. ఇక్కడ కూడా కొన్ని సెకన్ల పాటు భవనాలు కంపించాయని ఏఎఫ్‌పీ జర్నలిస్టులు పేర్కొన్నారు. అక్టోబర్ 7, 2023న కూడా ఆఫ్ఘనిస్థాన్‌లో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. ఆ విపత్తులో కనీసం 4,000

## మోదీ-పుతిన్ దోస్తీ

చైనా సోషల్ మీడియాలో ఇదే టాప్ ట్రెండింగ్

- ఎస్‌సీఓ సదస్సులో మోదీ, పుతిన్‌ల స్నేహంపై చైనాలో జోరుగా చర్చ
- సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్‌గా నిలిచిన ఇద్దరు నేతల సాన్నిహిత్యం
- ప్రధాని మోదీ కోసం 10 నిమిషాలు వేచి చూసిన రష్యా అధ్యక్షుడు పుతిన్
- ద్వైపాక్షిక సమావేశానికి ఒకే కారులో ప్రయాణించిన ఇరు దేశాధినేతలు
- వీబో, బైడులో "పుతిన్ కారులో మోదీ" టాప్ సెర్చ్
- టియాంజిన్ డిక్లరేషన్‌తో ముగిసిన 25వ ఎస్‌సీఓ సదస్సు

2

**షాంఘై-నవభూమి బ్యూరో**

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు కంటే భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య ఉన్న స్నేహబంధమే చైనాలో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. సోమవారం చైనాలోని ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీరిద్దరి సాన్నిహిత్యానికి సంబంధించిన అంశాలే టాప్ ట్రెండింగ్‌లో నిలవడం విశేషం.చైనాలో అతిపెద్ద సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన 'వీబో'లో సోమవారం ఉదయం "పుతిన్ కారులో మోదీ ప్రయాణం" అనే అంశం నంబర్ వన్ ట్రెండింగ్‌గా నిలిచింది. అదేవిధంగా, దేశంలోని ప్రముఖ



సెర్చ్ ఇంజిన్ 'బైడు'లో "మోదీ-పుతిన్ ఆలింగనం చేసుకుని, చేతిలో చేయి వేసి మాట్లాడుకున్నారు" అనే అంశం

## అసలు దొంగ హరీష్ రావే

### ఎమ్మెల్సీ కవిత సంచలన ఆరోపణలు

- కేసీఆర్‌పై సీబీఐ విచారణ.. కవిత ఆవేదన
- నాన్నకు తిండిమీద, డబ్బు మీద యావ ఉండదు: కవిత
- కాళేశ్వరం వ్యవహారంలో హరీష్‌రావు, సంతోష్‌రావు పాత్ర వుంది
- హరీష్‌ను ఇరిగేషన్ మంత్రిగా తొలగించడానికి ఇదే కారణం
- వీళ్లకు సీఎం రేవంత్ రెడ్డి వెనుక ఉన్నారని ఆరోపణ
- కాంగ్రెస్‌కు ధైర్యం ఉంటే హరీష్, సంతోష్‌లపై విచారణ జరపాలి
- వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్యానికి హానికరం
- సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తే తోలు తీస్తా- కవిత వార్నింగ్



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ రాజకీయ వాతావరణం మరోసారి వేడెక్కింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ చుట్టూ తిరుగుతున్న ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్సీ కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "నా తండ్రి కేసీఆర్‌కి తిండి, డబ్బు మీద ఎప్పుడూ ఆశ ఉండదు. తరతరాల సంపాదనను తెలంగాణ ప్రజలకు అంకితం చేశారు. అలాంటి మహానాయకుడిపై అవినీతి ముద్ర వేయడానికి సీబీఐ ఎంక్వైరీ పెట్టడం చూసి నా గుండె మండిపోతోంది" అని అన్నారు."కాళేశ్వరం వ్యవహారంలో కేసీఆర్‌కి మరక పడేలా చేసిన వారిలో మాజీ మంత్రి హరీష్‌రావు, సంతోష్ రావు కీలక పాత్ర పోషించారు. అందుకే హరీశ్ రావును రెండో సారి ఇరిగేషన్ మంత్రిగా తొలగించినట్లు తెలిపారు. వీరిద్దరు కలిసి నా మీద కూడ కుట్ర పన్నారు.. వీరి వెనక సీఎం రేవంత్ రెడ్డి నిలబడి ఉన్నారు.. పార్టీ అంతర్గతంగా కొందరు కావాలనే కుట్రలు పన్నారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజాం కంటే కేసీఆర్ ఆస్తిపరుడు కావాలని అనుకున్నారని అంటున్నారు.. నిజంగానే నిజాం స్ఫూర్తిగానే సాగుతామన్నారు. నేను ఇలా మాట్లాడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి నష్టం జరగొచ్చు. అయినా సరే, నా తండ్రి గౌరవం కాపాడటానికి తప్పకుండా నిజం చెబుతాను. బీఆర్ఎస్ భవిష్యత్తు ఎలా ఉండాలో ఈ పరిణామాలే నిర్ణయిస్తాయి. ఒకవేళ కేసీఆర్‌పై విచారణ కొనసాగితే పార్టీ నిలబడగలదా అన్న ప్రశ్నను ప్రతి ఒక్కరూ ఆలోచించాలని అన్నారు. ఇన్ని రోజులుగా పార్టీ భవిష్యత్తు దృష్ట్యా ఓర్పు ప్రదర్శించానని.. హరీష్ రావు, సంతోష్ రావుల పేర్లు బయటకు తీయకుండా ఆగానని తెలిపారు. అయితే ఇప్పుడు మౌనం వహిస్తే ప్రజలు కేసీఆర్‌నే తప్పుగా

## తెలుగువాడికి మద్దతు ఇవ్వండి

- చంద్రబాబు, పవన్, కేసీఆర్, జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్నా... రేవంత్ రెడ్డి
- రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలు పక్కన పెట్టాలన్న రేవంత్ రెడ్డి
- ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వాలన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

ఉపరాష్ట్రపతిగా తెలుగు వ్యక్తిని గెలిపించుకునే అవకాశం వచ్చిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మద్దతు ఇవ్వాలని తెలుగు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులకు ఆయన విజ్ఞప్తి చేశారు. "ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నాను. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కన పెట్టి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి" అని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.


ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను ఆయన గౌరవించారని తెలిపారు. హైదరాబాద్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపరాష్ట్రపతి ఎన్నికకు అత్యంత ప్రాధాన్యం ఉందని అన్నారు.

రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే అజెండాతో ఎన్డీయే అభ్యర్థిని నిలబెట్టిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపిందని చెప్పారు. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చని, కానీ తెలుగు వ్యక్తికి అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు.

## దమ్ముంటే అసెంబ్లీకి రండి

### వైసీపీకి చంద్రబాబు ఓపెన్ ఛాలెంజ్

- రాజంపేట పర్యటనలో సీఎం చంద్రబాబు పెన్షన్ల పంపిణీ
- దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని వైసీపీకి సవాల్
- బాబాయ్ హత్య, కోడికత్తి డ్రామాలపై చర్చకు తాను సిద్ధమన్న సీఎం
- రాయలసీమను రతనాల సీమగా మార్చి చూపిస్తానని హామీ
- గత సర్కారులో అనర్హులకు పింఛన్లు ఇచ్చారని ఆరోపణ
- అప్పులతో సంక్షేమం చేస్తే చిప్పే మిగులుతుందని గత ప్రభుత్వంపై విమర్శ



2

**అమరావతి-నవభూమిబ్యూరో**

ఎన్నికల ముందు 'సిద్ధం సిద్ధం' అని నినాదాలు చేసిన వారికి నేను సూటిగా సవాల్ విసురుతున్నాను. దమ్ముంటే అసెంబ్లీకి రండి.. ఎవరిది విధ్వంసమో, ఎవరిది అభివృద్ధో తేల్చుకుందాం" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వైసీపీకి బహిరంగ సవాల్ విసిరారు. రాజంపేట నియోజకవర్గంలోని బోయనపల్లిలో సోమవారం జరిగిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగిస్తూ, గత ఐదేళ్ల పాలనపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, వైసీపీ నేతలు సిద్ధమేనా అని ప్రశ్నించారు. ఈ సవాల్ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం**


గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధమని చంద్రబాబు స్పష్టం చేశారు. "బాబాయ్ హత్యపై చర్చిద్దాం రండి. పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల గురించి మాట్లాడుకుందాం. దళిత డ్రైవర్‌ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనపై సమాధానం చెప్పాలి. కోడికత్తి డ్రామా, గులక రాయి డ్రామాలపై కూడా చర్చకు నేను సిద్ధం. వైసీపీ అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పేందుకు నేను సిద్ధంగా ఉన్నాను, మరి చర్చించడానికి వైసీపీ సిద్ధమా?" అంటూ చంద్రబాబు తీవ్ర స్వరంతో నిలదీశారు. తనపై క్లైమోర్ మైన్లతో దాడి చేసినా చలించలేదని, తాను డ్రామాలు ఆడే వ్యక్తిని కాదని ఆయన అన్నారు.

**పెన్షన్ల పంపిణీలో అక్రమాలపై విమర్శలు**

అంతకుముందు, ముఖ్యమంత్రి నేరుగా బోయనపల్లి గ్రామంలోని యడవల్లి సుమిత్రమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన

## కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో నిరాశ

- కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ విచారణ జరిపిస్తామన్న సీఎం
- సీబీఐ విచారణ ఆపాలంటూ హైకోర్టులో కేసీఆర్, హరీశ్ పిటిషన్
- తక్షణ విచారణకు నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం
- పిటిషన్‌పై రేపు విచారణ జరుపుతామని స్పష్టీకరణ
- చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఆదేశించలేమన్న హైకోర్టు



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణను నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా తమపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని ఆదేశించాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. అయితే, ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టడానికి, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి హైకోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్‌ను సాధారణ

## గవర్నర్‌ను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

### 42 శాతం బీసీ రిజర్వేషన్స్ పెంపు బిల్లు ఆమోదం కోసం వినతి



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు, ఎమ్మెల్యేలు సోమవారం రాజ్ భవన్‌లో కలిశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదం కోసం వినతిపత్రం ఇచ్చారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, మహేష్ కుమార్ గౌడ్, సీపీఐ నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కలిశారు. గర్నవర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీకి బీజేపీ నేతలు ఎవరూ హాజరుకాలేదు.


2లో

## మరో మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

### వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది మంగళవారం అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. ఫలితంగా ఏపీలో సోమ, మంగళ, బుధవారాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అటు, తెలంగాణలో కూడా మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయి.ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అందించిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్-ఒడిశా తీరాలకు ఆనుకుని వాయవ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో మూడు రోజులపాటు అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి.నేడు(సోమవారం) శ్రీకాకుళం,



విజయనగరం, మన్యం, అల్లూరి జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. విశాఖ, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం

2లో

# వరద నష్టంపై సమగ్ర నివేదిక అందజేయాలి: సీఎం ఆదేశం

## నవ వార్త



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వర్షాలు, వరదల నష్టంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సమీక్షించారు. వర్షాల కారణంగా 1,052 చోట్ల 1,023 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని సీఎం దృష్టికి ఉన్నతాధికారులు తీసుకువెళ్లారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని వారిని ఆదేశించారు.
అలాగే గతేడాది భారీ వర్షాలకు జరిగిన నష్టానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు రాక పోవడంపై సీఎం ఆరా తీశారు. ఈ అంశాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. ఇక భారీ వర్షాల సమయంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని చెప్పారు.
ఇప్పటి వరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్లను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టం అంచనా వేసి తక్షణమే నివేదిక సైతం అందజేయాలని సూచించారు.
గత ఏడాది ఏర్పాటు చేసిన ఎస్డీఆర్ఎఫ్.. వరదల సమయంలో బాగా పని చేసిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో ఎన్డీఆర్ఎఫ్‌తో పని లేకుండా ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిలో నైపుణ్యాలు పెంచాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు సీఎం వివరించారు. హెచ్ఎండీఏ పరిధిలో చెరువులను వెంటనే నోటిఫై జరగాలని ఆదేశించారు.

## దమ్ముంటే అసెంబ్లీకి రండి

**(1వపేజీ తరువాయి)**మాట్లాడుతూ, పెన్షన్ అనేది పేదలకు ఇచ్చే దానం కాదని, అది ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. "తెలుగు వారికి పెన్షన్లను పరిచయం చేసింది ఎన్టీఆర్. ఆయన రూ. 30తో ప్రారంభిస్తే, మేం ఇప్పుడు రూ. 4000 ఇస్తున్నాం. దివ్యాంగులకు 12 రెట్లు పెంచింది టీడీపీ ప్రభుత్వమే" అని గుర్తుచేశారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం అవయవాలన్నీ సక్రమంగా ఉన్న తమ పార్టీ కార్యకర్తలకు కూడా దివ్యాంగుల పెన్షన్ ఇచ్చిందని, ఇలాంటి అనర్హులను ప్రజలే నిలదీయాలని పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకే ప్రభుత్వ సంపద అందాలని ఆయన అభిప్రాయపడ్డారు.
సంపద సృష్టితోనే సంక్షేమం
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ, "అప్పు చేసి పప్పు కూడు తింటే చివరికి చిప్పే మిగులుతుంది. అప్పులు చేసి బాగుపడ్డ వారు ఎవరూ లేరు" అంటూ గత ప్రభుత్వ ఆర్థిక విధానాలను చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఆదాయాన్ని పెంచి, ఆ సంపదను పేదలకు సంక్షేమం రూపంలో అందించడమే తన విధానమని పునరుద్ఘాటించారు. "నేను ఐటీ, హైటెక్ సిటీ అంటే ఎగతాళి చేశారు. కానీ ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు ఉన్నతస్థాయిలో ఉన్నారంటే అందుకు ఐటీనే కారణం. డ్వాక్రా సంఘాలు పెట్టి మహిళలను ఆర్థికంగా నిలబెట్టాం. మేం చేసిన మంచిని ప్రజలు గుర్తుంచుకోవాలి" అని ఆయన కోరారు.

**రాయలసీమకు రత్నాల హారం**

రాయలసీమ అభివృద్ధికి తన ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు హామీ ఇచ్చారు. "రాయలసీమను రతనాల సీమగా మార్చడమే నా లక్ష్యం. సీమకు నీళ్లిచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది. ఆయన స్ఫూర్తితో రాయలసీమలో కరవును శాశ్వతంగా దూరం చేస్తాం. నిన్ననే కుప్పానికి నీళ్లు తీసుకెళ్లాను, భవిష్యత్తులో రాజంపేట, కోడూరుకు కూడా సాగునీరు అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. కరవు జిల్లా అయిన అనంతపురానికి కియా పరిశ్రమను తీసుకొచ్చి ఆ ప్రాంత రూపురేఖలు మార్చామని, అదే తరహాలో రాయలసీమకు పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తామని తెలిపారు. ఆడబిడ్డల జోలికి వస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తన బలం, బలగం ప్రజలేనని, వారి సహకారంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని చంద్రబాబు పేర్కొన్నారు.

## తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ ఏర్పాటుకు కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఛైర్మన్‌గా ప్రభుత్వ సలహాదారుడు కె. కేశవరావును నియమించింది. ఆయనతో సహా ఏడుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీలో విద్యా శాఖ సెక్రటరీ యోగితా రాణా మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, విద్య కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, సీఎస్ రామకృష్ణారావు, ఉన్నత విద్య మండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది.
మరో సభ్యుడిని ఎంపిక చేసే స్వేచ్ఛను ఈ కమిటీ ఛైర్మన్‌కు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ కమిటీ జాతీయ విద్య పాలసీ 2020ని రాష్ట్రానికి అనుకూలంగా అమలు చేసే అంశంపై అధ్యయనం చేయడం.. అలాగే జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా స్కిల్స్ పెంచడం కోసం ఎడ్యుకేషన్ ఫ్రేమ్ వర్క్‌ను రూపొందించాలని పేర్కొంది. ఇందులో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఇన్నోవేషన్, ఎంట్రెప్రెన్యూయర్ షిప్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోనేందుకు పెద్ద పీట వేయాలని సూచించింది. ఇక విద్య సంస్థలు, పరిశ్రమల మధ్య పరిశోధన సహకారం ఏర్పాటుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేసింది. పాఠశాలలు, ఉన్నత విద్య సంస్థలు, టెక్నికల్, ఒకేషనల్, ప్రొఫెషనల్ కోర్సులను అందరికి అందుబాటులోకి తీసుకురావడం.. అలాగే సమానత్వం సాధించడం కోసం తీసుకురావాల్సిన సంస్కరణలపై సలహాలు ఇవ్వాలని ఈ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా అంశాలపై అధ్యయనం చేసి.. ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది.

## గవర్నర్‌ను కలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలు

**(1వపేజీ తరువాయి)**బీసీ బిల్లుపై కుట్ర దౌర్భాగ్యం: మంత్రి పొన్నం ప్రభాకర్
అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఫ్యూడలిస్ట్ పార్టీ అని విమర్శించారు. బీసీల అంశం చర్చకు వస్తే ఇలా అడ్డుపడటం సరికాదని చెప్పుకొచ్చారు. సమాజం గమనిస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కి బీసీల పట్ల ఉన్న గౌరవం, వైఖరి స్పష్టం అవుతోందని చెప్పుకొచ్చారు. 42శాతం రిజర్వేషన్లను అడ్డుకోవద్దని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. కులగణన సర్వేలో కూడా బీఆర్ఎస్ నేతలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. కడుపులో కత్తులు పెట్టుకొని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు బీఆర్ఎస్ మద్దతు తెలపాలని కోరారు. బీసీ బిల్లు అడ్డుకోవడం ఏం పద్ధతని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి బీసీ రిజర్వేషన్‌లు ఇష్టం లేకపోవచ్చని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర దౌర్భాగ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

## మరో మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు



**(1వపేజీ తరువాయి)**ఉంది. ఇక, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి. 40 నుంచి 60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. గురువారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

# బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెండ్..?



**హైదరాబాద్-నవభూమి:** ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సంతోష్ రావులపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ నేపథ్యంలో కవితపై బీఆర్ఎస్ ఎలాంటి చర్యలు తీసుకోబోతుంది అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే.. కవిత వ్యాఖ్యలకు బీఆర్ఎస్ కౌంటర్ ఇచ్చింది. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో హరీష్ రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ ట్వీట్ చేసింది. దానితో పాటు బీఆర్ఎస్ మీడియా వాట్సాప్ గ్రూప్స్ నుంచి కవిత పీఆర్వోను బీఆర్ఎస్ తొలగించింది. అయితే కవిత కామెంట్స్‌పై బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కవిత కామెంట్స్ తర్వాత ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో కేటీఆర్, మధుసూదనాచారీ, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీష్ రెడ్డి, పల్లా రాజేశ్వరరరెడ్డి సమావేశమైనట్లు సమాచారం. కవిత కామెంట్స్‌పై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చిస్తోన్నట్లు తెలుస్తోంది. నేడో.. రేపో.. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు బీఆర్ఎస్ వర్గాల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ కవిత విషయంలో మరో కోణం వెలుగు చూసింది. కవిత త్వరలో కొత్త పార్టీ పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొత్త పార్టీకి కవిత రిజిస్ట్రేషన్ కూడా చేయించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ కాగానే కవిత కొత్త పార్టీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే గతంలో కూడా ఎమ్మెల్సీ కవిత కొత్త పార్టీ పెడుతారన్న వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ ఆ వార్తలు కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో కల్వకుంట్ల కవిత డ్రామాకి బీఆర్ఎస్ ఏ ముగింపు పలుకునుందో వేచి చూడాలి.

# మందు బాబులకు మరో గుడ్ న్యూస్..



**అమరావతి-నవభూమి:** రాష్ట్రంలో నేటి నుంచి నూతన బార్ పాలసీ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఉదయం 10.00 గంటల నుంచి అర్ధరాత్రి 12.00 గంటల వరకు బార్లు తెరచి ఉండనున్నాయి. ఈ విధానం సోమవారం నుంచి అంటే.. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. దీంతో దేశంలోని అన్ని ముఖ్య నగరాలలో దాదాపుగా ఇదే విధానం అమలు అవుతోంది. దాంతో ఆ యా నగరాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ సైతం చేరినట్లు అయింది. ఈ నూతన బార్ పాలసీ 2025 నుంచి 2028 వరకు అమలులో ఉండనుంది. అయితే గతంలో పాత పాలసీ ప్రకారం.. రాత్రి 11.00 గంటలకు బార్లను మూసి వేయాల్సి ఉండేది. కానీ నూతన విధానంతో ఒక గంట మేర బార్లను నిర్వహించుకోనే విధానాన్ని నిర్వాహకులకు ఈ పాలసీ ద్వారా ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం తాజాగా తీసుకువచ్చిన ఈ ఉత్తర్వుల్లో భాగంగా 10 శాతం మద్యం షాపులను కల్లు గీత కులాలకు కేటాయించిన విషయం విదితమే.
దేశంలోని వివిధ నగరాల్లో ఈ విధంగా..
న్యూఢిల్లీ ( క్యాపిటల్ రిజియన్): బార్లు, రెస్టారెంట్లలో అర్ధరాత్రి 1.00 వరకు మద్యం సరఫరా చేస్తారు.
ముంబై (మహారాష్ట్ర): అర్ధరాత్రి 1:30 మూసి వేస్తారు.
చెన్నై (తమిళనాడు): అర్ధరాత్రి 12.00 గంటలకు పబ్‌లు మూసివేస్తారు.
హైదరాబాద్( తెలంగాణ): అర్ధరాత్రి 12.00 గంటలకు మూసి వేస్తారు.
కోల్‌కతా( పశ్చిమబెంగాల్): అర్ధరాత్రి 12.00 గంటలకు బార్లు మూసివేస్తారు.
చంఢీగఢ్ : మామూలు రోజుల్లో పబ్‌లు అర్ధరాత్రి 1.00 వరకు.. వారాంతంలో మాత్రం అర్ధరాత్రి 2.00 గంటల వరకు పబ్‌లు తెరచి ఉంచుతారు.
బెంగళూరు (కర్ణాటక): మామూలు రోజుల్లో రాత్రి 11.30 గంటల వరకు.. వారాంతంలో మాత్రం అంటే.. శుక్ర, శనివారాల్లో అర్ధరాత్రి 1.00 గంట వరకు పబ్‌లు తెరచి ఉంచుతారు.

# ఈసీపై త్వరలో పెద్ద బాంబు పేలుస్తా..రాహుల్ గాంధీ




**లక్నో-నవభూమి:** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి భారత ఎన్నికల సంఘంపై విమర్శలు గుప్పించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే.. ఓటు చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర ఇవాళ(సోమవారం) చివరి రోజుకి చేరింది. ఆగస్టు 17న ప్రారంభమైన ఈ యాత్ర ఇవాళ్టి(సెప్టెంబర్ 1న)తో ముగియనుంది. ఓటర్ల జాబితాలో ఈసీ అవకతవకలకు పాల్పడిందని, బీజేపీ అప్రజాస్వామికంగా ఓటు చోరీ చేసిందని ఆరోపిస్తూ.. రాహుల్‌గాంధీ ఈ యాత్రను చేపట్టిన సంగతి తెలిసిందే. యాత్ర చివరి రోజు కావడంతో తేజస్వియాదవ్, కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ, సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్, సీపీఐ నేత దీపాంకర్ భట్టాచార్య, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఓట్ల చోరీపై త్వరలో మరో పెద్ద బాంబు పేలుస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. బాంబును ఎదుర్కొనేందుకు బీజేపీ సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఆ బాంబుతో ప్రధాని మోదీ ఇక దేశానికి తన ముఖాన్ని చూపించలేరని విమర్శించారు. బీజేపీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా.. ప్రవర్తించిందని ఆరోపించారు. ఎవరు ఏ తప్పు చేసిన ఎప్పుడో ఒక సమయంలో దొరికిపోతారని.. ఇప్పుడు ఆ సమయం బీజేపీకి వచ్చిందని స్పష్టం చేశారు. ఓట్ల చోరీలో వాస్తవాలను ప్రజలు తెలుసుకోబోతున్నారని తెలిపారు. కాగా.. ఈ యాత్ర బీహార్‌లో 25 జిల్లాల వ్యాప్తంగా.. 110 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ.. 1300 కిలోమీటర్ల మేర సాగింది.
అయితే గతంలో.. కూడా ఈసీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు దేశం మొత్తం దుమారం రేపిన సంగతి తెలిసిందే. బీజేపీకి అనుకూలంగా ఈసీ వ్యవహరిస్తోందని, అనేక రాష్ట్రాల ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని చెప్పారు. ఈ క్రమంలో బిహార్ ఓటర్ల జాబితా సవరణపై విరుచుకుపడ్డారు. వేలల్లో నకిలీ ఓటర్లు ఉన్నారని, ఒకే ఇంటిలో 80 మంది ఓటర్లు ఉన్నారని ఆరోపించారు. దీనిపై మీడియా సమావేశంలో ప్రజంటేషన్ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత.. ఈసీపై పలు ఆరోపణలు గుప్పించారు. ఈసీ అక్రమాలకు పాల్పడిందన పేర్కొంటూ పలు ఆధారాలను బయటపెట్టారు. ఇటీవల పలు రాష్ట్రాలు అసెంబ్లీ, గతేడాది లోక్‌సభ ఎన్నికల్లోనూ అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఎన్నికల ఫలితాలపై తాము పరిశోధన చేశామని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు.

# వరుసగా 3 రోజులు సెలవులు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్, కాలేజీ విద్యార్థులకు ఇది నిజంగా తీపి కబురే. ఎందుకంటే ఈ వారంలో వరుసగా మూడ్రో జులు సెలవులు రానున్నాయి. సెప్టెంబర్ 5 శుక్రవారం మిలాద్-ఉన్-నబీ మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. సెప్టెంబర్ 6న శనివారం హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనాల సందర్భంగా సెలవు ప్రకటించారు. సెప్టెంబర్ 7న ఆదివారం వస్తోంది. దీంతో వరుసగా మూడ్రోజులు సెలవులు వచ్చినట్లు అయింది.
విద్యార్థులకే కాకుండా ప్రభుత్వ, ఐటీ ఉద్యోగులకు కూడా లాంగ్ వీకెండ్ వచ్చినట్లయింది. ఈ మూడు రోజులు వరుసగా సెలవులు రావడం వల్ల చాలామంది కుటుంబాలు పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని ప్రణాళికలు వేసుకుంటున్నాయి. నగర జీవితానికి దూరంగా, ప్రకృతికి దగ్గరగా గడపాలని చాలామంది కోరుకుంటారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టడం, వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటం వల్ల హాలిడే ట్రిప్‌లకు ఇది సరైన సమయం. ఈ సెలవులను సద్వినియోగం చేసుకొని, కుటుంబంతో లేదా స్నేహితులతో సరదాగా గడపాలని చాలామంది ప్లాన్ చేసుకుంటున్నారు. అలా హాలిడే ప్లానింగ్ చేసుకునే వారికి కొన్ని సూచనలు.
తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలు: వరంగల్ కోట, రామప్ప దేవాలయం, నాగర్‌సాగర్, పాలంపేట, భద్రాచలం, వంటి ప్రదేశాలకు వెళ్లవచ్చు. వీటికి రోడ్డు మార్గం కూడా చాలా బాగుంటుంది.
ఆంధ్రప్రదేశ్‌లోని పర్యాటక ప్రాంతాలు: విశాఖపట్నం, తిరుమల, శ్రీశైలం, అరకు లోయ వంటి ప్రదేశాలు మంచి ఎంపికలు. అక్కడ వసతి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి.
ముందస్తు ప్రణాళిక: ఈ సెలవు దినాలు ఎక్కువ మందికి అనుకూలంగా ఉండటం వల్ల పర్యాటక ప్రదేశాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ప్రయాణానికి ముందుగానే టికెట్లు, వసతి బుక్ చేసుకోవడం మంచిది.

**ఖైరతాబాద్ మహా గణపతి.. రికార్డు స్థాయిలో భక్తుల రద్దీ**

ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకోవ డానికి భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. రోజురోజుకు రద్దీ పెరుగుతుండటంతో క్యూలైన్లు కిక్కిరిసిపోతు న్నాయి. ఆదివారం ఒక్కరోజులోనే 5 లక్షల మందికి పైగా భక్తులు వినాయకుడిని దర్శించుకున్నట్లు ఉత్సవ కమిటీ అంచనా వేసింది. రద్దీ కారణంగా భక్తులకు 4 గంటల సమయం పడుతోంది. ఖైరతాబాద్, లకిడీకపూల్, ట్యాంక్ బండ్, ఐమాక్స్, సెక్రటేరియట్ మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ మహా గణపతి నిమజ్జనం తేదీపై స్పష్టత ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 7న నిమజ్జనం జరగాల్సి ఉంది. అయితే అదే రోజు చంద్రగ్రహణం ఉండటంతో నిమజ్జనం ఒక రోజు ముందుగా చేపట్టాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 6 శనివారం నాడు మహా గణపతి శోభాయాత్ర నిర్వహించి, నిమజ్జనం పూర్తి చేస్తామని నిర్వాహకులు తెలిపారు. దీంతో అదే

## ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంప విలయం



**(1వపేజీ తరువాయి)**పేర్కొంది. ఇటీవలి కాలంలో దేశంలో జరిగిన అత్యంత ఘోరమైన ప్రకృతి వైపరీత్యాలలో ఒకటిగా అది నిలిచిందిరోడ్డున పడ్డ వందలాది కుటుంబాలు ఈ విపత్తు వల్ల ఇళ్లు నేలమట్టమవ్వడంతో, తలదాచుకోడానికి కూడా ఆసరా లేక వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చిన్నారులు ఆకలితో ఏడుస్తుండగా, వృద్ధులు శక్తిలేక కూలిపోతున్నారు. గాయాలపాలైన మహిళలు వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్నారు. కూలిన ఇళ్ల శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్న రక్షక బృందాల దృశ్యాలు హృదయాలను కలచివేస్తున్నాయి. ఈ దృశ్యాలు కేవలం ఒక దేశానికే కాకుండా, మానవాళికి గాయపరుస్తున్నాయి. మాజీ మేయర్ జరీఫా ఘఫ్వారీ సోషల్ మీడియా ద్వారా చేసిన విజ్ఞప్తి మరింత మానవతా కోణాన్ని ప్రతిబింబిస్తోంది. "కునార్, నోరిస్థాన్, నంగర్హార్ ప్రాంతాల ప్రజలు చావుబతుకుల మధ్య ఉన్నారు. ఆహారం, మందులు, ఆశ్రయం అత్యవసరం. ఈ సమయంలో తాలిబన్ ప్రభుత్వానికి అవసరమైన వనరులు లేకపోవడం బాధాకరం. అందుకే అంతర్జాతీయ సమాజం ముందుకు రావాలి" అని ఆమె అభ్యర్థించారు. క్రికెటర్ రహ్మానుల్లా గుర్బాజ్ కూడా తన హృదయాన్ని వ్యక్తం చేస్తూ బాధితుల కోసం ప్రార్థనలు చేశారు. "మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి" అని భావోద్వేగంతో రాశారు. సాయం కోసం ఎదురుచూపులు ప్రకృతి విపత్తులు సరిహద్దులు చూడవు, మతం గాని జాతి గాని చూడవు. ఇవి కేవలం మనిషి బలహీనతను గుర్తు చేస్తాయి. అఫ్ఘానిస్థాన్ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ బాధలో, ప్రపంచ మానవతా దృష్టి వారిపైనే నిలవాలి. ఆహారం, వైద్యం, ఆశ్రయం అందించడం ఈ క్షణంలో అత్యవసరం. ఎందుకంటే ప్రాణాలను కాపాడటం కంటే గొప్ప మానవతా ధర్మం మరొకటి లేదు.

**ప్రధాని మోదీ సంతాపం**

ఆఫ్ఘనిస్తాన్ ప్రజల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "ఆపద సమయాల్లో ఆఫ్ఘాన్ ప్రజలకు తోడుగా భారత్ ఎల్లప్పుడూ ఉంటుంది" అని మోదీ స్పష్టం చేశారు.

**అంతర్జాతీయ సానుభూతి**

ఈ భూకంపం నేపథ్యంలో అనేక దేశాలు ఆఫ్ఘనిస్తాన్‌కు సహాయం చేయడానికి ముందుకొస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి ఇప్పటికే అత్యవసర సహాయక బృందాలను సిద్ధం చేసింది. పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాల్లో కూడా ప్రకంపనలు నమోదవడంతో, అక్కడి ప్రజలు కూడా భయాందోళనలకు గురయ్యారు.

## అసలు దొంగ హరీష్ రావే

**(1వపేజీ తరువాయి)**అర్థం చేసుకునే అవకాశం ఉందని.. అందుకే నిజాన్ని బహిర్గతం చేయాల్సి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే.. హరీష్ రావు, సంతోష్ రావులపై తక్షణమే విచారణ జరపాలన్నారు. కేసీఆర్ చేసిన పనుల్లో ఎలాంటి తప్పులు లేవని, ఏ విచారణ జరిగినా ఆయన నిష్కళంకుడిగా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయాల్లో ప్రతిపక్షాల విమర్శలు సహజమని, కానీ వ్యక్తిగతంగా దూషించడం అనేది ప్రజాస్వామ్యానికి హానికరమని కవిత వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు ప్రజల సమస్యలపై చర్చించాలని, వ్యక్తిగత స్థాయిలో పరస్పర దాడులు చేయడం కంటే అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా ఇప్పుడు నిజాయితీగా పనిచేసే నాయకులను గుర్తించగలరని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు తాను చేసిన ఈ వ్యాఖ్యలకు చిల్లర కామెంట్స్ చేస్తే ఊరుకోను అని.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేస్తే తోలు తీస్తా అని వార్నింగ్ ఇచ్చారు.

## మోదీ-పుతిన్ దోస్తీ

**(1వపేజీ తరువాయి)**కోసం నెటిజన్లు ఎక్కువగా వెతికారు. ఎస్‌సీఓ సదస్సు ప్రాంగణం నుంచి ద్వైపాక్షిక సమావేశ వేదిక వద్దకు వెళ్లేందుకు ప్రధాని మోదీ కోసం పుతిన్ దాదాపు 10 నిమిషాల పాటు వేచి చూశారని, ఆ తర్వాత ఇద్దరూ ఒకే కారులో కలిసి ప్రయాణించారని వార్తలు వెలువడటంతో ఈ ట్రెండ్ ఒక్కసారిగా ఊపందుకుంది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఉన్న "ప్రత్యేక స్నేహానికి" నిదర్శనమని చైనా సోషల్ మీడియా యూజర్లు అభిప్రాయపడుతున్నారు. ఎక్స్ (గతంలో ట్విట్టర్) తరహాలో పనిచేసే వీబో, చైనాలో అత్యంత ప్రజాదరణ పొందిన సెర్చ్ ఇంజిన్ బైడులలో మోదీ-పుతిన్‌ల బంధంపై ప్రజలు విపరీతమైన ఆసక్తి చూపారు. ఇదిలా ఉండగా, టియాంజిన్‌లో జరిగిన 25వ ఎస్‌సీఓ దేశాధినేతల మండలి సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, తన రెండు రోజుల పర్యటనను ముగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో పాటు పలువురు ప్రపంచ నేతలతో చర్చలు జరిపారు. సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు, చైనా ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సదస్సులో ప్రసంగించిన మోదీ, భద్రత, అనుసంధానం, అవకాశాలు అనే మూడు స్తంభాలపై భారతదేశ వైఖరిని స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై సమష్టి పోరాటం, స్టార్టప్‌లు, యువత, సాంస్కృతిక మార్పిడికి మరిన్ని అవకాశాలు కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. సదస్సు ముగింపులో "టియాంజిన్ డిక్లరేషన్"ను ఆమోదించారు. ఎస్‌సీఓ తదుపరి అధ్యక్ష బాధ్యతలను కిర్గిజ్‌స్థాన్ స్వీకరించింది.


## కేసీఆర్, హరీశ్ రావులకు హైకోర్టులో నిరాశ

**(1వపేజీ తరువాయి)**కేసుల మాదిరిగానే విచారిస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు విచారణ చేపడతామని తెలిపింది. అప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వలేమని కూడా కోర్టు తేల్చి చెప్పింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత తదుపరి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపిస్తామని అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై సుదీర్ఘ చర్చ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఇతర రాష్ట్రాల ప్రమేయం ఉన్నందున, సీబీఐ విచారణే సరైనదని ప్రభుత్వం అభిప్రాయపడింది. అసెంబ్లీ తీర్మానం చేసిన మరుసటి రోజే (ఈరోజు) కేసీఆర్, హరీశ్ రావు హైకోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో రేపు జరగనున్న హైకోర్టు విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.




## చిన్న స్వీట్ షాప్‌కు రూ.141 కోట్ల ట్యాక్స్ నోటీస్.. షాప్ ఓనర్ షాక్..!

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ మంగళవారం 02 । సెప్టెంబర్ । 2025




**న్యూఢిల్లీ–నవభూమి:** చిన్న స్వీట్ షాప్ నిర్వహిస్తున్న ఓ చిరువ్యాపారికి ఏకంగా రూ.141 కోట్ల పన్ను నోటీస్ జారీ అయ్యింది. దాంతో ఆ షాప్ ఓనర్ షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటన ఇటీవల ఉత్తర్రప్రదేశ్‌లో జరిగింది. యూపీలోని బులంద్‌షహర్ ప్రాంతంలో ఓ చిన్న స్వీట్ దుకాణం నడుపుతున్న సుధీర్ అనే వ్యక్తికి రూ.141 కోట్లకు పైగా అమ్మకాలపై ఆదాయపు పన్ను విభాగం అధికారుల నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు.వెంటనే పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీసి ఫిర్యాదు చేశాడు. తనకు సంబంధంలేని కంపెనీ అమ్మకాలపై 2022లో కూడా సీజీఎస్టీ కార్యాలయం నుంచి పన్ను నోటీస్ అందిందని, ఆ కంపెనీలతో తనకు ఎలాంటి సంబంధం లేదని అప్పుడే పన్ను విభాగ అధికారులకు వివరించానని తెలిపాడు. మళ్లీ జూలై 10న తాను రూ.141 కోట్ల అమ్మకాలు చేసినట్లు మరో నోటీస్ వచ్చిందన్నాడు. ఆ నోటీస్‌లో తన పేరు, చిరునామా, పాన్ నంబర్ ఉండటమే కాకుండా.. తాను ఢిల్లీలో ఆరు కంపెనీలను నడుపుతున్నట్లు ఉందని చెప్పాడు.అయితే దీనిపై బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కొందరు ఆర్థిక, సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు తెరవడానికి, షెల్ కంపెనీలను సృష్టించడానికి, రుణాలు పొందడానికి లేదా పన్నులు ఎగవేసేందుకు ఎవరైనా మరొక వ్యక్తి పాన్ వివరాలను చట్టవిరుద్ధంగా ఉపయోగిస్తుంటారని అధికారులు వెల్లడించారు. ఇటువంటి మోసాలు పన్ను నోటీసులు వచ్చినప్పుడో లేదంటే రికవరీ కాల్స్ వచ్చినప్పుడో బయటపడుతుందని చెప్పారు.కాబట్టి ప్రజలు తమ పాన్‌కార్డు వివరాలను బయటి వ్యక్తులతో పంచుకోవద్దని, తమ క్రెడిట్ నివేదికలను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకుంటూ ఉండాలని సూచించారు.

## పీటర్ నవారో 'లాండ్రోమాట్' వ్యాఖ్యలను తప్పుపట్టిన హర్దీప్ సింగ్ పూరీ..



**న్యూఢిల్లీ–నవభూమి:** వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చేసిన 'లాండ్రోమాట్' వ్యాఖ్యలను కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి తప్పుపట్టారు. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా చమురు కొనుగోలులో భారత్ ఎలాంటి నియమాలను ఉల్లంఘించలేదని ఆయన స్పష్టం చేశారు. భారత ఇంధన వాణిజ్య విధానం ప్రపంచ మార్కెట్‌ను స్థిరంగా ఉంచడంలో.. ధరలను నియంత్రించడంలో సహాయపడిందని ఆయన స్పష్టం చేశారు. లాండ్రోమాట్ అంటే అనుమానాస్పద వస్తువులను చట్టబద్ధంగా కనిపించేలా చేసే ప్రక్రియ లేదంటే ప్రదేశం అని అర్థం. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి చాలా కాలం ముందు నుంచే భారత్ ప్రపంచంలో నాల్గో అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశంగా ఉందని.. యుద్ధం తర్వాత కూడా భారతదేశం ఎగుమతులు.. లాభాలు దాదాపు అలాగే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.భారత్ రష్యన్ చమురు కోసం 'లాండ్రోమాట్'గా మారిందని కొందరు ఆరోపిస్తున్నారని.. దీనికంటే తప్పు మరొకటి ఉండదని ఆయన ఓ వ్యాసంలో పేర్కొన్నారు. 'ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారతదేశం రష్యన్ చమురు దిగుమతి ఒక శాతం నుంచి 40శాతం పెరిగింది. ఎందుకంటే పాశ్చాత్య దేశాలు రష్యాపై విధించిన ఆంక్షల తర్వాత.. భారతదేశం భారీ తగ్గింపుతో చమురును తీసుకుంటుంది. భారత్ చౌకగా ఇంధనాన్ని పొందుతుంది' అంటూ ట్రంప్ పరిపాలన విమర్శించింది. రష్యన్ చమురును శుద్ధి చేసి యూరోపియన్ దేశాలకు ఎగుమతి చేసి భారత్ లాభాలను ఆర్జిస్తోందని ఆరోపించింది. అయితే, పీటర్ నోవారో గత వారంలో ఉక్రెయిన్ యుద్ధాన్ని 'మోదీ యుద్ధం'గా అభివర్ణించారు. భారత్.. రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 'యుద్ధ యంత్రం'కి నిధులు సమకూరుస్తోందని ఆరోపించారు. ఇరాన్, వెనిజులా లాగా రష్యన్ చమురుపై ప్రత్యక్ష నిషేధం లేదని పూరి పేర్కొన్నారు. ? G ?-7, యూరోపియన్ యూనియన్ రష్యన్ చమురుపై ధరల పరిమితి వ్యవస్థను విధించాయని, ఇది చమురు సరఫరాను కొనసాగించడం, రష్యా ఆదాయాన్ని పరిమితం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. భారత్ ప్రతి లావాదేవీలు చట్టబద్ధమైనవని స్పష్టం చేశారు. భారత్ చట్టబద్ధమైన షిప్పింగ్, భీమా, సర్టిఫైడ్ వ్యాపారులు, పరీక్షించిన మార్గాల ద్వారా మాత్రమే వ్యాపారం చేసిందన్నారు.భారతదేశం ఏ నియమాలను ఉల్లంఘించలేదని, కానీ ప్రపంచ మార్కెట్‌ను స్థిరీకరించడంతో పాటు ధరలు పెరుగకుండా నిరోధించిందన్నారు. బ్రోకరేజ్ సంస్థ ఇటీవల ఇచ్చిన నివేదికను ఉటంకిస్తూ.. భారత్ రష్యన్ చమురు దిగుమతిని ఆపివేస్తే.. ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్లకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. రష్యన్ చమురు కొనుగోలుదారులు పరిమితంగా ఉన్నందున, భారత్ ఉపసంహరించుకోవడం వల్ల ప్రపంచ సరఫరా ఒక శాతం తగ్గవచ్చని.. ఇది ధరలు, ద్రవ్యోల్బణం రెండింటినీ పెంచుతుందని.. దశాబ్దాలుగా భారతదేశం ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద పెట్రోలియం ఉత్పత్తి ఎగుమతిదారుగా ఉందని.. శుద్ధి సంస్థలు ప్రపంచవ్యాప్తంగా చమురును ప్రాసెస్ చేస్తాయని పూరి అన్నారు. ఎగుమతులు సరఫరా గొలుసును కొనసాగిస్తున్నాయని ఆయన అన్నారు. రష్యా నుంచి చమురు నిషేధం తర్వాత.. యూరప్ కూడా భారతదేశం నుంచి ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్నది. భారతదేశ ఎగుమతి, శుద్ధి మార్జిన్లలో పెద్ద మార్పు లేదని.. కాబట్టి లాభాల ప్రశ్నే తలెత్తలేదన్నారు. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచ ధరలు పెరిగిన సమయంలో భారత్ తన పౌరులకు ఉపశమనం కలిగించడానికి అనేక చర్యలు తీసుకుందని పూరీ స్పష్టం చేశారు.

## బ్రాహ్మణులు లాభపడుతున్నారు.. వివాదం రేపిన పీటర్ నవర్రో వ్యాఖ్యలు



**న్యూయార్క్–నవభూమి:** అమెరికా శ్వేతసౌధం వాణిజ్య సలహాదారుడు పీటర్ నవర్రో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఇండియా దిగుమతులపై 50 శాతం సుంకాన్ని విధిస్తున్న అంశంపై మాట్లాడుతూ బ్రహ్మణులు లాభపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత ప్రజలను వాడుకుని బ్రహ్మణులు లాభపడుతున్నారని, దీన్ని ఆపాలని ఆయన అన్నారు. రష్యాకు లాండ్రీగా ఇండియా మారినట్లు ఆయన ఆరోపించారు. అమెరికాకు పోటీగా వాణిజ్య అసమానతలను ఇండియా సృష్టిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేయడం వల్లే ఇండియాపై 50 శాతం టారిఫ్ వసూల్ చేస్తున్నట్లు నవర్రో పేర్కొన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో ప్రాఫిటీరింగ్ బ్రహ్మిన్స్ అనే పదాన్ని వాడడం చర్చనీయాంశమైంది. ఆ పదం వాడుకపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి.శ్వేతసౌధం వాణిజ్య సలహాదారు పీటర్ చేసిన వ్యాఖ్యలను శివసేన ఉద్ధవ్ పార్టీ నేత ప్రియాంకా చతుర్వేది తప్పుపట్టారు. అమెరికా నేత మరీ దిగజారిపోయే తికమక స్థితిలో మాట్లాడుతున్నట్లు ఆరోపించారు. తన ఎక్స్ పోస్టులో ఆమె కామెంట్ చేశారు. తన ఉద్దేశాన్ని వ్యక్తం చేయడానికి నవర్రో.. భారత్‌లోని ఓ కులాన్ని ఐడెంటిటీగా చూపించడం సరికాదు అని ఆమె అన్నారు. ఇది చాలా సిగ్గుమాలిన వ్యాఖ్య అన్నారు. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న సంపన్నులను బ్రహ్మణులని అంటారని, వారిని బోస్టన్ బ్రాహ్మిణ్ అని పిలుస్తారేమో, కానీ భారతీయ దృక్పథంలో ఓ అమెరికా నేత మాట్లాడడం సరికాదు అని ఆమె పేర్కొన్నారు. బ్రహ్మణులు లాభపడుతున్నట్లు చేసిన వ్యాఖ్యలను సంపూర్ణంగా వివరించాలన్నారు.

## క్లెయిమ్స్ దాఖలుకు గడువు పొడిగించేది లేదన్న సుప్రీం

**న్యూఢిల్లీ–నవభూమి:** బిహార్‌లో ఎన్నికల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ కింద క్లెయిమ్స్, అభ్యంతరాల సమర్పణకు ఈసీఐ విధించిన సెప్టెంబర్ 1వ తేదీ గడువును పొడిగించేందుకు సుప్రీంకోర్టు సోమవారంనాడు నిరాకరించింది. ఈ ప్రక్రియకు రాజకీయ పార్టీలు చురుకుగా సహకరించాలని ఆదేశించింది.సెప్టెంబర్ 1వ తేదీ తరువాత కూడా అభ్యంతరాలు ఏవైనా ఉంటే సమర్పించవచ్చని, అర్హమైన దరఖాస్తులు ఉంటే ఎన్నికల జాబితా ఫైనలేజ్ చేసేంతవరకూ పరిశీలించగలమని విచారణ సందర్భంగా కోర్టుకు ఈసీఐ తెలిపింది. అలాంటి క్లెయిమ్స్‌ను నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకూ పరిశీలించగలమని, అర్హమైన వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చగలమని పేర్కొంది.


## భర్తను వదిలేసి యువకుడితో బిడ్డను కన్న మహిళ.. వీధికుక్కల మధ్య చెత్తకుప్పలో పసికందు



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశంలో గత కొంతకాలంగా వివాహేతర సంబంధాలు పెరిగిపోతుండటం అనేక రకాల నేరాలకు కారణం అవుతున్నాయి. పెళ్లికి ముందు.. పెళ్లి తర్వాత ఇతరులతో సంబంధాలు పెట్టుకుని పురుషులు, మహిళలు కాపురాలు కూల్చేసుకుంటున్న ఘటనలు ఇటీవల బాగా పెరిగిపోవడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇక అవాంఛిత గర్భాలు రావడంతో.. పిల్లలు పుట్టిన తర్వాత వాష్‌రూంలు, చెత్త కుప్పలు, చెట్ల పొదల్లో పడేసి.. చేతులు దులుపుకుంటున్న ఘటనలు కూడా పెరిగిపోతున్నాయి. ఇలాంటి ఘటనే తాజాగా ఒకటి జరిగింది. భర్తను వదిలిపెట్టి.. యువకుడి ప్రేమలో పడిన ఓ వివాహిత.. బిడ్డకు జన్మనిచ్చింది. అది ఎవరికీ తెలియకూడదని.. పుట్టిన పసికందును చెత్తకుప్పలో పడేసింది. ఆ పసికందును చూసిన స్థానికులు.. ఆస్పత్రికి తరలించి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలో జరిగిన ఈ సంఘటన తీవ్ర హృదయవిదారకంగా మారింది.మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలోని పుండలిక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల 29వ తేదీన ఈ దారుణం చోటు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ చెత్త కుండీలో రాత్రిపూట పసికందు ఏడుపు శబ్దం వినిపించింది. ఆ సమయంలో అటు వైపు వెళ్తున్న ఓ యువకుడు.. ఆ ఏడుపు విని ఏంటా అని అక్కడికి వెళ్లి చూశాడు. ఒక సంచిలో పసికందు ఉండగా.. ఆ సంచిని వీధి కుక్కలు పీక్కుతినేందుకు పట్టి లాగుతున్నట్లు గుర్తించాడు. వెంటనే మిగిలిన వారికి విషయాన్ని చెప్పి.. పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. ఆ పసికందును హుటాహుటిన దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులకు విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒక మహిళ రాత్రి పూట.. ఆ పసికందును ఓ సంచిలో తీసుకొచ్చి ఆ చెత్తకుండీ వద్ద పడేసినట్లు గుర్తించారు. దీంతో ఆ మహిళను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. అసలు విషయం బయటికి వచ్చింది. తనకు పెళ్లి అయిందని.. కానీ భర్తతో దూరంగా ఉంటున్నట్లు తెలిపింది. అదే సమయంలో ఒక యువకుడితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకోవడంతోనే.. తాను ప్రసవించినట్లు చెప్పింది. అయితే తాను గర్భవతి అనే విషయం బయటికి వస్తే.. ఇరుగు పొరుగు వాళ్లు ఏమనుకుంటారోనని భయపడిన ఆ మహిళ.. ఇంట్లోనే ప్రసవించింది.ప్రసవం తర్వాత తానే స్వయంగా ఆ బిడ్డను తీసుకెళ్లి అక్కడ పడేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇక ఆ మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆమె ఇంట్లోనే ప్రసవించడంతో ఆరోగ్యం క్షీణించినట్లు గుర్తించారు. వెంటనే ఆ మహిళను ఘాటీ ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు.

# చట్ట ప్రకారం అడల్ట్రీ నేరం కాదు..!

## విడాకులు మాత్రం తీసుకోవచ్చు.. క్రైమ్ పెరగడానికి ఇదో కారణమా?



**న్యూఢిల్లీ–నవభూమి:** ఈ మధ్య భర్తలను చంపుతున్న మహిళలు, భార్యలను చంపుతున్న భర్తల గురించి ఎక్కువగా వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా వివాహేతర సంబంధాల నేపథ్యంలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అడల్ట్రీ (వివాహేతర సబంధం) గరించి చర్చ ఊపందుకుంది. అడల్ట్రీ నేరం కాదని 2018లో సుప్రీం కోర్టు తేల్చింది. అయితే అడల్ట్రీ నేరం కానందువల్లే ఇలాంటి నేరాలు పెరుగుతున్నాయా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా మళ్లీ అడల్ట్రీని నేరంగా పరిగణించాలనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు అడల్ట్రీపై సుప్రీం చెప్పిన తీర్పు ఏంటి? దాన్ని మళ్లీ క్రిమినలైజ్ చేయాలనే వాదనకు కారణాలేంటి? పెరుగుతున్న నేరాలకు.. అడల్ట్రీ నేరం కాకపోవడానికి ఏమైనా సంబంధాలు ఉన్నాయా? ఏయే దేశాల్లో అడల్ట్రీ నేరం కాదు? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.అడల్ట్రీ అంటే ఏమిటి ?

పెళ్లైన వ్యక్తి (పురుషుడు/మహిళ) భర్త లేదా భార్య కాకుండా ఇతరులతో లైంగిక సంబంధాలు పెట్టుకోవడాన్ని అడల్ట్రీ అంటారు. ఐపీసీ 497 ప్రకారం 2018కి ముందు ఇలా చేయడం నేరం. ఇలా చేస్తే ఐదేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ వేసేవారు.

**అడల్ట్రీ నేరం కాదు.. సుప్రీం కోర్టు తీర్పు..**

సెక్షన్ 497 కింద మహిళలకు కాకుండా పురుషులను మాత్రమే శిక్ష విధించేవారు. ఉదాహరణకు భర్త, భార్య అనుకుందాం. ఒకవేళ అనే పురుషుడితో వివాహేతర సంబంధం పెట్టుకుంటే.. ⟨ై⟩ కేసు పెట్టొచ్చు. ఒకవేల అనే వ్యక్తి అనే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుంటే.. అతడి భార్య పై కేసు పెట్టలేదు. అంటే తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళపై భార్య కేసు పెట్టరాదు. దీన్ని మహిళలపై వివక్షగా భావించిన సుప్రీం కోర్టు.. ఇది రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకంగా ఉందని 2018లో జోసఫ్ షైన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో కొట్టేసింది. తీర్పు సందర్భంగా.. ఇష్టపూర్వకంగా శృంగారం చేయడం మహిళల హక్కు అని తేల్చింది. భార్య.. భర్తకు వ్యక్తిగత ఆస్తి కాదని స్పష్టం చేసింది. ఈ చట్టం మహిళల వ్యక్తిగత స్వతంత్రతను, గోప్యతను, హూందాను హరిస్తుందని పేర్కొంది. అంతేకాకుండా అడల్ట్రీని నేరంగా పరిగణిస్తే.. వివాహ వ్యవస్థ దెబ్బతింటుదని పేర్కొంది. అడల్ట్రీని నేరంగా చేసినంత మాత్రాన.. వివాహాలను కాపాడలేమని.. అది కేవలం వ్యక్తుల గోప్యతను హరించి.. శిక్షించడమే అవుతుందని చెప్పింది. అయితే అడల్ట్రీ ప్రస్తుతం నేరం కానప్పటికీ.. దాని ఆధారంగా విడాకులు కోరవచ్చు.అడల్ట్రీని నేరంగా పరిగణించాలనే వాదనేంటి..!

సుప్రీం తీర్పు వెలువరించిన నుంచి అడల్ట్రీపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అడల్ట్రీని మళ్లీ నేరంగా.. భారతీయ న్యాయ సంహిత లో చేర్చాలని 2023లో హోమ్ అఫైర్స్ పార్లమెంటరీ కమిటీ సూచించింది. ఇప్పుడు కూడా ఓ వర్గం అడల్ట్రీని క్రిమినలైజ్ చేయాలని వాదిస్తోంది. లింగ అసమానతలు లేకుండా అడల్ట్రీని నేరంగా పరిగణించి చట్టాలు చేస్తే.. వివాహ వ్యవస్థను కాపాడుతుందని వాదిస్తున్నారు.


ఇలా చేయకపోతే వ్యక్తుల్లో భయం అనేది ఉండకుండా విచ్చలవిడిగా ప్రవర్తిస్తారని చెబుతున్నారు. అది నేరం కాకపోతే వివాహ వ్యవస్థ దెబ్బతింటుందని అంటున్నారు.

## అద్దెకు అమ్మమ్మ, తాతయ్యలు: అసలీ కాన్సెప్ట్ ఏంటీ, నెలకు ఎంత తీసుకుంటారంటే?



**న్యూఢిల్లీ–నవభూమి:** ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. నానమ్మ, తాతయ్య, ముత్తమ్మల దగ్గర నుంచి పిన్ని, బాబాయి, అత్త, మామ సహా అనేక మంది ఇంట్లో ఉండేవాళ్లు. వీరంతా పిల్లలను చూసుకుంటూ ప్రేమను పంచేవాళ్లు. అలాగే వారికి ఎన్నెన్నో మంచి విషయాలను నేర్పించేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. కన్నవాళ్లను వృద్ధాశ్రమాల్లో పడేస్తూ.. తమకు పుట్టిన వాళ్లను మాత్రమే తమతో ఉంటుకుంటూ జీవిస్తున్నారు. ఫలితంగా చిన్న చిన్న కుటుంబాలు ఎక్కువయ్యాయి. ఈ ఇళ్లల్లో భార్యాభర్తలు వారి పిల్లలు తప్ప మరెవరూ ఉండట్లేదు. ఒక్కరే సంతానం ఉన్న వారి సంఖ్య కూడా విపరీతంగా పెరిగిపోగా.. ఫలితంగా చిన్నారుల్లో ఒంటరితనం ఏర్పడుతోంది. అమ్మా, నాన్నలు తమ పనుల్లో బిజీగా ఉండి ఆ ఉన్న ఒక్కరిని కూడా సరిగ్గా పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయి.మరోవైపు వృద్ధాశ్రమల్లో ఉంటున్న వాళ్లు కూడా మనవళ్లు, మనవరాళ్లకు దూరమయ్యామని బాధ పడుతున్నారు. ఎప్పుడూ వారినే తలుచుకుంటూ నరకం చూస్తున్నారు. ఈ సమస్యలు అన్నీ అర్థం చేసుకున్న ఓ వృద్ధాశ్రమం ఈ సమస్యకు చెక్ పెట్టబోతుంది. ముఖ్యంగా అద్దెకు వృద్ధులను ఇస్తూ.. ఇటు పెద్దల్లో, అటు పిల్లల్లో ఒంటరితనాన్ని పోగొట్టాలని ప్లాన్ చేస్తోంది. అలాగే అద్దెకివ్వగా వచ్చిన డబ్బును వాళ్ల ఖర్చులకే ఉపయోగిస్తూ ఆర్థికంగా కూడా సాయం చేస్తోంది. మరి ఈ కొత్త స్కీమ్ తెచ్చిన వృద్ధాశ్రమం ఎక్కడుంది, నెలకు ఎంత డబ్బులు తీసుకుంటారో మనం ఇప్పుడు తెలుసుకుందాం. వృద్ధులను అద్దెకు ఇచ్చే కాన్సెప్ట్‌ను జపాన్ ప్రారంభించింది. అక్కడ చాలా వృద్ధాశ్రమాలు పిల్లల్లో, వృద్ధుల్లో ఒత్తిడిని పోగొట్టేందుకు ఈ కార్యక్రమం చేపడుతుండగా.. భారత్ కూడా కొత్తగా దీన్ని ప్రారంభించింది. ముఖ్యంగా దేశంలోనే మొట్ట మొదటిసారి ఆగ్రా నగరంలోని రామ్‌లాల్ వృద్ధాశ్రమం ఈ వినూత్న కార్యక్రమాన్ని అవలంభిస్తోంది. ఇది కేవలం ఆర్థికపరమైన లావాదేవీ మాత్రమే కాదని.. అంతకు మించి లోతైన భావోద్వేగాలను పంచుకునే ఒక మానవతా కార్యక్రమమని ఆశ్రమం నిర్వాహకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ పథకం కింద ఒక కుటుంబం అద్దెకు వృద్ధులను తీసుకెళ్లాలనుకుంటే.. ముందుగా రూ. 11 వేలు డిపాజిట్ చేయాలి. ఈ మొత్తంలో కొంత భాగం వృద్ధులకు వ్యక్తిగత ఖర్చుల కోసం అందజేస్తారు. మిగిలిన మొత్తాన్ని వృద్ధాశ్రమం నిర్వహణ కోసం వినియోగిస్తారు. ఈ విధానం వల్ల పిల్లలు, యువత వృద్ధుల అనుభవాల నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటారు. వారికి సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు తెలుస్తాయి. అంతేకాకుండా ఇటు వృద్ధులకు కూడా తమ జీవితం ఉపయోగపడుతుందన్న సంతృప్తి లభిస్తుంది. ఒంటరిగా ఉన్న వారికి తోడు దొరుకుతుంది. ఇది తమ మనవళ్లు, మనవరాళ్లను దూరమైన భావనను కోల్పోయేలా చేసి కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. అలాగే జీవితంపై వారికి ఆశను కలిగిస్తుంది. అయితే ఈ కార్యక్రమంపై మిశ్రమ స్పందనలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు దీన్ని మానవ సంబంధాలను అద్దెకు ఇచ్చే వ్యాపారం అని విమర్శిస్తుండగా.. మరికొందరు దీనిని ఒక

## షాకింగ్.. రాత్రివేళ లేడీస్ హాస్టల్‌లోకి ముసుగు వ్యక్తి...



**బెంగళూరు–నవభూమి:** దేశ ఐటీ రాజధాని బెంగళూరు నగరంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. లేడీస్ హాస్టల్‌లోకి దూరిన గుర్తుతెలియని వ్యక్తి.. ఓ యువతి గదిలోకి ప్రవేశించి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అనంతరం ఆమె వద్ద డబ్బును లూటీచేసి పారిపోయాడు. ఈ ఘటన బెంగళూరులోని గంగోత్రి సర్కిల్‌లో ఓ పీజీలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జరగ్గా.. బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. తనను ఎవరూ గుర్తుపట్టకుండా నిందితుడు ముఖానికి మాస్క్ ధరించినట్టు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది.

పోలీసుల కథనం ప్రకారం.. మాస్క్ వేసుకుని వచ్చిన నిందితుడు.. బాధితురాలు నిద్రపోతున్న సమయంలో గదిలోకి ప్రవేశించాడు. ఆ గదిలోకి వెళ్లడానికి ముందు ఆ ఫ్లోర్‌లోని మిగతా గదులకు బయట నుంచి గడియపెట్టాడు. బెడ్‌పై నిద్రపోతున్న యువతి దగ్గరకు అసభ్యంగా తాకడంతో మెల్కొన్న ఆమె కేకలు వేసి.. అతడ్ని అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో నిందితుడు కత్తిచూపించి బెదిరించి, ఆమె కాళ్లను తన గోళ్ళతో గీకి, దాడి చేశాడు. ఆ తర్వాత ఆమె కప్‌బోర్డులో ఉంచి రూ.2,500 తీసుకుని ఉడాయించాడు.వెంటనే బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీనిపై లైంగిక వేధింపులు, చోరీ, దాడి తదితర సెక్షన్ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పీజీకి చేరుకుని గదిని పరిశీలించారు. అనంతరం అక్కడ సీసీటీవీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలను పరిశీలించగా.. నిందితుడు ముఖానికి మాస్క్ వేసుకుని ఉండటం కనిపించింది. ఈ ఘటనతో మరోసారి పీజీల్లో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి మూడు వారాల కిందట కూడా ఇటువంటి ఘటనే చోటుచేసుకుంది. ఆగస్టు 11న యలహంకలోని ఓ పీజీలోకి ప్రవేశించిన గుర్తుతెలియని వ్యక్తి... ఓ మహిళను కత్తితో బెదిరించి ఆమె మొబైల్ ఫోన్ను ఎత్తుకెళ్లాడు.సంఘటన జరిగిన రోజు బాధితురాలు ఆఫీసు నుంచి తిరిగి వచ్చి మూడో అంతస్తులో ఉన్న తన గదికి వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో తలుపు తట్టిన శబ్దం విని, అది సిబ్బంది అయి ఉండవచ్చని భావించి తెరిచింది. నిందితుడు లోపలికి ప్రవేశించి, ఆమెను బలవంతంగా లాక్కొని, మెడపై కత్తి పెట్టి డబ్బులు, చేతులకు ధరించిన బంగారు గాజులు ఇచ్చేయాలని డిమాండ్ చేశాడు. బలవంతంగా గాజులను లాక్కోడానికి ప్రయత్నించి, ఆమెను లైంగికంగా వేధించాడు.

## ఎన్నికల సంఘానికి, పార్టీలకు మధ్య విభేదాలు దురదృష్టకరం : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ–నవభూమి:** కేంద్ర ఎన్నికల సంఘానికి వివిధ రాజకీయ పార్టీల కు మధ్య విభేదాలు దురదృష్టకరమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. బీహార్ ) లో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రత్యేక సమగ్ర సవరణ తర్వాత ఈసీ ప్రకటించిన ముసాయిదా ఓటర్ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు విధించిన సెప్టెంబర్ 1 డెడ్‌లైన్‌ను పొడిగించాలని దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారణ జరిపింది.ముసాయిదా ఓటర్ జాబితాపై ఫిర్యాదుల విషయంలో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేయాలని బీహార్ లీగల్ సర్వే అథారిటీకి సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. సెప్టెంబర్ 1 తర్వాత కూడా అభ్యంతరాలను స్వీకరిస్తామని, నామినేషన్ల దాఖలు చివరి తేదీవరకు సవరణలు కొనసాగుతాయని సుప్రీంకోర్టుకు ఎన్నికల సంఘం తెలిపింది. ఇదే విషయాన్ని కోర్టు పిటిషనర్‌ల వద్ద ప్రస్తావించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ ఆ రాష్ట్రంలో ఓటరు జాబితాను సవరించి ఆగస్టు 1న ముసాయిదా జాబితాను విడుదల చేసింది.ఈ జాబితాను ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేయడంతోపాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1 లోగా తెలియజేయాలని కోరింది. దాంతో అభ్యంతరాలను తెలియజేయాల్సిన గడువును పొడిగించేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్‌లపైననే తాజాగా విచారణ జరిగింది. ముసాయిదా జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఈసీ తొలగించింది. మరోవైపు పౌరసత్వంపై అనుమానాలున్న మూడు లక్షల మందికి నోటీసులు పంపించినట్లు ఈసీ తెలిపింది.

## పాకిస్థాన్ ప్రధానికి చేదు అనుభవం.. షరీఫ్‌ను పట్టించుకోని మోదీ, పుతిన్



**షాంఘై– నవభూమి:** పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు చేదు అనుభవం ఎదురైంది. చైనాలోని తియాంజిన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంఘం శిఖరాగ సమావేశాలకు ప్రపంచ దేశాధినేతలు హాజరయ్యారు. అయితే ఈ మీటింగ్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్, భారత ప్రధాని మోదీ కూడా పాల్గొన్నారు. సోమవారం జరిగిన ఎస్‌సీవో సమావేశంలో పుతిన్, మోదీపైనే అందరి దృష్టి నిలిచింది. ఓ దశలో పుతిన్, మోదీ.. ఇద్దరూ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందు నుంచే వెళ్లారు. పుతిన్, మోదీలు మాట్లాడుకుంటూ ముందుకు నడిచారు. వరుసగా నిలబడ్డ పాక్ ప్రధాని గురించి ఆ ఇద్దరూ ఆలోచించలేదు. పుతిన్, మోదీ ముందు నుంచి వెళ్తుంటే పాక్ ప్రధాని షరీఫ్ వాళ్లను చూస్తూ ఉండిపోయారు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతున్నది. మీటింగ్ ప్రారంభానికి ముందు మోదీ, పుతిన్ హగ్ చేసుకున్నారు. ఎస్‌సీవో ప్రొసిడింగ్స్ తర్వాత పుతిన్, మోదీలు ద్వైపాక్షిక భేటీ కోసం కలిసి వెళ్లారు. పుతిన్‌తో సంభాషణ చాలా గాఢంగా ఉన్నట్లు మోదీ తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎస్‌సీవో కాన్ఫరెన్స్ వేదిక నుంచి ద్వైపాక్షిక మీటింగ్ జరిగే రిట్జ్ కార్లటన్ హోటల్ వరకు ఇద్దరూ ఒకే కారులో కలిసి వెళ్లారు. మోదీ రాక కోసం పుతిన్ పది నిమిషాలు ఎదురుచూసినట్లు తెలుస్తోంది. ఇద్దరూ సుమారు 45 నిమిషాల పాటు కారులోనే వివిధ అంశాలపై చర్చించుకున్నారు. ఆ తర్వాత ద్వైపాక్షక భేటీలోనూ గంటకుపైగా మాట్లాడుకున్నారు.

## షరతులు అతిక్రమిస్తున్నారు.. జారంగే దీక్షపై హైకోర్టు ఆగ్రహం

**ముంబై– నవభూమి:** మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జారంగే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. ఓబీసీ కేటగిరిలో మరాఠాలకు రిజర్వేషన్ ఇవ్వాలంటూ ముంబై ఆజాద్ మైదాన్‌లో గత శుక్రవారం నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు. దీంతో జనజీవనానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో మనోజ్ జారంగేపై ముంబై హైకోర్టు సోమవారంనాడు మండిపడింది. జారంగే సారథ్యంలోని నిరసనలు శాంతియుతంగా లేవని, ఏ షరతుల మీద దీక్షకు అనుమతించామో వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది.సిటీ మొత్తం స్తంభించిపోతోందని, దక్షిణ ముంబైలోని కీలక ప్రాంతాలు నిరసనకారులతో నిండిపోతున్నాయని కోర్టు పేర్కొంది. కోటా నిరసలకు వ్యతిరేకంగా ఆర్మీ ఫౌండేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు రవీంద్ర ఘుగే, గౌతమ్ అంఖాడ్‌లతో కూడిన స్పెషల్ బెంచ్ ప్రత్యేక విచారణ జరిపింది.మరాఠాలను కుంబీలుగా గుర్తించి ఓబీసీల్లో చేర్చాలని, అప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో మరాఠాలకు రిజర్వేషన్లు వస్తాయని జారంగే డిమాండ్‌గా ఉంది. తన డిమాండ్ రాజ్యాంగబద్ధమైనదని, కుంబీలు, మరాఠాలు ఒకే సామాజిక వర్గంగా ప్రభుత్వ రికార్డులు కూడా చెబుతున్నాయని ఆయన అంటున్నారు. ప్రభుత్వం తన డిమాండ్లు అంగీకరించకుంటే మంచినీళు కూడా తాగడం మానేస్తానని తాజాగా ఆయన హెచ్చరించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్
మంగళవారం
02 । సెప్టెంబర్ । 2025



## ఈ రోజు నుంచి కొత్త రూల్స్.. సిలిండర్ ధరలు, రిజిస్టర్డ్ పోస్ట్.. మారేవి ఇవే..




**న్యూఢిల్లీ-నవభూమి:**మరో కొత్త నెల వచ్చేసింది. సెప్టెంబర్ నెల ఈ రోజు నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో పలు కీలక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాణిజ్య సిలిండర్ ధర తగ్గింపు, రిజిస్టర్డ్ పోస్ట్‌ను స్పీడ్ పోస్ట్‌తో విలీనం చేయడం, వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్, మోసపూరిత కాల్‌లపై చర్యలు వంటి అనేక కీలక మార్పులు వినియోగదారులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితం చేయనున్నాయి ఇండియా పోస్ట్ తన ఐకానిక్ రిజిస్టర్డ్ పోస్ట్ సేవను సెప్టెంబర్ 1, 2025 నుంచి రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. రిజస్టర్డ్ పోస్ట్‌కు ఆదరణ తగ్గడం, వినియోగం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఇండియన్ పోస్టల్ సర్వీస్ ఈ నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి రిజిస్టర్డ్ పోస్ట్ సర్వీస్‌ను స్పీడ్ పోస్ట్ సర్వీస్‌తో విలీనం అవుతుంది.%వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలు రూ. 51.50 తగ్గాయి. ఈ ధరలు సెప్టెంబర్ 01 నుంచి అమలులోకి వస్తాయి. ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ రిటైల్ అమ్మకపు ధర సెప్టెంబర్ 1 నుంచి రూ. 1580 అవుతుంది. అయితే14.2 కిలోల గృహ సిలిండర్ల ధరలలో ఎటువంటి మార్పు లేదు.



## ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ భూప్రకంపనలు

ఆఫ్ఘనిస్తాన్ అనే దేశం ప్రపంచ పటంలో ఒక విషాదగాథలా నిలిచిపోయింది. యుద్ధాలు, అంతర్యుద్ధాలు, మతపరమైన ఘర్షణలు, మానవ హక్కుల ఉల్లంఘనలు, తీవ్రవాద దాడులు- ఇలా ఎన్నో రకాల కష్టాలను ఎన్నో దశాబ్దాలుగా భరిస్తూ వచ్చిన ఆ దేశ ప్రజలు ఇప్పుడు ప్రకృతి వైపరీత్యం అనే మరొక భయంకర పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఇటీవల సంభవించిన 6.3 తీవ్రత గల భూకంపం ఆ దేశాన్ని మళ్లీ శిథిలాల మయం చేసింది. హోమ్ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం కనీసం 622 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 400 మందికి పైగా గాయపడినట్లు ధృవీకరించబడింది. ఆసుపత్రులు గాయాలతో విలవిలలాడుతున్న బాధితులతో నిండిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్న మరెంతమంది బతికి ఉన్నారో, ఎంతమంది చనిపోయారో ఇంకా అంచనా వేయలేని స్థితి కొనసాగుతోంది.ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంపాల ప్రభావం అంతర్జాతీయ స్థాయిలో కదిలించింది. ఎందుకంటే ఇది కేవలం ఒక దేశ విపత్తు మాత్రమే కాదు, దాని పరిసర ప్రాంతాలనూ ప్రభావితం చేసింది. పాకిస్తాన్‌లోనూ ప్రకంపనలు సంభవించాయి. భారత్ ఉత్తర భాగం, ముఖ్యంగా ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లోనూ ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. ఈ విధంగా ఒక దేశానికి సంభవించిన భయంకర విపత్తు సమీప దేశాల మనోస్థితిని కూడా కుదిపేసింది.భూకంపాల విషయంలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఒక ప్రత్యేకమైన చరిత్ర ఉంది. ఇది హిందూ ఖుష్ పర్వతాల పరిధిలో ఉండటమే కారణం. ఈ ప్రాంతం భూకంపాలకు అతి సున్నితమైన జోన్‌గా గుర్తించబడింది. అక్కడ భూకంప తరంగాలు విపరీతంగా ఉత్పత్తి అవుతాయి. గత రెండు దశాబ్దాల్లో ఆఫ్ఘనిస్తాన్‌లో అనేక విధ్వంసకర భూకంపాలు సంభవించాయి. 2023లోనే రిక్టర్ స్కేల్‌పై 6.3 తీవ్రత గల భూకంపం చోటుచేసుకుని 4000 మందికిపైగా ప్రాణాలు బలిగొన్నాయి. యునైటెడ్ నేషన్స్ లెక్కల ప్రకారం ఆ సమయంలో కనీసం 1500 మంది తీవ్రంగా గాయపడ్డారు. అంటే, ప్రకృతి అక్కడి ప్రజలపై ఒక రకంగా నిరంతర దాడులు చేస్తున్నట్లే ఉంది.భూకంపం సంభవించిన క్షణంలోనే గ్రామాలు కూలిపోయాయి. మట్టి ఇళ్లు, బలహీన నిర్మాణాలు క్షణాల్లో నేలమట్టమయ్యాయి. ఎప్పటిలాగే అత్యధికంగా మృతులు పేదవారి మధ్యే నమోదయ్యారు. ఎందుకంటే, వారే అతి బలహీనమైన, నిర్మాణ పరంగా నిస్సహాయమైన ఇళ్లలో నివసిస్తున్నారు. కూలిన ఇళ్ల శిథిలాల్లో చిక్కుకుని ఊపిరి ఆడక చనిపోయిన చిన్నారులు, బతిమాలుతూ ప్రాణాలు విడిచిన మహిళలు, కుటుంబ సభ్యులను కోల్పోయి బోసిపోయిన కళ్ళతో వీధుల్లో తిరుగుతున్న వృద్ధులుఈ దృశ్యాలు మానవతను కుదిపివేస్తున్నాయి.

ఈ భూకంపం ఒక భయంకర మానవ సంక్షోభాన్ని తెచ్చింది. మృతదేహాలు బహిరంగంగా పడి ఉన్నాయి. వాటిని దహనం చేయడానికి లేదా సమాధి చేయడానికి సరైన వసతులు లేవు. ఆహారం, తాగునీరు, వైద్యసదుపాయాలు అనే ప్రాథమిక అవసరాలు తీరడం లేదు. సహాయక చర్యలు ప్రారంభమైనప్పటికీ, దూరప్రాంతాలకు చేరుకోవడం చాలా కష్టంగా మారింది. రోడ్లు ధ్వంసమయ్యాయి. టెలికమ్యూనికేషన్ అంతరాయం కలిగింది. చాలా గ్రామాల పరిస్థితి ఇప్పటికీ వెలుగులోకి రాలేదు. అంటే, వాస్తవానికి మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండే అవకాశముంది.ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రస్తుత పాలనా పరిస్థితి సహాయక చర్యలకు మరింత కఠినతరం చేస్తోంది. తాలిబన్ ప్రభుత్వ పాలనలో ఉన్న ఆ దేశం అంతర్జాతీయ గుర్తింపు లేకపోవడం వల్ల గ్లోబల్ సహాయాలు చేరుకోవడంలో ఇబ్బందులు వస్తున్నాయి. కొన్ని దేశాలు సహాయం అందించడానికి ముందుకు వచ్చినా, సమన్వయం లోపం, లాజిస్టిక్స్ సమస్యలు, తగిన పర్యవేక్షణ లేకపోవడం వంటి కారణాల వల్ల సహాయక చర్యలు ఆశించిన వేగంతో జరగడం లేదు. ఈ కారణంగా బాధితులు ఇంకా ఎక్కువగా దెబ్బతింటున్నారు.ప్రకృతి వైపరీత్యం అనే విపత్తు ఒక నిర్దిష్ట జాతి, మతం, వర్గం మీద కాకుండా సమాజం మొత్తాన్ని కుదిపేస్తుంది. కానీ విపత్తు సమయంలో ఎవరికి ఎంత రక్షణ లభిస్తుందో అనేది మాత్రం పాలన, వనరులు, సమన్వయంపై ఆధారపడి ఉంటుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఈ అంశాలు చాలా బలహీనంగా ఉండటమే ఇప్పటి దుర్భర పరిస్థితికి మూలకారణం. ఒకవైపు యుద్ధాల చరిత్ర, మరోవైపు తీవ్రవాద పాలన, ఇప్పుడు ప్రకృతి వైపరీత్యం %-% ఈ మూడు కలిసి ఆఫ్ఘనిస్తాన్ ప్రజలను అంతులేని నరకంలోకి నెడుతున్నాయి.ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం తన బాధ్యతను మరిచిపోకూడదు. ఇప్పటికే ఐక్యరాజ్యసమితి, రెడ్‌క్రాస్, డాక్టర్స్ విథౌట్ బార్డర్స్ వంటి కొన్ని అంతర్జాతీయ సంస్థలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. కానీ వీటి పరిధి చాలా పరిమితంగా ఉంది. మరిన్ని దేశాలు, మరిన్ని సంస్థలు ముందుకు రావాలి. ముఖ్యంగా ఆసియా ఖండంలోని శక్తివంతమైన దేశాలు ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు అండగా నిలబడాలి. ఎందుకంటే ఇది కేవలం ఒక దేశానికి సహాయం చేయడం కాదు, మానవతను కాపాడడం.

# ఆదిత్య-ఎల్1 - సూర్యుడిపై భారత్ విజయగాథ



చరిత్రలో కొన్ని క్షణాలు కేవలం గడిచిన సమయాన్ని మాత్రమే సూచించవు, అవి భవిష్యత్తుకు ఒక బలమైన పునాది వేస్తాయి. 2023వ సంవత్సరం భారతదేశానికి అలాంటి క్షణాలనే అందించింది. చంద్రుడిపై మన చంద్రయాన్-3 అడుగుపెట్టినప్పుడు దేశం మొత్తం గర్వంతో పులకించిపోయింది. ఆ ఉత్సాహం ఇంకా కొనసాగుతుండగానే భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. అదే ఆదిత్య-ఎల్1 మిషన్. ఈ మిషన్ కేవలం ఒక రాకెట్ ప్రయోగం మాత్రమే కాదు, ఇది ఒక దేశం తన సామర్థ్యాలను పూర్తిస్థాయిలో విశ్వసించినప్పుడు ఏం సాధించగలదో ప్రపంచానికి నిరూపించిన ఒక చరిత్రాత్మక ఘట్టం. ఈ విజయాలు, భారతదేశం ఇకపై కేవలం ఒక కలలు కనే దేశం కాదని, వాటిని నిజం చేసుకోగల సత్తా ఉన్న దేశమని చాటిచెప్పాయి.

?సూర్యుడి రహస్యాలను ఛేదించడానికి ఆదిత్య-ఎల్1:

?సూర్యుడు మన సౌర వ్యవస్థకు శక్తినిచ్చే ప్రధాన మూలం. కానీ, మనం రోజూ చూసే ఈ ప్రకాశవంతమైన నక్షత్రం గురించి మనకు ఇంకా తెలియని విషయాలు ఎన్నో ఉన్నాయి. సూర్యుడి ఉపరితల ఉష్ణోగ్రత దాదాపు 6,000 డిగ్రీల సెల్సియస్ అయితే దాని బాహ్య వాతావరణం అంటే కరోనా ఉష్ణోగ్రత మాత్రం లక్షల డిగ్రీల సెల్సియస్‌ను మించి ఉంటుంది. ఇది ఎలా సాధ్యమనేది దశాబ్దాలుగా శాస్త్రవేత్తలను కలవరపెడుతున్న ఒక పెద్ద మిస్టరీ. ?అంతేకాకుండా సూర్యుడి నుంచి అప్పుడప్పుడు భారీగా వేడి గాలులు, విద్యుత్ అయస్కాంత కణాలు, సౌర తుఫానులు వస్తాయి. వీటిని కరోనల్ మాస్ ఎజెక్షన్లు - సిఎంఈలు అంటారు. ఇవి భూమిని చేరినప్పుడు, మన కమ్యూనికేషన్ ఉపగ్రహాలు, టివి., రేడియో, జిపిఎస్. సిగ్నల్స్‌ను దెబ్బతీసే ప్రమాదం ఉంది. 1989లో కెనడాలో ఒక సౌర తుఫాను వల్ల భారీ విద్యుత్ అంతరాయం ఏర్పడింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలను నివారించడానికి, ఈ సౌర




తుఫానులను ముందుగానే తెలుసుకోవడం, వాటి ప్రభావం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడం చాలా అవసరం. అందుకే ఇస్రో ఈ ప్రత్యేకమైన ఆదిత్య-ఎల్1 మిషన్‌ను చేపట్టింది. ఆదిత్య-ఎల్1 ప్రయాణం, లాగ్రాంజ్ పాయింట్ ఈ మిషన్ ప్రయాణం చాలా ప్రత్యేకమైనది.2 సెప్టెంబర్ 2023న, ఆదిత్య-ఎల్1ను మన స్వదేశీ రాకెట్ పిఎస్ఎల్వి - సి57 ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఈ ఉపగ్రహం భూమి చుట్టూ కొన్ని కక్ష్యలలో తిరిగిన తర్వాత దాని వేగాన్ని పెంచడానికి, భూమి గురుత్వాకర్షణ క్షేత్రం నుంచి బయటపడటానికి దశలవారీగా థ్రస్టర్‌లను మండించడం జరిగింది. సుమారు 127 రోజుల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఇది జనవరి 6న తన లక్ష్య స్థానమైన లాగ్రాంజ్ పాయింట్ 1(ఎల్1)కి చేరుకుంది. లాగ్రాంజ్ పాయింట్ అనేది అంతరిక్షంలో ఒక అసాధారణ ప్రదేశం. ఇది భూమికి దాదాపు 15లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పాయింట్ వద్ద సూర్యుడు, భూమి గురుత్వాకర్షణ బలాలు ఒకదానికొకటి సమానంగా ఉంటాయి. ఫలితంగా ఉపగ్రహం ఇంధనం తక్కువగా ఖర్చు చేస్తూ, ఒక స్థిరమైన కక్ష్యలో తిరగగలదు. ఈ ప్రత్యేకమైన స్థానం నుంచి, ఉపగ్రహం సూర్య గ్రహణాలు లేదా ఇతర అంతరిక్ష వస్తువులు అడ్డుపడకుండా సూర్యుడిని 24 గంటలు నిరంతరాయంగా గమనించగలుగుతుంది. ఈ నిరంతర వీక్షణ సూర్యుడి ప్రవర్తనలోని సూక్ష్మ మార్పులను సైతం గుర్తించడానికి వీలు కల్పిస్తుంది.

**మిషన్ పరికరాలు:**

అతినీలలోహిత కాంతి తరంగదైర్ఘ్యాలలో తీసేసోలార్ అల్ట్రావైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ (ఎస్యుఐటి), భూమిపై అంతరిక్ష వాతావరణాన్ని ప్రభావితం చేసే సూర్యుడి నుంచి వచ్చే సౌర గాలులను, వాటిలోని రేణువులను అధ్యయనం చేసే ఏఎస్పిఈఎక్స్ అండ్ పిఎపిఎ పరికరాలు, సూర్యుడి నుంచి వచ్చే ఎక్స్-రేలను కొలిచి, సౌర మంటల గురించి సమాచారం ఇచ్చే ?ఎస్ఓఎల్ఈఎక్స్ అండ్ హెచ్ఈఎల్1ఓ.ఎస్, ఎల్1 పాయింట్ వద్ద ఉన్న అయస్కాంత క్షేత్రంలో వచ్చే మార్పులను కొలిచే మాగ్నెటోమీటర్ లాంటి పేలోడ్లు ఉన్నాయి. ఇవి ఒక టీమ్‌లాగా పనిచేసి సూర్యుడి గురించి మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలను బయటపెడతాయి.?

**పరిశోధనా ఫలితాలు - దాని ప్రాముఖ్యత:**

ఆదిత్య-ఎల్1 సేకరించిన డేటా ఇప్పటికే ప్రపంచ శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తోంది. విఇఎల్సి నుంచి వచ్చిన మొదటి డేటా ఆధారంగా భారతీయ పరిశోధకులు 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్'లో ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించారు. ఆ పత్రంలో వెల్లడైన కొన్ని ఆసక్తికరమైన విషయాలు.

**కరోనల్ డిమ్మింగ్:**

జూలై 2024లో సంభవించిన ఒక కరోనల్ మాస్ ఎజెక్షన్ (సిఎంఈ) సమయంలో ఆ ప్రాంతంలో కరోనా కాంతి దాదాపు 50% తగ్గిపోయినట్లు గమనించారు. ఇది ఆ ప్లాస్మా, వేడి గాలులు వేగంగా అంతరిక్షంలోకి వెళ్తున్నాయని స్పష్టంగా చూపిస్తుంది.

**ఉష్ణోగ్రత, అల్లకల్లోలం పెరుగుదల:**

ఈసిఎంఈ. సమయంలో ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రత అసాధారణంగా పెరిగినట్లు గుర్తించారు.

**ప్లాస్మా విచలనం:**

సూర్యుడి నుంచి బయలుదేరిన ప్లాస్మా మన భూమి వైపు కాకుండా సూర్యుడి అయస్కాంత క్షేత్రాల వల్ల పక్కకు వెళ్లిపోయిందని కనుగొన్నారు. ఈ సమాచారం భవిష్యత్తులో సౌర తుఫానులు ఎటువైపు వెళ్తాయో అంచనా వేయడానికి చాలా ముఖ్యమైనది.

ఈ పరిశోధనలు కేవలం శాస్త్రీయ ఆవిష్కరణలు మాత్రమే కాదు. మన భూమిపై ఉన్న సాంకేతికతను కాపాడుకోవడానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి. సౌర తుఫానులు రాకముందే మనకు హెచ్చరికలు లభిస్తే మన ఉపగ్రహాలను, విద్యుత్ గ్రిడ్‌లను సురక్షితంగా ఉంచగలం.

**ఆత్మవిశ్వాసం- ఆత్మనిర్భరతకు చిహ్నం:**

ఆదిత్య-ఎల్1 మిషన్ అనేది కేవలం ఒక అంతరిక్ష విజయం మాత్రమే కాదు. ఇది ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశ స్థానాన్ని పదిలం చేసింది. గతంలో అమెరికా, యూరప్, జపాన్ వంటి కొన్ని దేశాలు మాత్రమే సాధించగలిగిన ఇలాంటి క్లిష్టమైన మిషన్లను భారతదేశం విజయవంతంగా పూర్తి చేయడం మన సాంకేతిక సామర్థ్యానికి, శాస్త్రవేత్తల **నిబద్ధతకు నిదర్శనం.**

ఈ విజయం మన యువ శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు ఒక బలమైన ప్రేరణ. ఇది అంతరిక్ష పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచి, భవిష్యత్ తరాలకు ఒక ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఆదిత్య-ఎల్1 ద్వారా లభించే ప్రతి చిన్న సమాచారం, మన అంతరిక్ష వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి, మన ఉపగ్రహాలను, సాంకేతిక వ్యవస్థలను సౌర తుఫానుల వంటి ప్రమాదాల నుంచి కాపాడుకోవడానికి సహాయపడుతుంది. ఆదిత్య-ఎల్1 భారతదేశ ప్రగతికి, స్వయం సమృద్ధికి ఒక గొప్ప ఉదాహరణ. ఇది కేవలం సూర్యుడిని చూడటం కాదు, మన భవిష్యత్తును చూడటం. అసాధ్యం అనిపించిన కలలను నిజం చేసుకోవడం.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

ఈ కథనాన్ని దిగువ వెబ్‌సైట్‌లో చదవొచ్చు
www.navabhoomidaily.com

# కార్మికుల శ్రమ - పెట్టుబడిదారుల లాభాం



విప్లవం, మార్పు, సమాజ పునర్నిర్మాణం అనే పదాలు మన రాజకీయ-సామాజిక చరిత్రలో పునరావృతమవుతూ వస్తుంటాయి. ఈ పదాల వెనుక ఉన్న సారాన్ని వక్రీకరించడానికి ప్రయత్నాలు ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయి. మార్క్సిజాన్ని లక్ష్యంగా చేసుకొని విసిరే శాపనార్థాలూ, వాదనలూ కొత్తవేమీ కావు. 19వ శతాబ్దం నుండి ఇప్పటివరకు పెట్టుబడిదారీ వర్గాల అనుకూల మేధావులు, వారి అనుచరులు ఒకే ధోరణితో మార్క్సిజాన్ని దూషిస్తూనే ఉన్నారు. కానీ, శ్రమ దోపిడీని ప్రాతిపదికగా చేసుకున్న పెట్టుబడిదారీ వ్యవస్థపై మార్క్స్, ఏంగెల్స్ ప్రతిపాదించిన సిద్ధాంతం మాత్రమే సమాజ విముక్తికి శాశ్వత మార్గం చూపిందని అనేక ఉదాహరణలు నిరూపిస్తున్నాయి.విప్లవం చాలించాలి అంటూ వి.వి. సుబ్రహ్మణ్యం వంటి వారు చేసే వ్యాఖ్యలు వాస్తవానికి పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించడానికి చేసే ప్రయత్నాలే. మార్క్సిజం "రోగం కన్నా హానికరమైన మందు" అని, "విషప్రాయమైన ఔషధం" అని పిలవడం కేవలం పదజాలం ఆట మాత్రమే. శ్రమదోపిడీ అనే అసలు సమస్యపై ఒక్క మాట కూడా లేకుండా మార్క్సిజాన్ని నిందించడం, అది ఒక వికృత సిద్ధాంతమని తేల్చేయడం, మూల సమస్య నుండి పాఠకులను దూరం పెట్టే ప్రయత్నం.శ్రమ దోపిడీ పెట్టుబడిదారీ సమాజపు గుండెకాయ. ఏ పరిశ్రమలోనైనా, యజమాని లాభం పొందే విధానం కార్మికుల శ్రమ విలువను కబళించడం ద్వారానే ఉంటుంది. ఉత్పత్తిని సృష్టించే వారు కార్మికులే. కానీ ఆ ఉత్పత్తి విలువలో పెద్ద భాగం పెట్టుబడిదారీ వర్గం లాభాల రూపంలో కాజేస్తుంది. ఈ అన్యాయం మార్క్స్ చూపించిన "రోగం". దానికి పరిష్కారం చూపిన మార్క్సిజమే "మందు". దాన్ని విషమని ముద్ర వేయడం అనేది దోపిడీ వర్గం చేసే మభ్యపెట్టే ప్రక్రియ తప్ప మరేమీ కాదు.మార్క్సిజంపై వచ్చిన విమర్శలు ఇతర దేశాలలో కూడా ఇదే స్వరంతో వినిపించాయి. ఫ్రాన్స్‌లో రేమండ్ యారన్ మార్క్సిజాన్ని "మేధావుల మత్తుమందు" అని పిలిచాడు. ఇటలీకి చెందిన గెటానో మాస్కా మార్క్స్ రచనలను "వర్గ ద్వేషాన్ని రెచ్చగొట్టే పుస్తకాలు" అని విమర్శించాడు. కానీ ఈ విమర్శలు పెట్టుబడిదారీ వర్గానికి మేలు చేసే రాజకీయ వాదనలే గానీ, సమాజంలోని అసలు దోపిడీ వ్యవస్థకు సమాధానాలు కావు.మార్క్సిజం విప్లవాన్ని దానంతటదే వస్తుందని చెప్పిందని చేసే వాదన కూడా అసత్యమే. "కార్మిక వర్గం ఒక వర్గంగా రూపొందాలి, రాజకీయ అధికారాన్ని గెలుచుకోవాలి, ఉత్పత్తి సాధనాలను స్వాధీనం చేసుకోవాలి" అని చెప్పింది మార్క్సిజం. ఇది ఒక సజీవ రాజకీయ పోరాటం. శ్రమజీవుల చైతన్యంతో, క్రమబద్ధమైన ఉద్యమాలతోనే విప్లవం సాధ్యమవుతుంది. అది సహజసిద్ధ ప్రక్రియ కాదు.కార్మిక వర్గాన్ని ద్వేషించమని, పెట్టుబడిదారులను శత్రువులుగా చూడమని మార్క్సిజం చెప్పదు. కానీ శ్రమ దోపిడీని ఆమోదించడం అనేది అన్యాయం. దోపిడీ వర్గాన్ని ప్రశంసించడం అనేది న్యాయానికి వ్యతిరేకం. సంపదను సృష్టించేది కార్మికులే. పెట్టుబడిదారులు కేవలం ఆ సంపదను లాభాల రూపంలో దోచుకుంటారు. కాబట్టి "పెట్టుబడిదారులూ, కార్మికులూ ఒకరికి ఒకరు అవసరం" అనే వాదన అర్థరహితం. ఒక వర్గం దోపిడీ లేకుండా మరొక వర్గం బతకగలదు. కానీ దోపిడీదారుల వర్గం లేకుండానే కార్మిక సమాజం సహకార పద్ధతిలో కొనసాగగలదు.

పెట్టుబడిదారీ వ్యవస్థను సహజమైందిగా, అవసరమైందిగా చూపించే ప్రయత్నాలు చరిత్రపరంగా విఫలమయ్యాయి. రష్యా, చైనాలలో జరిగిన విప్లవాలు మొదటి అడుగులు మాత్రమే అయినా, అవి సమాజంలో శ్రమజీవుల శక్తిని చాటాయి. తప్పిదాలు జరిగాయి. కమ్యూనిస్టు పార్టీలు కొన్ని సార్లు తగినంతగా సిద్ధాంతాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయలేకపోయాయి. కానీ దీనిని మార్క్సిజం వైఫల్యంగా చూపించడం అన్యాయం. సిద్ధాంతం కాదు, ఆచరణలోని లోపాలే కారణం.పెట్టుబడిదారీ వర్గం ప్రగతి, అభివృద్ధి అనే పేరుతో లాభాలను సమాజానికి మేలు చేస్తున్నట్టు చూపుతుంది. కానీ వాస్తవం ఏంటంటే, ఆ సంపద సమాజంలో కొద్ది మందికి మాత్రమే కేంద్రీకృతమవుతుంది. అసమానతలు పెరుగుతాయి. పేదరికం, నిరుద్యోగం, ఆకలి, గృహహీనతలు పెరుగుతాయి. ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థ ఇచ్చిన "ప్రగతి".మార్క్సిజం మాత్రం సమాజంలోని అందరూ శ్రమ చేస్తూ, అందరూ చేసిన శ్రమ ఫలాలను అవసరం మేరకు పంచుకోవాలని చెప్తుతుంది. అప్పుడు వర్గాలు లేకుండా, అందరూ అసోసియేటెడ్ ప్రొడ్యూసర్స్‌గా జీవిస్తారు. ఇది ఒక సమన్యాయం గల సమాజ దృక్పథం.కాబట్టి చాలించవలసింది విప్లవం కాదు. చాలించవలసింది పెట్టుబడిదారీ శాపనార్థాలే. కార్మిక వర్గం పోరాటాన్ని హీనపరిచే వాదనలే. శ్రమ దోపిడీని దాచిపెట్టే మభ్యపెట్టే పదజాలమే. మార్క్సిజం చెప్పే మార్గమే నేటి ప్రపంచానికి మార్గదర్శకత్వం ఇవ్వగలదు.విప్లవం చాలించాలి అని తేల్చేసే బదులు, పెట్టుబడిదారీ పిల్లి శాపనార్థాలను చాలించాలి. ఎందుకంటే పెట్టుబడిదారీ శాపనార్థాలు మార్క్సిజం ఉట్టి తెగిపడలేవు. కార్మిక వర్గం పోరాటం నిలకడగా సాగుతుంది. సమాజ విముక్తి లక్ష్యం చివరికి సాకారమవుతుంది.

## అన్యోన్యతకు అర్థం అర్ధ నారీశ్వర తత్త్వం

భక్తి




ఏదైనా కథ విన్నప్పుడు... ఆ కథలోని విశేషాలను గ్రహించడం, మంచి విషయాలను పాటించడం ప్రధానం. గౌరీ శంకరుల కథలో... అర్ధనారీశ్వర తత్త్వాన్ని లోతుగా తెలుసుకోవాలి. ఆ ఆది దంపతుల అన్యోన్యతను అర్థం చేసుకోవడం, ఆ విలువలను అనుసరించడమే ఆనందకరమైన గృహస్థ జీవితానికి సోపానం.హిమవంతుని పుత్రిక అయిన హైమవతి (శైలజ) తండ్రి ఆదేశం మేరకు శంకరుడికి పరిచర్య చెయ్యడానికి వచ్చింది. అది నిర్జనమైన వనం. వారిద్దరూ యవ్వనంలో, ఏకాంతంలో ఉన్నారు. కానీ వారి మనసుల్లో శృంగారపరమైన భావన లేదు. చివరకు ఇంద్రుడి ఆజ్ఞ మేరకు శంకరుడి మీద మన్మథుడు బాణం వేయాల్సి వచ్చింది. శారీరక సౌందర్యం లాంటి వాటికే ప్రాధాన్యం ఇస్తున్న నేటి కాలపు పద్ధతులకు ఇది విరుద్ధం. అంటే శారీరక సౌందర్య దృష్టితో చూసినంతకాలం మానసిక ప్రేమ అనేది ఉండదని భావం. ఈ భేదాన్ని గుర్తించగలిగితే దాంపత్యం అన్యోన్యంగా ఉంటుంది. మరో విషయం ఏమిటంటే... మన్మథుణ్ణి శంకరుడు తన మూడో కంటితో భస్మం చేయడం చూశాక కూడా... శైలజ తనంతట తానుగా నిర్ణయం తీసుకోలేదు. తల్లిదండ్రులకు చెప్పింది. తద్వారా ఆమె మానసికమైన ప్రేమ ఆమె తల్లితండ్రులకు అర్థమయింది. ఒక నిర్జన వన ప్రదేశానికి, ఏకాంతంలో ఉన్న పురుషుడి సేవ కోసం హిమవంతుడు తన పుత్రికను పంపాడంటే... తన కుమార్తె ప్రవర్తన, శీల సంపద మీద ఆయనకు ఎంత నమ్మకం ఉందో గమనించాలి.

భిన్నత్వంలో ఏకత్వం...వివాహానికి ముందు ప్రేమించుకున్న కాలంలో... చెప్పలేనంత అన్యోన్యంగా కనిపించేజంటల సంసార సౌధం కొన్నాళ్ళకే బీటలు వారడం నేడు చూస్తున్నాం. ఇలాంటి సందర్భంలోనే గౌరీ శంకరుల కథను శ్రద్ధగా ఒంట పట్టించుకోవాలి. గౌరీ శంకరులు... అర్ధనారీశ్వర రూపంలో ఉంటారు. కుడివైపున శంకరుని రూపం, ఎడమవైపు గౌరీ రూపం. పూర్వం ఈ అర్ధనారీశ్వర చిత్రాన్ని దేవాలయం గోడల మీదో, ప్రధాన స్తంభం మీదో... శిల్ప రూపంలోనో, చిత్ర రూపంలోనో కనిపించేలా ఉంచేవారు. "కుడి అరచేత్తో కుడి కంటిని మూసి గౌరీదేవిని, ఎడమ అరచేత్తో ఎడమకంటిని మూసి శివయ్యను చూడు" అని తమ పిల్లలకు తల్లిదండ్రులు చెప్పేవారు, ఆ విధంగా చేయించేవారు. ఎందుకని? ఏ సంస్కారమూ లేని బిరుసైన జేగురు రంగు శిరోజాలు... అవి కూడా మోకాళ్ళు దాటేంత పొడవున శివుడికి ఉంటాయి. సంపెగ, అశోక, సురపొన్న, సౌగంధిక (చంపాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా) పుష్పాలతో చక్కగా అలంకృతమైన కొప్పు ఆమెకు ఉంటుంది. ఆగ్రహం వచ్చినా, అనుగ్రహాన్ని కురిపిస్తున్నా ఏ మార్పూ కనిపించని అష్టమి చంద్రుడిలా ఆమె నుదురు ఉంటే... ఏమాత్రం తేడా కనిపించినా ఆయన నుదుటి భ్రుకుటి ముడిపడిపోతూ ఉంటుంది. ఆయన కన్ను రుద్ర రూపంలో వెలుగుతూ ఉంటే ఆమె నేత్రం నీటి మడుగులో కదలాడే చేపలా... ఇంకా ఇంకా చూడాలనిపించేలా ఉంటుంది. మరో చిత్రం... ఆమె నయనం పరమ మనోహరంగా, ప్రశాంతంగా, అందరికీ ఉండేలా అడ్డంగా ఉంటే... ఆయనకు నుదుటి మధ్యలో మరో నేత్రం ఛటచ్ఛటలాడే అగ్నితో ఉండడమే కాదు, నిలువుగా ఉంటుంది. ఇలా... ఇద్దరూ ఒకే తీరుగా ఉండనే ఉండరు. కానీ భిన్నమైన లక్షణాలు కలిగి కూడా కలిసే కనిపిస్తారు. మానసికంగా కూడా ఐక్య భావంతోనే ఉంటారు.

ఏం నేర్చుకోవాలి?ప్రతి వ్యక్తికి తనవైన కొన్ని అభిప్రాయాలు ఉంటాయి. వాటిని ఎదుటివారు గౌరవించాలి. "నేను మంచి శిరోజాలంకరణతో ఉంటాను కదా! నీవూ అలాగే ఉండు! నా నుదురు ప్రశాంతంగా ఉంటుంది కదా! నీవెందుకు అలా ఉండవు? నేను చక్కటి పట్టు వస్త్రాలను ధరిస్తాను కదా! నీవెందుకు ఆ ఏనుగు, పులి చర్మాలు ధరిస్తావు? నా మాదిరిగా ఉండు!" అని ఆమె ప్రాధేయపూర్వకంగా కానీ, గద్దించి కానీ ఆయనను అడగలేదు. అలాగే ఆయన కూడా "నాలా నీవు ఉండవచ్చు కదా?" అని అడగలేదు. అంటే... దంపతులు తమ వివాహానికి ముందు విడివిడిగా ఉన్న స్థిరాభిప్రాయాలను పరస్పరం గౌరవించుకుంటూ ఉండాల్సిందే. అవి పుట్టుక నుంచి వచ్చినవి. ఆ లక్షణాలకు వారు అలవాటు పడి ఉంటారు కాబట్టి... వాటిని మార్చుకోవాలని పట్టుపట్టినా, నిర్బంధించినా... వివాహబంధం క్రమంగా సడలిపోతుంది. అందుకని... దాంపత్యంలో సర్దుకుపోవడం తప్పనిసరి. ఈ దశలో ఏ మూడో వ్యక్తో (వారివారి తల్లితండ్రులు, స్నేహితులు లేదా ఇరుగుపొరుగువారు) జోక్యం చేసుకుంటే... ఆ సంసారంలో అన్యోన్యత ఉండదు. అందుకే గౌరీ శంకరులు తమ మధ్య ఎవరూ చొరబడే వీలు లేకుండా నిలువునా కలిసిపోయి... అర్ధనారీశ్వరులుగా ఉంటారు. ఇలాంటి విశేషాలను అర్థం చేసుకున్నప్పుడు... అవి మన జీవితాలు సక్రమంగా సాగేందుకు ఉపకరిస్తాయి.

## చెప్పులో పాము.. కాటేయడంతో టెకీ మృతి

**బెంగళూరు-నవభూమి:** చెప్పులో దాగి ఉన్న పాము కాటేయడంతో ఓ టెకీ ప్రాణాలు కోల్పోయాడు. బెంగళూరు జిల్లా బన్నేరుఘట్ట రంగనాథ లేఅవుట్‌లో మంజుప్రకాశ్(41) అనే టెకీ నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి బయట ఉంచే చెప్పులు వేసుకుని కాస్త దూరంలోని సర్కిల్ దాకా నడిచి వెళ్లి చెరకు రసం తీసుకొచ్చాడు. ఆ తర్వాత గదిలోకి వెళ్లి పడుకున్నాడు.




గంట తర్వాత ఇంటికి వచ్చిన ఓ కార్మికుడు చెప్పుల్లో నుంచి పాము బయటకు వస్తుండడాన్ని గుర్తించాడు. వెంటనే పామును చంపేశారు. ఆ చెప్పులు ప్రకాశ్‌కు చెందినవిగా గుర్తించి అతడి గదిలోకి వెళ్లి చూడగా.. అతడు అప్పటికే నోట్లో నురగ, రక్తం వచ్చి చనిపోయి ఉన్నాడు. మంజుప్రకాశ్ 2016లో బస్సు ప్రమాదంలో గాయపడడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. సయాటికా సమస్యతో కాలు కొంతమేర స్పర్శ ఉండడం లేదని ప్రకాశ్ తమ్ముడు హరీశ్ తెలిపారు. అందుకే పాము కాటేసినా గుర్తించలేక పోయి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
మంగళవారం
02 । సెప్టెంబర్ ।

## చైనా టూరులో హాంగ్‌కీ ఎల్5 కారులో ప్రధాని మోదీ చక్కర్లు.. ఇంతకీ ఆ కారు ప్రత్యేకతలేంటి?



**బీజింగ్-నవభూమి:** ప్రధాని మోదీ చైనాలో రెండు రోజుల పాటు పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఆ పర్యటన సమయంలో చైనా దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వినియోగించే అత్యంత విలాసవంతమైన కారులో మోదీ చక్కర్లు కొట్టారు. హాంగ్‌కీ ఎల్5 లిమోసిన్ కారులో మోదీ ప్రయాణించారు. షాంఘై సహకార సంస్థ సమావేశాల్లో పాల్గొంటున్న ఆయన ఈ కారును వినియోగించారు. మోదీ పర్యటించిన హాంగ్‌కీ ఎల్5 మోడల్ కారునే.. చైనా దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కూడా వాడుతున్నారు. చైనీస్ టాప్ నేతలతో పాటు ప్రముఖ విదేశీ నేతలకు మాత్రమే ఈ కారును వినియోగిస్తుంటారు. 2019లో ఇండియాలోని మహాబలిపురంకు జీ జిన్‌పింగ్ వచ్చిన సమయంలో ఎల్5 కారులోనే ఆయన తిరిగారు.హాంగ్‌కీని హాంగ్-చీ అని పలుకుతారు. మాండరిన్ భాషలో దీని అర్థం ఎరుపు జెండా అని. ఫస్ట్ ఆటోమొబైల్ వర్క్స్(ఎఫ్ఏడబ్ల్యూ) గ్రూప్ దీన్ని తయారు చేస్తోంది. ఇది పూర్తిగా మేడిన్ చైనా వాహనం. 1958లో ఈ కారును తొలిసారి లాంచ్ చేశారు. చైనాలో అతిపురాతన ప్యాసింజర్ కారుగా దీన్ని భావిస్తారు. చైనాలోని సంపన్న వర్గాలు ఈ కారును వినియోగిస్తుంటారు. డిజైన్, నిర్మాణం, ప్రమోషన్ మొత్తం చైనాలోనే సాగుతుంది. నిజానికి తొలుత కేవలం కమ్యూనిస్టు పార్టీ నేతల కోసం మాత్రమే ఈ కారును ఉత్పత్తి చేశారు. హాంగ్‌కీ కార్ల ఉత్పత్తి 1981లో నిలిపివేశారు. ఆ తర్వాత మళ్లీ 1990 మధ్య కాలంలో ఉత్పత్తి ప్రారంభించారు. హాంగ్‌కీ వర్షన్‌కు చెందిన ఎల్5 మోడల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది.హాంగ్‌కీ ఎల్5 కారులో 6.0 లీటర్ల వీ12 ఇంజిన్ ఉంది. సుమారు 400 హార్స్‌పవర్ శక్తి ఉత్పత్తి చేస్తుంది. కేవలం 8.5 సెకన్లలో అది వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని టాప్ స్పీడ్ గంటకు 210 కిలోమీటర్లు. ఈ కారు 5.5 మీటర్ల పొడుగు, మూడు టన్నుల బరువు ఉంటుంది. కారులోపల చాలా స్పేసియస్ సీటింగ్ ఉంటుంది. లెదర్ సీట్లు ఉంటాయి. రియర్ సీట్ల వద్ద మసాజ్, హీటింగ్, వెంటిలేషన్ సౌకర్యాలు ఉంటాయి. ఆల్ వీల్ డ్రైవ్, క్రూయిజ్ కంట్రోల్, పార్కింగ్ సెన్సార్లు, 360 డిగ్రీ కెమెరాలు ఉన్నాయి.హాంగ్‌కీ ఎల్ 5 కారు ఖరీదు సుమారు 5 మిలియన్ల యువాన్లు. అంటే భారత కరెన్సీలో సుమారు ఏడు కోట్లు. చైనాలో ఉత్పత్తి అవుతున్న అత్యంత ఖరీదైన కారు ఇదే. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తరచుగా జరిగే పబ్లిక్ కార్యక్రమాలకు హాంగ్‌కీ ఎల్ 5 కారులోనే వెళ్తుంటారు. అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే ద బీస్ట్ కారుకు సమానంగా ఉన్న హాంగ్‌కీ ఎన్701 మోడల్ కారులో కూడా జీ జిన్‌పింగ్ ప్రయాణిస్తారు.కమ్యూనిస్టు దిగ్గజ నేత మావో జిదాంగ్ హాంగ్‌కీ వర్షన్ కారును వాడినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు నిక్సన్ 1972లో చైనాలో పర్యటించిన సమయంలో ఆయన ఈ కారు ఎక్కినట్లు తెలుస్తోంది.

## బిహార్ ఓటర్లందరికీ కొత్త కార్డులు..



**పట్నా-నవభూమి:** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ తర్వాత బిహార్‌లోని ఓటర్లందరికీ కొత్త ఓటర్ కార్డులివ్వాలని ఎన్నికల సంఘం(ఈసీ) నిర్ణయించింది. ఈసీ ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఆగస్టు 1 నాటికి బిహార్‌లో 7.24 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో అభ్యంతరాలకు ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 1 వరకు ఈసీ గడువు ఇచ్చింది. మొత్తం 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.11 శాతం మంది ఇప్పటికే తమ ధృవీకరణ పత్రాలు సమర్పించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తమ పేర్లు పొరపాటున వచ్చాయని, జాబితా నుంచి తొలగించాలని మొత్తం 2 లక్షల మంది కోరారు. అదే సమయంలో 33 వేల మంది తమ పేర్లను ఓటర్ జాబితాలో కలపాలని కోరారు. సెప్టెంబరు 30న ఈసీ తుది జాబితా ప్రకటించనుంది. కాగా, బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర సోమవారంతో ముగియనుంది.

## నాటిన చెట్లలో బతికున్న వాటికే గ్రీన్ క్రెడిట్స్



**న్యూఢిల్లీ-నవభూమి:** చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన గ్రీన్ క్రెడిట్స్‌ను లెక్కించే పద్ధతిని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సవరించింది. గతంలోలా మొక్కలు నాటిన వెంటనే కాకుండా.. ఐదేళ్లు దాటిన తర్వాత వాటిలో బతికి ఉన్న చెట్ల ఆధారంగా క్రెడిట్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 2024 ఫిబ్రవరి 22న జారీచేసిన నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఆగస్టు 29న సవరించింది. దీనిప్రకారం గ్రీన్ క్రెడిట్ ప్రోగామ్ కింద ఇకపై క్రెడిట్‌లకు రివార్డులు కూడా ఇవ్వనున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఆయా సంస్థలు, కంపెనీలు స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలకు ప్రతిఫలంగా ఇచ్చేవాటిని గ్రీన్ క్రెడిట్స్ అంటారు. సవరించిన నిబంధనల ప్రకారం.. వారు ఉపయోగించిన భూ విస్తీర్ణంలో కనీసం 40% స్థలంలో చెట్ల పెంపకం చేపట్టిన ఐదేళ్ల తర్వాతే గ్రీన్ క్రెడిట్స్ మంజూరు చేస్తారు. అలాగే వాళు నాటిన మొక్కల్లో కనీసం ఐదేళ్లకుపైగా జీవించి ఉన్న ప్రతి కొత్త చెట్టుకూ ఒక గ్రీన్ క్రెడిట్ కేటాయిస్తారు.

## బైక్‌పై కైలాస్ యాత్రను పూర్తి చేసిన సద్గురు

**కోయంబత్తూర్-నవభూమి:** మోటారు సైకిల్‌పైకైలాస్ మానససరోవర్ యాత్రను పూర్తి చేసిన సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు కోయంబత్తూరులో ఘన స్వాగతం లభించింది. ఈ నెల తొమ్మిదిన ఉత్తరప్రదేశ్‌లో మొదలుపెట్టిన యాత్రను సద్గురు 2రోజుల క్రితం పూర్తి చేశారు. రెండు సార్లు బ్రెయిన్ ఆపరేషన్లు చేయించుకున్న సద్గురు ఆ తర్వాత 18 నెలలకే ఈ యాత్రను పూర్తి చేయడం గమనార్హం. తన యాత్ర దిగ్విజయంగా పూర్తి కావడం యోగ వల్లనే సాధ్యమైందని సద్గురు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మోటారు సైకిల్‌పై తాను చేసిన ఈ యాత్రలో యోగ ఎంతో ఉపయోగపడిందని అన్నారు.

# ఇజ్రాయెల్ రహస్య దాడుల వ్యూహం: బాడీగార్డుల నిర్లక్ష్యమే కీలకం..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇరాన్‌పై ఇటీవల జరిగిన సీక్రెట్ ఆపరేషన్‌లో ఇజ్రాయెల్ అత్యంత వ్యూహాత్మకంగా ముందడుగు వేసింది. ఈ దాడుల వెనుక ఉన్న నిదర్శనాలు, పద్ధతులు, మరియు లక్ష్యాల ఎంపిక ఈ చర్యను అత్యంత తీవ్రమైన దాడులలో ఒకటిగా నిలబెట్టాయి. ప్రధానంగా, ఈ ఆపరేషన్‌లో ఇజ్రాయెల్ దృష్టి సైనిక, రాజకీయ నాయకత్వంపై కాక, వారి రక్షక బృందాల (బాడీగార్డులు) పైనే మొదట పడింది ఇదే ఈ వ్యూహానికి కీలకాంశం. బాడీగార్డుల ఫోన్లే కీలక లింక్‌గా.. ఇరాన్ సైనిక, రాజకీయ ప్రముఖులు స్మార్ట్‌ఫోన్ల వాడకాన్ని క్రమంగా తగ్గించడంతో, వారి కదలికలను నిఘా పెట్టడం ఇజ్రాయెల్‌కు కష్టంగా మారింది. అయితే, బాడీగార్డుల వినియోగం మాత్రం మునుపటిలానే కొనసాగింది ఫోన్లు, సోషల్ మీడియా యాక్టివిటీలు వదలకపోవడం, వారి ద్వారా ట్రాకింగ్‌కు అవకాశమిచ్చింది. జూన్ 13న జరిగిన మొదటి దాడిలోనే ఇజ్రాయెల్ అత్యున్నత స్థాయి ఇరానియన్ రక్షణాధికారులను లక్ష్యంగా చేసుకొని వారిని మట్టుబెట్టింది. ఐఆర్‌జీసీ చీఫ్ సలామీ, ఆర్మీ చీఫ్ బాఘేరీ, మిసైల్స్ విభాగాధిపతి హాజిజాదే వంటి కీలక నేతలు ఈ దాడుల్లో హతమయ్యారు. సంకేతాల ఆధారంగా బంకర్ దాడి జూన్ 16న జరిగిన ఓ కీలక భద్రతా సమావేశ సమయంలో, ఒక బాడీగార్డ్ ఫోన్ వాడటం ద్వారా ఇజ్రాయెల్‌కు కీలక సమాచారం లభించింది. దీని ఆధారంగా, భూమికి 100 అడుగుల లోతులో ఉన్న రహస్య బంకర్‌పై దాడి జరిగింది. ఈ బంకర్‌లో ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగా, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పాటు న్యాయ, గూఢచార సంస్థల అధికారులు హాజరై ఉన్నారు. %ూశ్రీంశీ =ఘుం% - ట్రంప్ ను వ్యతిరేకించాలి.. అమెరికాను కాదు బాస్ ఈ దాడిలో పెజెష్కియాన్‌కు కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఇతరులు సమయస్ఫూర్తితో బయటపడినప్పటికీ, రక్షణ సిబ్బందిలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. అణు శాస్త్రవేత్తల జాబితాపై ప్రత్యేక దృష్టి ఇజ్రాయెల్ యొక్క ఈ ఆపరేషన్ వ్యూహం కేవలం సైనికాధికారులకే పరిమితం కాలేదు. ఇరాన్ అణు శాస్త్రవేత్తలను కూడా కీలక టార్గెట్లుగా ఎంపిక చేయడం జరిగింది. 2022 నుంచే శాస్త్రవేత్తల ప్రొఫైల్స్‌ను సేకరించడం మొదలైంది. 2018లో ఇరాన్ నుంచి అపహరించిన అణు సమాచార ఆధారంగా, మొదటగా 400 మందిని గుర్తించారు. వీరిలో చివరకు 100 మందిని ఎంపిక చేసి, మొత్తం 13 మందిని హత్య చేసినట్లు సమాచారం. ఆపరేషన్ రెడ్ వెడ్డింగ్' లోతైన వ్యూహం ఇరాన్ సైనిక నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకున్న ఈ ఆపరేషన్‌కు 'రెడ్ వెడ్డింగ్' అనే కోడ్ నామం పెట్టడం గమనార్హం. ఈ దాడుల కారణంగా, ఇరాన్ 1980లో ఇరాక్‌తో జరిగిన యుద్ధం తర్వాత ఇదే స్థాయిలో తీవ్రమైన ఆర్థిక, సైనిక నష్టాలను ఎదుర్కొంది. యుద్ధం అనంతరం మొస్సాద్ కోసం పని చేస్తున్న అనేకమంది గూఢచారులను ఇరాన్ అరెస్టు చేసింది. వారిలో ప్రముఖ అణు శాస్త్రవేత్త రుజ్‌బెహ్ వాది ఉన్నారు. అతనికి మరణదండన విధించారు. మిగిలిన ఎనిమిది మందిని కూడా ప్రస్తుతం విచారిస్తున్నట్టు టెహ్రాన్ వెల్లడించింది. ఏఐ నిఘా..మానవ లోపాలు ఈ గోప్యంగా నిర్వహించిన ఆపరేషన్ ద్వారా, టెక్నాలజీ ఆధారిత నిఘా, మానవ లోపాలను గుర్తించి వినియోగించడం ద్వారా ఇజ్రాయెల్ ఎలా వ్యూహాత్మకంగా ముందుకెళ్లిందో స్పష్టమవుతుంది. ఇదే సమయంలో, రక్షణ వ్యవస్థలలో చిన్నచిన్న లోపాలు ఎంతటి తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చో ఈ ఘటన బలమైన ఉదాహరణగా నిలుస్తుంది.

## తాను చనిపోయానంటూ వార్తలపై స్పందించిన ట్రంప్



**వాషింగ్టన్-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న వదంతులకు స్వయంగా ముగింపు పలికారు. ఇటీవల అనే హ్యాష్‌ట్యాగ్ ఎక్స్ లో ట్రెండ్ కావడంతో ఆయన ఆరోగ్యంపై అనేక అనుమానాలు రేకెత్తాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో స్పందిస్తూ, తాను తన జీవితంలో ఎన్నడూ లేనంత ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేశారు. - వదంతులకు కారణాలు ఈ పుకార్లు రావడానికి ప్రధాన కారణం గత వారం వైట్‌హౌస్ విడుదల చేసిన ట్రంప్ ఖాళీ షెడ్యూల్. ఇది ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిని ఖండిస్తూ ట్రంప్ శనివారం గోల్ఫ్ ఆడుతున్న ఒక ఫోటోను పంచుకున్నారు. కానీ, కొందరు నెటిజన్లు ఆ ఫోటో కూడా డిజిటల్‌గా మార్పులు చేసిందని ఆరోపించారు. రాజకీయ నాయకుల స్పందన ట్రంప్ మరణంపై వస్తున్న వదంతులపై పలువురు రాజకీయ నాయకులు స్పందించారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయంపై మాట్లాడుతూ ట్రంప్ 79 ఏళ్ల వయసులో కూడా చాలా ఆరోగ్యంగా ఉన్నారని, ఆయన నిత్యం చురుకుగా కార్యకలాపాల్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే, కన్సర్వేటివ్ వ్యాఖ్యాత డీసీ డ్రైనో మీడియాపై మండిపడ్డారు. బైడెన్ చాలా రోజులు కనిపించకపోయినా, ఆయన గురించి మీడియా సానుకూలంగా రాస్తుందని, కానీ ట్రంప్ ఒక్కరోజు కనిపించకపోతేనే ఆరోగ్యంపై పుకార్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. వదంతులకు ముగింపు మొత్తంగా, "ట్రంప్ మృతి" అనే హ్యాష్‌ట్యాగ్ అమెరికా రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే, ట్రంప్ స్వయంగా స్పష్టత ఇవ్వడంతో ఈ పుకార్లకు తాత్కాలికంగా ముగింపు పడింది. రాజకీయ నాయకుల మధ్య ఆరోగ్య సమస్యలపై వదంతులు వ్యాప్తి చెందడం అమెరికాలో సాధారణంగా జరిగే విషయం. అయినప్పటికీ, ఈసారి ఈ వదంతులు అత్యంత వేగంగా విస్తరించాయి.

## వాడని, బయట తిరగని వాహనాలపై పన్ను వేయొద్దు: సుప్రీం



**న్యూఢిల్లీ-నవభూమి:** బహిరంగ ప్రదేశాల్లో తిరగని లేదా అసలు వినియోగంలో లేని వాహనాల యజమానులకు మోటారు వాహన పన్ను భారం కాకూడదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆ కాలానికి వారు పన్ను చెల్లించాల్సిన పనిలేదని స్పష్టం చేసింది. 2024 డిసెంబరులో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీల్‌పై సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'సహజంగా రోడ్లు, హైవేలు వంటి ప్రజా మౌలిక సదుపాయాలున్న పబ్లిక్ ప్లేస్‌ల్లో వాహనాలు వినియోగిస్తున్న వారు దానికోసం పన్ను కట్టాలి. ఒక మోటారు వాహనాన్ని బహిరంగ ప్రదేశాల్లో తిప్పకపోతే, లేదా అసలు వాడుకలో లేకపోతే.. ఆ వ్యక్తి సంబంధిత మౌలిక సదుపాయాల నుంచి ప్రయోజనం పొందుతున్నట్టు కాదు. కాబట్టి ఆ కాలానికి సదరు వ్యక్తిపై మోటారు వాహన పన్ను భారం పడకూడదు' అని ఆగస్టు 29న ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

## పదే పదే కాలింగ్ బెల్ కొడుతున్నాడని 11 ఏళ్ల బాలుడిపై దారుణం.. డింగ్ డాంగ్ డిచింగ్ ఎంత పని చేసిందంటే?



**వాషింగ్టన్-నవభూమి:** సాధారణంగా చిన్న పిల్లలు ఉన్న అపార్ట్‌మెంట్లలో సందడి ఎలా ఉంటుందో అందరికీ తెలుసు. పిల్లలంతా ఓచోట చేరి అల్లరి పనులు చేస్తూ అందరికీ చిరాకు తెప్పిస్తుంటారు. పదే పదే కాలింగ్ బెల్ నొక్కుతూ.. తలుపులు తెరిచే సరికి పారిపోతుంటారు. ఇలాంటిది మన జీవితంలోనూ ఏదో ఒకసారి జరిగే ఉంటుంది. అయితే ఆ క్షణాన పిల్లలపై విపరీతమైన కోపం వచ్చి కొట్టేందుకు అక్కడకు వెళ్లినా.. వారి అమాయకపు ముఖాలు చూసి ఊరుకుండిపోతాం. లేదంటో ఏవో రెండు మాటలు తిట్టేసి, బెదిరించి మిన్నుకుండిపోతాం.కానీ అమెరికాలో మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా జరిగింది. అచ్చంగా ఇలాంటి ఆటే ఆడాడో 11 ఏళ్ల బాలుడు. పదే పదే కాలిగ్ బెల్ కొడుతూ పారిపోయాడు. దీంతో విపరీతమైన కోపం తెచ్చుకున్న ఇంటి యజమాని.. తలుపు వద్దే వేచి ఉన్నాడు. బాలుడు బెల్ నొక్కబోతుండగా.. ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. ఇలా బుల్లెట్ బాలుడి శరీరంలోకి దూసుకెళ్లగా.. అతడు చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.


అమెరికాలోని హ్యూస్టన్‌లో జరిగిందీ దారుణ ఘటన. ముఖ్యంగా పదే పదే కాలింగ్ బెల్ కొడుతూ పారిపోయే ఆటను అమెరికాలో 'డింగ్ డాంగ్ డిచింగ్'గా పిలుస్తుంటారు. అయితే చాలా మంది ఈ ఆట ఆడుతూ.. సరదాగా అల్లరి చేస్తారు. అచ్చంగా ఇదే పని చేశాడో 11 ఏళ్ల బాలుడు. శనివారం రోజు రాత్రి హ్యూస్టన్‌లోని ఈస్ట్‌సైడ్‌లో.. తన అపార్ట్‌మెంట్ భవనంలోనే బాలుడు ఈ ఆట ఆడాడు. తన స్నేహితులతో కలిసి చుట్టూ ఉన్న ఇళ్లలో డోర్ బెల్‌లు మోగిస్తూ.. తలుపు తీసేలోపే పారిపోతూ ఆడుకుంటున్నాడు.అయితే 9700 బ్లాక్ ఆఫ్ మిమ్‌బ్రోగ్‌లోని ఒక ఇంటి వద్ద వారు ఈ ప్రాంక్ చేస్తున్నప్పుడు.. ఆ ఇంటి యజమాని బయటికి వచ్చి పారిపోతున్న పిల్లలపై కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో 11 ఏళ్ల బాలుడు వెనుక భాగంలో తీవ్రంగా గాయమై కుప్పకూలిపోయాడు. విషయం గుర్తించిన స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అయిత చికిత్సపొందుతూ బాలుడు ఆదివారం ఉదయం ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై హ్యూస్టన్ పోలీసులు వెంటనే స్పందించారు. ఆ ఇంటి యజమానిని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఇప్పటివరకు నిందితుడి పేరు గానీ, అతడిపై నమోదు చేసిన అభియోగాలను గానీ పోలీసులు వెల్లడించలేదు. కానీ ఇప్పటికే పోలీసులు ఆ ఇంట్లో సోదాలు నిర్వహించి అనేక రైఫిల్స్, హ్యాండ్ గన్‌లను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సరదాగా ఆడుకుంటున్న చిన్న పిల్లలపై కోపం తెచ్చుకుని కాల్పులు జరపడం దారుణం అని అన్నారు. చిన్నారి ప్రాణాలు పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నివాసి థెరిసా జోన్స్ మాట్లాడుతూ.. "ఇది నిజంగా చాలా బాధాకరం. పిల్లల చుట్టూ తుపాకులు, ఇలాంటి కోపిష్టిలు ఉండకూడదు" అని అన్నారు. మరొక వ్యక్తి మాట్లాడుతూ.. "పిల్లలు డోర్‌బెల్‌తో ఆడుకుంటే వారికి ఏం నష్టం జరుగుతుంది? వారు పిల్లలని తెలిసి కూడా కాల్చడం అన్యాయం?" అని పేర్కొన్నారు. ప్రస్తుతం హ్యూస్టన్ పోలీసులు హారిస్ కౌంటీ డిస్ట్రిక్ట్ అటార్నీ కార్యాలయంతో కలిసి ఈ కేసులో తదుపరి చర్యల కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్థానికుల నుంచి సీసీటీవీ కెమెరాల ఫుటేజీని సేకరిస్తున్నారు.

## యూపీఎస్సీ ప్రతిభా సేతు




**న్యూఢిల్లీ-నవభూమి:** యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైనా.. అన్ని దశల్లోనూ మెరిట్‌లో ఉన్నా.. స్వల్ప స్కోరు తేడాతో ఆయా పోస్టుల ఎంపిక తుది జాబితాలో చోటు దక్కని అభ్యర్థులకు శుభవార్త..! ఇలాంటి అభ్యర్థులు ఎంపిక కాకపోయినా.. ప్రతిభావంతులేనని పేర్కొంటూ యూపీఎస్సీ తాజాగా 'ప్రతిభా సేతు' పోర్టల్‌ను ప్రారంభించింది. స్వల్ప స్కోరు తేడాతో తుది జాబితాలో చోటు దక్కని 10 వేల మంది అభ్యర్థుల డేటాబేస్‌ను ఆ పోర్టల్‌లో అందుబాటులో పెట్టనుంది. తమ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్న ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు/కార్పొరేట్ కంపెనీలకు ఈ డేటాబేస్‌ను పరిశీలించే వెసులుబాటు కల్పించింది. అభ్యర్థి పేరు, సెల్‌ఫోన్/ల్యాండ్‌లైన్ కాంటాక్ట్ నంబర్, విద్యార్హతలు వంటి వివరాలు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయి. దీంతో.. ఆయా కంపెనీలు, ప్రభుత్వ సంస్థలు కొలువుల భర్తీలో 'ప్రతిభా సేతు'లోని అభ్యర్థులకు ప్రాధాన్యతనిచ్చే అవకాశాలుంటాయని ప్రధాని మోదీ సైతం ప్రశంసించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షలు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు(సీఏపీఎఫ్) తదితర పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబర్చినా.. తుది జాబితాలో చోటు సంపాదించలేని అభ్యర్థుల వివరాలను ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు యూపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది.

## కొత్తగా వెలుగులోకి అరుదైన బ్రెయిన్ వ్యాధి..ఇప్పటికే ముగ్గురు మృతి



**కేరళ-నవభూమి:** కేరళలో ఇటీవల అరుదైన మేనింజిటిస్ తరహా బ్రెయిన్ ఇన్ఫెక్షన్ వ్యాధి వెలుగులోకి వచ్చింది. దీంతో ఇప్పటివరకు మూడు మరణాలు సంభవించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ వ్యాధి ఎలా వస్తుంది. దీని లక్షణాలు ఏంటనేది ఇక్కడ చూద్దాం.కేరళలో ఇటీవల అమీబిక్ మెనింగో ఎన్సెఫాలిటిస్ అనే అరుదైన వ్యాధి ) వెలుగులోకి వచ్చింది. ఈ మెదడు ఇన్ఫెక్షన్ కారణంగా ఇప్పటివరకు మూడు మరణాలు సంభవించడం కలకలం రేపుతోంది. ఇదే సమయంలో కేరళలో ఇప్పటివరకు 42 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ వ్యాధి ఎలా సోకింది, దీని లక్షణాలు ఏంటి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను ఇప్పుడు చూద్దాం.

అమీబిక్ మెనింగో ఎన్సెఫాలిటిస్ అనేది నేగ్లేరియా ఫౌలెరి అనే అమీబా వల్ల వచ్చే అరుదైన మెదడు ఇన్ఫెక్షన్. ఈ అమీబా సాధారణంగా కలుషితమైన నీరు, సరస్సులు, నదులు లేదా బాగా శుభ్రం చేయని కొలనులలో కనిపిస్తుంది. ఈ అమీబా ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించి, మెదడును ఇన్ఫెక్ట్ చేస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ చాలా వేగంగా వ్యాపిస్తుంది. చాలా సందర్భాలలో ఇది ప్రాణాంతకంగా మారుతుంది.

**కేరళలో ఇటీవలి పరిస్థితి**

కేరళలో ఈ ఇన్ఫెక్షన్ వల్ల మూడు మరణాలు నమోదయ్యాయి. అందులో ఒకటి కోజికోడ్ జిల్లాలోని ఓమస్సేరి నుంచి అబుబకర్ సిద్దీక్ అనే వ్యక్తి మూడు నెలల శిశువు, రెండోది మలప్పురం జిల్లాలోని కప్పిల్లో 52 ఏళ్ల రమ్లా అనే మహిళకు వచ్చింది. ఈ ఇద్దరూ కోజికోడ్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. ఇంతకు ముందు, ఆగస్టు 14న, తమరశ్శేరి నుంచి ఒక తొమ్మిదేళ్ల బాలిక కూడా ఈ ఇన్ఫెక్షన్‌తో మరణించింది. ప్రస్తుతం కోజికోడ్, మలప్పురం, వయనాడ్ జిల్లాల నుంచి ఎనిమిది మంది రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

**ఈ వ్యాధి ఎలా వస్తుంది?**

ఆరోగ్య అధికారుల ప్రకారం అమీబిక్ మెనింగో ఎన్సెఫాలిటిస్ సాధారణంగా కలుషితమైన నీటిలో ఈత కొట్టడం లేదా స్నానం చేయడం ద్వారా వస్తుంది. వెచ్చని నీటిలో ఈ అమీబా సులభంగా బతుకుతుంది. ముక్కు ద్వారా ఈ అమీబా శరీరంలోకి చేరితే, అది మెదడుకు చేరి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌ను కలిగిస్తుంది. కేరళలో ఈ ఏడాది 42 కేసులు నమోదవడంతో ఈ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యమని అధికారులు చెబుతున్నారు.

**లక్షణాలు ఏంటి?**

ఈ వ్యాధి ఇన్ఫెక్షన్ లక్షణాలు సాధారణంగా ఒకటి నుంచి ఏడు రోజులలో కనిపిస్తాయి

తీవ్రమైన తలనొప్పి, జ్వరం, వాంతులు లేదా వికారం

మెడ బిగుసుకుపోవడం, మానసిక గందరగోళం, కంటి దృష్టిలో మార్పులు

ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం చాలా అవసరం. ఎందుకంటే ఈ వ్యాధి చాలా వేగంగా ముదిరిపోతుంది

**జాగ్రత్తలు ఏంటి?**

కేరళలో ఈ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ కొన్ని నివారణ చర్యలు తీసుకుంటోంది. కోజికోడ్, వయనాడ్, మలప్పురం జిల్లాలలో బావులు, నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్నారు.

కలుషిత నీటిని నివారించండి. సరస్సులు, నదులు లేదా శుభ్రం చేయని కొలనులలో ఈత కొట్టడం మానేయండి

ఈత కొడుతున్నప్పుడు ముక్కు క్లిప్‌లు ఉపయోగించండి లేదా ముక్కును గట్టిగా మూసుకోండి

స్నానం లేదా ముఖం కడుక్కోవడానికి శుభ్రమైన, క్లోరినేటెడ్ నీటిని మాత్రమే ఉపయోగించండి

ఈ వ్యాధి గురించి మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేయండి

## చెన్నైలో అర్ధరాత్రి కుండపోత



**చెన్నై-నవభూమి:** చెన్నై మహానగరంలో శనివారం అర్ధరాత్రి కుండపోతగా వర్షం కురిసింది. రహదారులు, సబ్‌వేలు వరదతో పొంగిపొర్లాయి. భారీ వర్షం కారణంగా విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా నాలుగు విమానాలు చెన్నై ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్ కాలేకపోవటంతో వాటిని బెంగుళూరుకు మళ్లించారు. 27 విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నుంచి 140 మంది ప్రయాణికులతో చెన్నైకు వచ్చిన ఇండిగో విమానం, 164 మంది ప్రయాణికులతో వచ్చిన ఎయిర్ ఇండియా, 74 మందితో వచ్చిన ఇండిగో, ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి 268 మంది ప్రయాణికులతో వచ్చిన లుఫ్తాన్సా విమానాలను బెంగుళూరుకు మళ్లించారు. ఇదేవిధంగా కౌలాలంపూర్, హాంకాంగ్, తిరువనంతపురం, ఇండోర్, ఢిల్లీ నుంచి వచ్చిన విమానాలు కూడా ల్యాండ్ కాలేక సుదీర్ఘ సమయం పాటు గాలిలో చక్కర్లు కొట్టిన పిమ్మట వాతావరణం అనుకూలించిన మీదటే ల్యాండ్ అయ్యాయి. అదేవిధంగా చెన్నై నుంచి కౌలాలంపూర్, ఫ్రాంక్‌ఫర్ట్, హాంకాంగ్, శ్రీలంక, దుబాయ్, కువైట్, మస్కట్, సింగపూర్, ఢిల్లీ, పూణెతో సహా అనేక ప్రాంతాలకు బయలుదేరి వెళ్లాల్సిన విమాన సర్వీసులు 3 గంటలకు పైగా ఆలస్యంగా బయలుదేరి వెళ్లాయి.



## బాత్‌రూమ్ సువాసనభరితంగా

మనం ఇంట్లో బాత్‌రూమ్‌ను పరిశుభ్రంగా ఉంచుకుంటాం. అయినప్పటికీ ఒక్కోసారి దుర్వాసన వస్తూ ఉంటుంది. అలాంటి సందర్భాల్లో బాత్‌రూమ్‌ను సువాసనభరితంగా ఎలా మార్చుకోవాలో తెలుసుకుందాం...
ఒక చిన్న గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి దాన్ని బాత్‌రూమ్‌లో ఒక మూలగా లేదా కిటికీలో ఓ పక్కగా పెట్టాలి. ఇలా చేయడం వల్ల బేకింగ్ సోడా దుర్వాసనను పీల్చుకుని బాత్‌రూమ్‌లో తాజాదనాన్ని నింపుతుంది.
వాడేసిన నిమ్మతొక్కలు అలాగే నారింజ, బత్తాయి, అనాస తొక్కలను చిన్న ముక్కలుగా చేసి ఒక గిన్నెలో వేయాలి. ఈ గిన్నెను బాత్‌రూమ్‌లోని ఓ అరలో పెడితే మంచి ప్రయోజనం ఉంటుంది.
తేమ వాతావరణంలో బాగా పెరిగే ఇండోర్ ప్లాంట్ కుండీని బాత్‌రూమ్‌లో ఏర్పాటు చేసుకున్నా తాజా అనుభూతి కలుగుతుంది.
ఒక బకెట్ నీళ్లలో నాలుగు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ నీళ్లతో శుభ్రం చేస్తే బాత్‌రూమ్‌లో దుర్వాసన రాదు. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.
బాత్‌రూమ్‌లో వెంటిలేషన్ సరిగా ఉండేలా చూసుకోవాలి. గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరిస్తే తేమ నిలవదు. దీనివల్ల బాత్‌రూమ్ ఎప్పుడూ పొడిగా తాజాగా ఉంటుంది.



# రైల్వే నిర్వహణ... ఈ మహిళామణులదే



దక్షిణమధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్‌లో ప్రస్తుతం 80,527 మంది పని చేస్తున్నారు. వారిలో 8,968 మంది మహిళలు. 53 మంది లోకో పైలెట్లు, 64 మంది స్టేషన్‌మాస్టర్లతో పాటు 837 మంది ట్రాక్ మెయింటెనర్లుగా, 606 మంది సాంకేతిక నిపుణులుగా, 134 మంది మహిళలు అధికారులుగా సేవలు అందిస్తున్నారు. నిర్దిష్టమైన పని గంటలకు రైల్వే వ్యవస్థలో అవకాశం ఉండదు. ముఖ్యంగా రైళ్ల నిర్వహణను పర్యవేక్షించే అధికారులు రాత్రింబవళ్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. అన్నిటినీ అధిగమించి మగవారికి దీటుగా మహిళలు సత్తా చాటుతున్నారు.

### రైళ్ల ఆపరేటింగ్ అధిపతి...

– పద్మజ

దక్షిణమధ్య రైల్వేలో అత్యంత కీలకమైన విభాగం... ఆపరేటింగ్. ఈ విభాగానికి ప్రిన్సిప ల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు... కె.పద్మజ. ప్రధానంగా ఆమె రైళ్ల రాకపోకలపై దృష్టి పెట్టారు. సమయపాలన పాటించడంలోనూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలోనూ కీలకంగా వ్యవహరించారు. 1991 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి అయిన పద్మజ... రైళ్ల షెడ్యూలింగ్, ట్రాఫిక్ నిర్వహణలో ఇతర శాఖలతో సమన్వయం చేసు కొంటూ సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ఈ ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆమె... గతంలో ఇదే జోన్‌లో వాణిజ్య, నిర్వహణ వి బ ా గ ా న్ని పర్యవేక్షించారు. పండుగలు, ఉత్సవాల సమయంలో ప్రయాణికుల రద్దీని పక్కాగా అంచనా వేసి... వెయ్యికి పైగా ప్రత్యేక రైళ్లను విజయవంతంగా నడిపించారు. అంతేకాదు... 49 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసి రికార్డు నెలకొల్పారు.

### నిధుల నిర్వ హణ...

– హేమసునీత

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎస్‌సీఆర్ జోన్‌లో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్‌గా హేమ సునీత బాధ్యతలు చేపట్టారు. 1993 బ్యాచ్ ఐఆర్ఎస్ఎస్ అధికారి అయిన ఆమె... గతంలో ఫైనాన్షియల్ అడ్వైజర్– చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పని చేశారు. ప్రిన్సిపల్ ఫైనాన్స్ అడ్వైజర్‌గా జోన్ ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'యూరోపియన్ బిజినెస్ స్కూల్'లో ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ పొందిన హేమ సునీత... పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్, టాక్స్ లాస్ తదితరాల్లో నైపుణ్యం సంపాదించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై వరకు ఎస్‌సీఆర్‌కు రూ.8,081 కోట్లు ఆదాయం సమకూరింది. ఇందులో ఆమె కృషి ఎంతో ఉంది. గత ఏడాది ఇదే కాలానికి ఆదాయంతో పోలిస్తే మూడు శాతం వృద్ధి నమోదైంది. హేమ సునీత... ఆర్థిక కార్యకలాపాల నిర్వహణలో అద్భుత పనితీరు ప్రదర్శిస్తూ... జోన్‌ను లాభాల ట్రాక్‌పై నడుపుతున్నారు.

### రైల్వే పోలీస్ చీఫ్...

– ఆరోమాసింగ్

రోజూ సుమారు లక్షమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే దక్షిణమధ్య రైల్వే పోలీసింగ్ వ్యవస్థను సమర్థవంతంగా నడిపిస్తున్నారు అరోమాసింగ్ ఠాకూర్. 1993 బ్యాచ్ ఐఆర్‌పీఎఫ్ఎస్ అధికారి అయిన ఆమె... 2023లో ఎస్‌సీఆర్ జోన్‌లో ఐజీ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ఆస్తులను కాపాడటంతోపాటు రైల్వే స్టేషన్లు, రైళ్లలో ప్రయాణికుల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఆమె నేతృత్వంలో 'ఆపరేషన్ యాత్రి సురక్ష, ఆపరేషన్ అమానత్, ఆపరేషన్ నన్హే ఫరిస్తే, ఆపరేషన్ సతర్క్' లాంటి ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయి. మహిళా ప్రయాణికుల భద్రత కోసం మహిళా శక్తి బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే 'యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్'లు ప్రారంభించి స్టేషన్లు, రైళ్లలో నిరంతర నిఘా పెట్టారు.

### ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ...

– డాక్టర్ నిర్మల


ఎస్‌సీఆర్‌లో పని చేస్తున్న ఎనభై వేల మందికి పైగా ఉద్యోగుల ఆరోగ్య పర్యవేక్షణ బాధ్యత డాక్టర్ నిర్మల రాజారాంది. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ హోదాలో రైల్వే ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారు. 380 పడకల లాలాగూడ కేంద్ర రైల్వే ఆసుపత్రితో పాటు జోన్ పరిధిలోని విజయవాడ, గుంతకల్, నాందేడ్, గుంటూరు డివిజనల్, తిరుపతి, రాయనపాడు సబ్‌డివిజనల్ ఆసుపత్రులు, 40 హెల్త్ యూనిట్‌లను పర్యవేక్షిస్తున్నారు. 1989 బ్యాచ్ ఐఆర్‌హెచ్‌ఎస అధికారి అయిన నిర్మల... గత ఏడాది డిసెంబరులో ఈ బాధ్యతలను చేపట్టారు.

### వాణిజ్య విభాగం...

– ఇతి పాండే

దక్షిణమధ్య రైల్వేలో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ ప్రత్యేకతను చాటుకొంటున్నారు ఇతి పాండే. 2023లో దక్షిణాఫ్రికాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కామ్రేడ్స్ మారథాన్‌లో... 11.47 గంటల్లో 88 కిలోమీటర్ల దూరాన్ని పూర్తి చేశారు. ఈ ఘనత సాధించిన ఏకైక మహిళా సివిల్ సర్వెంట్‌గా రికార్డులకు ఎక్కారు. 1998 బ్యాచ్ ఐఆర్‌టీఎస్ అధికారి అయిన ఆమె... 2024లో బ్యూరోక్రాట్స్ ఛేంజ్‌మేకర్స్‌లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎస్‌సీఆర్‌లో టికెట్ అమ్మకాలు, అడ్వాన్స్‌డ్ రిజర్వేషన్, స్టేషన్ నిర్వహణ, ఫ్రయిట్ సేవలు, మార్కెటింగ్‌తో పాటు ఆదాయ వనరుల పెంపుదల కోసం సంస్కరణలు తీసుకువచ్చారు. రైల్వేకు చేసిన సేవలకు గుర్తింపుగా ఇతి పాండే 'రైల్ మంత్రి రాజభాష రజత్ పదక్ (2025), ఎక్సలెన్స్ – మెరిటోరియస్ సర్వీసెస్ (2007), విమెన్ అఛీవర్ ఆఫ్ ద ఇయర్ (2016) తదితర అవార్డులు అందుకున్నారు. అలాగే పశ్చిమ రైల్వేకు సంబంధించి సరుకు రవాణా కార్యకలాపాలపై సమగ్ర అవలోకనంతో 'రైడింగ్ ది ఫ్రయిట్ ట్రైన్' అనే పుస్తకం కూడా రాశారు.

# వయసుకు తగ్గ ఆభరణాలు!



వేడుకకు తగ్గట్టు, వయసుకు నప్పేటట్టు అలంకరించుకుంటేనే అందం! కాబట్టి ఏ వేడుకకు, ఎలాంటి అలంకరణ అవసరమో, ఏ వయసుకు ఎలాంటి ఆభరణాలు బాగుంటాయో తెలుసుకుంటే సగం సమస్య తీరినట్టే.

**చిన్నారులు:** 10 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు పట్టు లంగాలే అందం! ఈ డ్రస్సుకు మ్యాచ్ అయ్యేలా మెడకు దగ్గరగా కంఠి రకం నెక్లెస్ పెట్టాలి. నెక్లెస్ బదులుగా పొడవాటి హారం కూడా వేసుకోవచ్చు. నడుముకు వడ్డాణం పూర్తి అలంకరణకే వన్నె తెస్తుంది.

యువతులు: 15 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్కులు పేస్టెల్స్, లాంగ్ ఫ్రాక్స్ వేస్తారు కాబట్టి లాంగ్ ఇయర్ రింగ్స్, ముత్యాల చోకర్ ధరించాలి. చోకర్‌లో అన్‌కట్ డైమండ్ పెండెంట్ ఉండేలా చూసుకోవాలి.

**నడి వయస్కులు:** 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులకు బెనారస్ చీరలు నప్పుతాయి. పగలైనా, రాత్రైనా ఏ వేళలో జరిగే వేడుక అయినా వీరికి ఈ దుస్తులు అందంగా ఉంటాయి. హెవీ జుంకాలు, పోల్కీ, కుందన్ లేదా డైమండ్‌లో హెవీ నెక్లెసలు నప్పుతాయి. సాదా బంగారంలో అరుదైన డిజైన్లు కలిగి ఉండే నగలు ఎంచుకోవాలి.

**40 ఏళ్ల మహిళలు:** 40 ఏళ్ల వయసు స్త్రీలకు ఎలాంటి చీరలైనా నప్పుతాయి. పగటి వేళ వేడుకలకు పట్టు చీరలు కట్టుకోవచ్చు. చీరకు మ్యాచింగ్‌గా పూర్తి బంగారం లేదా గోల్డ్‌లో అన్‌కట్ డైమండ్ నగలు ధరించాలి. ఇది పగటివేళ వేడుకలకు తగిన అలంకరణ. ఇక రాత్రివేళ లేత రంగు జార్జెట్, షిఫాన్ చీరలే బాగుంటాయి. కాబట్టి ముత్యాలు, డైమండ్స్ బాగుంటాయి. చెవులకు పెద్ద స్టడ్స్ పెట్టుకోవాలి. అలాగే నగల అలంకరణ సింపుల్‌గా ఉండాలి. పుట్టిన రోజులు, రిసెప్షన్లు, సంగీత్ మొదలైన వేడుకలకు ఇదే తాజా జ్యువెలరీ ట్రెండ్!

**పెద్దలు:** 50 ఏళ్లు పైబడిన పెద్దలకు పట్టు చీరలే నప్పుతాయి. మెడలో నాన్‌తాడు, డైమండ్ నెక్లెస్ లేదా నక్షి నెక్లెస్ కూడా వేసుకోవచ్చు. జడ బిళ్లల ఫ్యాషన్ కూడా నడుస్తోంది.

# పసుపుతో మెరిసిపోండి



చర్మం నిగారింపుతో మెరిసిపోవాలంటే పసుపు తరువాతే ఏదైనా. అంత బాగా పనిచేస్తుంది పసుపు. వర్షాకాలంలో డల్‌గా మారిపోయిన చర్మం మీద పసుపుతో వేసుకునే ఫేస్‌ప్యాక్ ప్రభావంతంగా పని చేస్తుంది. అదెలా గంటే...
కల్తీలేని పసుపు – ఒకటీస్పూన్, శెనగపిండి – నాలుగు టేబుల్ స్పూన్లు, పాలు లేదా నీళ్లు – సరిపడా తీసుకోవాలి.
పసుపు, శెనగపిండిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పాలు లేదా నీళ్లు పోసి కలపాలి.
ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూసుకుని ఇరవై నిమిషాల తరువాత నీళ్లతో కడిగేయాలి.
ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవాలి. దీనివల్ల చర్మం మృదువుగా అవుతుంది. చర్మం శుభ్రపడుతుంది. దాంతో చర్మం మెరిసిపోతుంది.

# స్కేటింగ్ రాజ్






కాళ్లకు చక్రాలు కట్టుకొని... రయ్యిన దూసుకుపోతుంటే... ఇదేదో బాగుందనుకుంది. అమ్మానాన్నల అండతో సరదాగా స్కేటింగ్ రింక్‌లోకి దిగింది. అలా నాలుగేళ్లప్పుడు మొదలై... ఎన్నో పతకాలు వశమై...ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతోంది. 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' గ్రహీత... ఆసియా రోలర్ స్కేటింగ్ రజత పతక విజేత... పద్నాలుగేళ్ల మాత్రపు జెస్సీరాజ్‌తో మాటామంతి.

"అప్పుడు నాకు నాలుగేళ్లు. మా అమ్మానాన్న రాధ, సురేష్ నన్ను ఏలూరు ఇండోర్ స్టేడియానికి తీసుకువెళ్లారు. అక్కడ స్కేటింగ్ రింక్ చూపించి... 'ఇదేదో గేమ్ బాగుంది... నేర్చుకొంటావా' అని అడిగారట. నేను సరే అన్నానట. వెంటనే స్కేటింగ్ శిక్షణలో చేర్చారట. మాది ఏలూరు జిల్లా దెందులూరు మండలం జోగన్నపాలెం. వారంలో రెండుమూడు రోజులు శిక్షణ కోసం ఏలూరు తీసుకువెళ్లేవారు. సాధనలో చిన్న చిన్న దెబ్బలు తగులుతుండేవి. దాంతో భయపడి స్కేటింగ్ మానేశాను. తరువాత మా కుటుంబం మంగళగిరికి వచ్చి స్థిరపడింది. నాకు మళ్లీ స్కేటింగ్ నేర్చుకోవాలని అనిపించింది. దాంతో విజయవాడ దండమూడి రాజగోపాలరావు స్టేడియానికి తీసుకువెళ్లారు. అక్కడ కోచ్ సింహాద్రి వద్ద శిక్షణకు చేర్చారు.

### తొలి పోటీలోనే...

రింక్‌లో వేగంగా కదలాలంటే రన్నింగ్ అవసరమని కోచ్ చెప్పారు. దాంతో రన్నింగ్‌లో కూడా శిక్షణ ప్రారంభించాను. వారంలో మూడు రోజులు పరుగు, మూడు రోజులు స్కేటింగ్. నాన్న నన్ను వెంటబెట్టుకొని స్టేడియానికి తీసుకువెళ్లేవారు. సాధనలో దెబ్బలు తగులుతుండేవి. 'వాటికి భయపడితే ఆటలో ముందుకు వెళ్లలేవు' అని నాన్న చెప్పారు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. ప్రొఫెషనల్ స్కేటర్‌ను అవ్వాలని అనుకున్నాను. దాని కోసం పదేళ్ల వయసులో ఆర్టిస్టిక్ సోలో డ్యాన్స్ స్కేటింగ్‌లో అభ్యాసం ప్రారంభించాను. 2020లో విజయవాడలో జరిగిన కృష్ణా జిల్లా అండర్–14 విభాగంలో పాల్గొన్నాను. తొలి పోటీలోనే రజత పతకం గెలుచుకున్నాను. మరుసటి ఏడాది జిల్లా స్థాయిలో రజతం, అనంతరం జరిగిన రాష్ట్ర స్థాయి ఈవెంట్‌లో రజతం, కాంస్యం సాధించాను. జాతీయ పోటీలకు ఎంపిక అయ్యాను.అంతర్జాతీయ స్థాయికి... ఎంతో ఉత్సాహంతో మొహాలీలో జరిగిన జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిపలో పాల్గొన్నాను. అయితే అనుకున్నంతగా రాణించలేకపోయినా... రెండు కాంస్య పతకాలు గెలుచుకున్నాను. మెరుగైన ఫలితాలు రావాలంటే మరింత కష్టపడాలని అర్థమయింది. ఏకాగ్రతతో సాధన చేశాను. 2022లో చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ పతకం నెగ్గాను. అది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. కానీ అసలైన పరీక్ష నాకు న్యూజిలాండ్‌లో ఎదురైంది. గత ఏడాది జూన్‌లో అక్కడ నిర్వహించిన పసిఫిక్ ఓషియానా చాంపియన్‌షిప అండర్–14 విభాగంలో పోటీపడ్డాను. దీని కోసం భారత్ నుంచి 18 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. వారందరినీ దాటి నేనొక్కదాన్నే చాంపియన్‌షిపకు అర్హత సాధించాను. స్వర్ణ పతకం గెలుచుకున్నాను. అదే ఏడాది జాతీయ స్థాయి చాంపియన్‌షిపలో రజతం నెగ్గాను. గడచిన నాలుగున్నరేళ్లలో పాల్గొన్న ప్రతి ఈవెంట్‌లో పతకాలు సాధిస్తున్నాను.

### బాల పురస్కార్...

2024 నా కెరీర్‌లోనే మరిచిపోలేని సంవత్సరం. న్యూజిలాండ్‌లో విజయం తరువాత 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' దక్కింది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైంది నేను ఒక్కదాన్నే అని తెలిసి ఎంతో గర్వంగా అనిపించింది. గత ఏడాది డిసెంబరు... ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఈ అవార్డును అందుకున్నా. అది నాకు ఎనలేని ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చింది. అనంతరం ఈ ఏడాది మార్చిలో జరిగిన తైవాన్ చాంపియన్‌షిపలో సత్తా చాటాను. రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం గెలిచాను. అంతేకాదు... గత నెల 24 నుంచి 29 వరకు దక్షిణ కొరియాలో నిర్వహించిన ఆసియా చాంపియన్‌షిపలో రజత పతకం సాధించాను.

### లక్ష్యం... ఒలింపిక్స్...

స్కేటింగ్‌లో నేను మరిన్ని అద్భుత విజయాలు అందుకోవాలని అమ్మానాన్న ఆకాంక్షిస్తున్నారు. దాంతోపాటు రన్నింగ్‌లో కూడా చాంపియన్‌గా ఎదగాలని నేను కోరుకొంటున్నాను. రెండిటినీ నెరవేర్చాలనే దృఢ సంకల్పం నాది. ప్రస్తుతం విజయవాడ ఎన్ఎస్ఎం స్కూల్లో పదో తరగతి చదువుతున్నా. చదువులో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించి... ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలని అనుకొంటున్నా. అన్నిటికంటే పెద్ద లక్ష్యం... ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి, పతకం సాధించడం. దాని కోసంమెరుగైన శిక్షణ తీసుకొంటున్నా. కఠోర సాధన చేస్తున్నా."

# శ్వాసకోశాల స్వస్థతకు...



శరీరంలోని అణువణువుకూ ప్రాణవాయువును చేరవేసేవి శ్వాసకోశాలే. అయితే తరుచూ వ్యాధిగ్రస్తమయ్యేవి కూడా శ్వాసకోశాలే. నిజానికి శ్వాసకోశ సమస్యలు ఏ వయసు వారినీ వదిలిపెట్టవు. కాకపోతే, స్వాభావికంగా పసిపిల్లలు కఫావస్థలో ఉంటారు కాబట్టి వాళ్లకు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి ఎక్కువగా వస్తూ ఉంటాయి. దాదాపు వృద్ధుల్లో కూడా కఫ ప్రవత్తి ఉంటుంది కాబట్టి శ్వాసకోశ వ్యాధులు వృద్ధుల్ని కూడా బాగా వేధిస్తూ ఉంటాయి. అయితే ఈ కింది జాగ్రత్తలు పాటించడం ద్వారా శ్వాసకోశ సమస్యల్ని చాలా వరకు అధిగమించవచ్చు.
రోజూ 5 తులసి ఆకులు, కరక్కాయ బెరడు తీసుకుని కిళ్లీలా చుట్టి బుగ్గన పెట్టుకుని ఆ రసాన్ని మింగుతూ ఉంటే గొంతులోని కఫం తగ్గిపోయి శ్వాసకోశ సమస్యలు సమసిపోతాయి.
రెండు చిటికెల పసుపు, రెండు చిటికెల సైంధవ లవణం, రెండు చిటికెల త్రికటు చూర్ణం ఈ మూడింటి మిశ్రమాన్ని నోట్లో వేసుకుని, కాఫీగానీ, టీ గానీ, తాగితే జలుబు, అలర్జీ వల్ల వచ్చే ఆయాసం తగ్గుతాయి.
ఆయాసం మరీ ఎక్కువగా ఉన్నప్పుడు 50 గ్రాముల వామును మూకుడులో వేయించి సన్నని గుడ్డలో మూట గట్టి వీపు పైన కాపడం పెడితే కఫం కరిగిపోయి ఆయాసం తగ్గుతుంది.
ఆవాల పిండిని నీళ్లలో కలిపి గుడ్డకు పట్టించి ఛాతీపై వేస్తే, దగ్గు, ఆయాసం తగ్గుతాయి.
చిటికెడు శొంఠి చూర్ణం తీసుకుని ఒక పావు గ్లాసు నీళ్లలో వేసి మరగించి ఆ కషాయాన్ని తాగుతుంటే దగ్గు ఆయాసం తగ్గుతాయి. ఒక పావు గ్లాసు వేడిపాలల్లో మూడు మిరియపు గింజల పొడి, కొంచెం బెల్లం వేసి తీసుకుంటే దగ్గు జలుబు తగ్గుతాయి.




## లాభాల్లో స్టాక్ మార్కెట్లు.. ఈ రోజు టాప్ ఫైవ్ స్టాక్స్ ఇవే..

**ముంబై-నవభూమి:**గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారాన్ని సానుకూలంగా ప్రారంభించాయి. గత వారం వరుస నష్టాలతో 80 వేల దిగువకు పడిపోయిన సెన్సెక్స్ ఈ రోజు మళ్లీ కోలుకుంది. కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సెన్సెక్స్ మళ్లీ 80 వేల మార్క్‌ను దాటింది. చైనాతో భారత్ స్నేహం చిగురిస్తుందనే అంచనాలతో సూచీలు లాభాలతో ప్రారంభమయ్యాయి. దీంతో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో ఉన్నాయి (%దీబంఙఅవంం చీవఘం). గత శుక్రవారం ముగింపు (79, 809)తో పోల్చుకుంటే సోమవారంవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. పలు రంగాలు లాభాల్లో సాగుతున్నాయి. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 391 పాయింట్ల



లాభంతో 80, 201 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 124 పాయింట్ల లాభంతో 24, 551 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో బీఎస్ఈ లిమిటెడ్, హిందుస్థాన్ జింక్, సీజీ పవర్, ఎమ్‌సీఎక్స్ ఇండియా, కేన్స్ టెక్నాలజీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. మారుతీ సుజుకీ, ఎస్బీఐ కార్డ్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ లాంబార్డ్, రిలయన్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 749 పాయింట్ల లాభంతో ఉంది.

## 250 కోట్ల మంది అకౌంట్లు ప్రమాదంలో.. జీమెయిల్ యూజర్లకు గూగుల్ హెచ్చరిక..




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 2.5 బిలియన్ జీమెయిల్ వినియోగదారులకు గూగుల్ అత్యవసర అలర్ట్ జారీ చేసింది. హ్యాకర్ల దాడులు పెరుగుతున్న దృష్ట్యా వినియోగదారులు అప్రమత్తమ వ్వాలని హెచ్చరికలు జారీ చేసింది. ఖాతాల భద్రతను పెంపొందించుకునేందుకు పాస్‌వర్డ్‌లు వెంటనే అప్‌డేట్ చేయాలని సూచించింది. టూ-స్టెప్ వెరిఫికేషన్ ఆన్ చేయడం తప్పనిసరి అని తెలిపింది. సైబర్ దాడుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక జారీ చేసినట్లు సంస్థ స్పష్టం చేసింది. గూగుల్ ప్రకారం, ఈ దాడుల వెనక 'షైనీహంటర్స్' అనే అంతర్జాతీయ హ్యాకర్ గ్రూప్ ఉన్నట్లు తెలుస్తోంది. 2020 నుంచి యాక్టివ్‌గా ఉన్న ఈ గ్రూప్, ఏటీఅండ్ టీ, మైక్రోసాఫ్ట్, సాంటాండర్, టికెట్‌మాస్టర్ వంటి ప్రముఖ కంపెనీల డేటా లీక్ కేసుల్లో నిందితులుగా నిలిచింది. వీరు ప్రధానంగా ఫిషింగ్ పద్ధతిని ఉపయోగించి వినియోగదారులను నకిలీ లాగిన్ పేజీలకు మళ్లించి, పాస్‌వర్డ్‌లు, సెక్యూరిటీ కోడ్‌లను దొంగిలిస్తున్నారని గూగుల్ తెలిపింది. ఇప్పటికే జూన్‌లోనే గూగుల్ బ్లాగ్‌పోస్ట్‌లో షైనీహంటర్స్ గ్రూప్ కొత్త డేటా లీక్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించడానికి ప్రయత్నిస్తోంది. దీని వల్ల డేటా దోపిడీలు మరింత పెరిగే అవకాశం ఉందని గూగుల్ హెచ్చరిస్తోంది. ఆగస్టు 8న ప్రభావిత ఖాతాదారులకు ప్రత్యేక మెయిల్స్ పంపి సెక్యూరిటీ సెట్టింగ్స్‌ను తక్షణం అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

**టూ-స్టెప్ వెరిఫికేషన్ ఎందుకు?**

గూగుల్ హెచ్చరిక ప్రకారం, 2ఆన్ చేయడం ద్వారా ఇమెయిల్ అకౌంట్‌కు అదనపు రక్షణ కలుగుతుంది. హ్యాకర్లు పాస్‌వర్డ్‌ను తెలిసినా సెక్యూరిటీ కోడ్ లేకుండా లాగిన్ కావడం అసాధ్యం. ఈ కోడ్ సాధారణంగా మొబైల్ లేదా నమ్మదగిన పరికరానికి వస్తుంది. యూకేలోని యాక్షన్ ఫ్రాడ్ ప్రకారం 2 ఆన్ చేస్తే హ్యాకర్లు మీ ఖాతాలోకి ప్రవేశించలేరు. కొన్ని నిమిషాల్లో పూర్తయ్యే ఈ చర్య మీ ఇమెయిల్‌ను సురక్షితంగా ఉంచుతుంది. ఇది కేవలం జీమెయిల్‌కే పరిమితం కాదని బ్యాంకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, సోషల్ మీడియా ఖాతాల వంటి అన్ని ప్రధాన సేవల్లో కూడా టూ-ఫాక్టర్ ఆథెంటికేషన్ లేదా మల్టీ-ఫాక్టర్ అథెంటికేషన్ అందుబాటులో ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## అమెరికాకు మా సేవల్లో అంతరాయం లేదు: గరుడ వేగ




**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయ లాజిస్టిక్స్, క్రాస్-బోర్డర్ షిప్పింగ్ సంస్థ గరుడవేగ సర్వీసులు అమెరికాకు యథాతథంగా కొనసాగుతున్నాయని పేర్కొంది. ఆగస్టు 29న డి మినిమిస్ రూల్ రద్దు చేసిన తరువాత సవరించిన అమెరికా కస్టమ్స్ మార్గదర్శకాలను అనుసరిస్తూ యూఎస్‌ఏకు తన షిప్పింగ్ సేవలను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. అంతర్జాతీయ లాజిస్టిక్స్, క్రాస్-బోర్డర్ షిప్పింగ్ సంస్థ గరుడవేగ తమ సర్వీసులు అమెరికాకు యథాతథంగా కొనసాగుతున్నాయని పేర్కొంది. ఆగస్టు 29న డి మినిమిస్ రూల్ రద్దు చేసిన తరువాత సవరించిన అమెరికా కస్టమ్స్ మార్గదర్శకాలను అనుసరిస్తూ యూఎస్‌ఏకు తన షిప్పింగ్ సేవలను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది

తమ సంస్థ కార్యకలాపాలు అమెరికా కస్టమ్స్ నిబంధనలకు పూర్తిగా అనుగుణంగా ఉండటమే కాకుండా, ప్రతి పార్సిల్‌ను కొత్త విధానాలకు అనుగుణంగానే డెలివరీ చేయనున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. కస్టమర్లు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల కోసం అమెరికాకి పార్సిల్‌లు పంపేటప్పుడు సవరించిన మార్గదర్శకాలను జాగ్రత్తగా పాటించాలని సూచించారు. 'అమెరికాకి మా సేవల్లో ఎలాంటి అంతరాయం లేదు. కొత్త నిబంధనలు కొన్ని అదనపు అవసరాలను తీసుకువచ్చినా, గరుడవేగ వాటిని పూర్తిగా అనుసరిస్తోంది. కస్టమర్లకు సహాయం అందించేందుకు మా సిబ్బంది, బ్రాంచ్ కార్యాలయాలు సిద్ధంగా ఉన్నాయి. షిప్మెంట్ల ప్రాసెసింగ్ సాఫీగా సాగేందుకు మేము పూర్తి స్థాయి మార్గనిర్దేశం చేస్తామ%-%ని గరుడ వేగ సంస్థ ప్రకటించింది. ఏవైనా సందేహాలు, వివరణల కోసం సమీపంలోని బ్రాంచ్ లేదా సిబ్బందిని సంప్రదించవచ్చని సూచించింది.

## ఎమ్ఐటీ సంచలన నివేదిక.. ఏఐతో నష్టపోతున్న వ్యాపారాలు..

**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పది మంది చేసే పని ఏఐ ఒక్కటే చేసేస్తోంది. దీంతో కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడానికి, ఆదాయం పెంచుకోవడానికి ఏఐని వాడుకుంటున్నాయి. కంపెనీల ఏఐ వాడకంపై అమెరికాకు చెందిన మాసాచుషెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంచలన నివేదికను ప్రచురించింది. ఏఐ వాడుకుని తయారు చేసిన ప్రాజెక్టులు చాలా వరకు ఎలాంటి ప్రభావం చూపలేకపోయాయని ఆ నివేదికలో వెల్లడైంది. ఏఐ సిస్టమ్స్ వాడిన 95 శాతం సంస్థలు భారీగా నష్టపోయాయని తెలిపింది. ఒక్కపైసా కూడా ఆదాయం పొందలేకపోయాయని పేర్కొంది. పరిశోధకులు మొత్తం 300 సంస్థలపై పరిశోధనలు చేశారు. 350 మంది ఉద్యోగులతో మాట్లాడారు. పెద్ద సంఖ్యలో సంస్థలు చాట్ జీపీటీ, కోపైలట్ వాడుతున్నట్లు తేలింది. కేవలం 5 శాతం ఏఐ పైలట్లు మాత్రమే పెట్టిన పెట్టుబడిపై ఆదాయాన్ని సృష్టిస్తున్నాయని వెల్లడైంది. మిగిలిన 95 శాతం ఏఐ పైలట్ల ద్వారా ఒక్క పైసా కూడా ఆదాయం లేదని స్పష్టం అయింది. 80 శాతం సంస్థలు 40 శాతం మంది ఉద్యోగుల్ని తొలగించి వారి స్థానంలో ఏఐని వాడటం మొదలెట్టాయి. ఏఐల ద్వారా వ్యక్తిగత ఉత్పాదక పెరిగింది. కానీ, ఆదాయం మాత్రం పెరగలేదు. ప్రాఫిట్ అండ్ లాస్ విషయంలో ఏఐ తన సత్తా చాటలేకపోయింది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. సదరు సంస్థలు ఆదాయం గడించలేకపోవడానికి కారణం ఏఐలు సరిగా పనిచేయకపోవటం కాదు. కంపెనీ వర్కింగ్ స్టైల్‌ను ఏఐలు ఒంటబట్టించుకోలేకపోయాయి. లెర్నింగ్ గ్యాప్ వల్ల ఏఐ వెనుకబడుపోతోంది. దీంతో కంపెనీలు ఏఐలను తప్పుబడుతున్నాయి. మళ్లీ మనుషులను పనిలోకి తీసుకోవటం మొదలెట్టాయి. దీన్ని బట్టి చూస్తే.. అన్ని రంగాల్లో ఏఐని వాడటం సరైన నిర్ణయం కాదని స్పష్టం అవుతోంది.

## ఒకటో తేదీ శుభవార్త.. ఈ 2 బ్యాంకుల్లో లోన్ తీసుకున్న వారికి ఊరట..




**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బ్యాంకుల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేర్లు ఎక్కువగా వినిపిస్తుంటాయి. కోట్లాది మంది ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకులు తమ రుణ గ్రహీతలకు భారీ ఊరట కల్పిస్తూ శుభవార్త అందించాయి. వివిధ రుణాలకు లింక్ అయి ఉండే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్స్ (ఎంసీఎల్ఆర్) రేటును తగ్గించినట్లు ప్రకటించాయి. పీఎన్‌బీ బ్యాంక్ తమ రుణ గ్రహీతలపై ఊరట కల్పిస్తూ ఎంసీఎల్ఆర్ రేటును 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. ఇక బ్యాంక్ ఆఫ్ ఇండియా 5-15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. సవరించిన ఈ ఎంసీఎల్ఆర్ రేట్లను సెప్టెంబర్ 1, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆగస్టు 6, 2025 రోజున కీలక పాలసీ రేట్లను 5.5 శాతం వద్ద స్థిరంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. అయినప్పటికీ ఈ రెండు బ్యాంకులు రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించడం గమనార్హం. ఈ సెప్టెంబర్ నెల ప్రారంభం రోజునే ఊరట కల్పించాయి ఈ రెండు బ్యాంకులు. హోమ్ లోన్స్, పర్సనల్, ఆటో మొబైల్ వంటి ఫ్లోటింగ్ రేటు వడ్డీ రేట్లు గల రుణాల వడ్డీ రేట్లకు ఎంసీఎల్ఆర్ రేటు ఒక బెంచ్ మార్క్ రేటుగా ఉంటుంది. ఎంసీఎల్ఆర్ రేటు తగ్గించినప్పుడు రుణాలపై వడ్డీ రేట్లు, ఈఎంఐలు తగ్గుతాయి. దీంతో లోన్లు తీసుకున్న వారిపై భారం తగ్గుతుంది. అయితే, ఎంసీఎల్ఆర్ అనేది కొత్త రుణాలకు వర్తించదు. కొత్త ఫ్లోటింగ్ రేట్ వడ్డీ రేట్లు అనేవి ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు రేటుకు లింక్ అయి ఉంటాయి. అయితే, ఎంసీఎల్ఆర్ నుంచి ఈబీఎల్ఆర్‌కు మారేందుకు బ్యాంకులు అవకాశం కల్పిస్తాయి.

పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎంసీఎల్ఆర్ వడ్డీ రేట్లను 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. దీంతో ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 8.15 శాతం నుంచి 8 శాతానికి తగ్గింది. నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.30 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గింది. మూడు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.50 శాతం నుంచి 8.45 శాతానికి తగ్గింది. ఆరు నెలల వడ్డీ రేటు 8.70 శాతం నుంచి 8.65 శాతానికి పడిపోయింది. ఇక ఏడాది ఎంసీఎల్ఆర్ రేటు 8.85 శాతం నుంచి 8.80 శాతానికి దిగివచ్చింది. ఇక మూడేళ్ల ఎంసీఎల్ఆర్ రేటు 9.15 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించారు. కొత్త రేట్లు సెప్టెంబర్ 1 నుంచే అమలులోకి తెచ్చింది బ్యాంక్.

**బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త వడ్డీ రేట్లు**


బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంసీఎల్ఆర్ వడ్డీ రేట్లను 5-15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. అయితే, ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటును మార్చ లేదు. ఓవర్ నైట్ ఎంసీఎల్ఆర్ రేటు 7.95 శాతంగా ఉంది. అలాగే నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటు 8.40 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గింది. మూడు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.55 శాతం నుంచి 8.45 శాతానికి తగ్గింది. ఆరు నెలల ఎంసీఎల్ఆర్ రేటు 8.80 శాతం నుంచి 8.70 శాతానికి పడిపోయింది. ఏడాది ఎంసీఎల్ఆర్ రేటు 8.90 శాతం నుంచి 8.85 శాతానికి తగ్గింది. మూడేళ్ల వడ్డీ రేట్లు 9.15 శాతం నుంచి 9 శాతానికి తగ్గాయి.

## మ్యూచువల్ ఫండ్స్‌లో 3 కొత్త స్కీమ్స్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవలి కాలంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి తమ పెట్టుబడులను మళ్లిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. నేరుగా స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడానికి బదులుగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. సులభంగా ఇన్వెస్ట్ చేసే అవకాశం లభించడం, దీర్ఘకాలంలో హైరిటర్న్ వస్తుండడం, కొత్త కొత్త పథకాలు అందుబాటులోకి వస్తున్న క్రమంలో చాలా మంది ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ ఎంచుకుంటున్నారు. మీరు కూడా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటే మీకు మంచి అవకాశం. ఈ వారం మరో 3 కొత్త పథకాలు అందుబాటులోకి వస్తున్నాయి. సెప్టెంబర్ 1 నుంచే సబ్‌స్క్రిప్షన్ మొదలవుతున్నాయి. మరి ఆయా పథకాల గురించి తెలుసుకుందాం. అందుబాటులోకి వస్తున్న మూడు కొత్త పథకాల్లో ఒకటి డొమెస్టిక్ ఫండ్ ఆఫ్ ఫండ్, ఒకటి థెమాటిక్ ఫండ్, మరొకటి ఇండెక్స్ ఫండ్ ఉన్నాయి. వీటిల్లో యూనియన్ డైవెర్సిఫైడ్ ఈక్విటీ ఆల్ క్యాప్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 1వ తేదీన మొదలవుతోంది. సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఈ సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంటుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.1000గా నిర్ణయించారు. ఆ తర్వాత రూ.1000 చొప్పున ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. ప్రముఖ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ బరోడా బీఎన్‌పీ పరిబాస్ మ్యూచువల్ ఫండ్ సైతం ఓ కొత్త స్కీమ్ తెస్తోంది. అదే బరోడా బీఎన్‌పీ పరిబాస్ బిజినెస్ కాంగ్లొమెరేట్స్ ఫండ్ ఈ స్కీమ్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 2వ తేదీన ప్రారంభమవుతోంది. సెప్టెంబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈ స్కీమ్‌లో యూనిట్ల కోసం టెండర్ దాఖలు చేయాలంటే కనీస పెట్టుబడి రూ.1000గానే నిర్ణయించారు. ఆ తర్వాత ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. ఇక బంధన్ బీఎస్ఈ ఇండియా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్ సెప్టెంబర్ 3వ తేదీన సబ్‌స్క్రిప్షన్ ప్రారంభిస్తోంది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ సెప్టెంబర్ 17వ తేదీ వరకు ఉంటుంది. ఇందులోనూ కనీస పెట్టుబడి రూ.1000గా నిర్ణయించారు. ఆ తర్వాత రూ.1000 చొప్పున గరిష్ఠంగా ఇన్వెస్ట్ చేయవచ్చు. పరిమితి అంటూ ఉండదు. సబ్‌స్క్రిప్షన్ ముగిసిన తర్వాత యూనిట్లు కేటాయిస్తారు. ఆ తర్వాత రిటైల్ మార్కెట్లో క్రయ విక్రయాలకు అందుబాటులోకి తీసుకొస్తారు. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఇన్వెస్టర్లు తమ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడి సహా భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాల ఆధారంగా ఏ స్కీమ్ ఎంచుకోవాలి అనేది నిర్ణయించుకోవాలి. సరైన ఫండ్స్‌తో మంచి ఫోర్ట్ ఫోలియో నిర్మించుకోగలిగితే లాభాలు అందుకోవచ్చని విశ్లేషకులు చెబుతుంటారు. తమ పోర్ట్ ఫోలియోను పరిశీలిస్తుండాలి.


## బెస్ట్ స్కీమ్.. నెలకు రూ. 10 వేలతో కోటీశ్వరులయ్యారు.. 20 ఏళ్లలో చేతికి డబ్బులు




**న్యూఢిల్లీ-నవభూమి:** చాలా మంది దీర్ఘకాలంలో మెరుగైన భారీ రాబడి రావాలనుకుంటే మ్యూచువల్ ఫండ్స్‌ను ఎంచుకుంటుంటారు. ఇక్కడ కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ కారణంగా లాంగ్ రన్‌లో మంచి లాభాలు వస్తాయని చెబుతుంటారు నిపుణులు. కాంపౌండింగ్ అంటే చక్రవడ్డీ. అంటే ఏటా వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. ఇలా కాలం గడుస్తున్న కొద్దీ మీ సంపద గణనీయంగా వృద్ధి చెందుతుంది. ఈ కాంపౌండింగే మ్యూచువల్ ఫండ్లలో ఉన్న అతిపెద్ద ప్రయోజనం అని చెబుతుంటారు. ఇక కాంపౌండింగ్‌ను ప్రపంచంలోనే 8వ వింత అని అభివర్ణించారు ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. ఇక వారెన్ బఫెట్ వంటి దిగ్గజ పెట్టుబడిదారులు కూడా ఇదే కారణంతో.. మ్యూచువల్ ఫండ్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటారు. ఏదో ఏడాది, రెండేళ్ల వరకు అంటే మ్యూచువల్ ఫండ్లు అంత మంచి పెట్టుబడి ఆప్షన్స్ కావని.. 5,10, 15 ఏళ్లు ఇలా సుదీర్ఘకాలంలోనే మంచి రాబడి ఇస్తుందని చెబుతుంటారు. ఇక గత చరిత్ర కూడా ఇదే చెబుతోంది. చాలా వరకు లాంగ్ రన్‌లో ద్రవ్యోల్బణాన్ని మించే రాబడి అందించాయని చెప్పొచ్చు. దీర్ఘకాలం పెట్టుబడులతో రిస్క్ కూడా తగ్గించుకోవచ్చు. ఇప్పుడు మనం గత 20 ఏళ్ల వ్యవధిలో అద్భుత స్థాయిలో రిటర్న్స్ అందించిన ఒక మ్యూచువల్ ఫండ్ గురించి చూద్దాం. అదే బంధన్ మ్యూచువల్ ఫండ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ నుంచి అందుబాటులో ఉన్న బంధన్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్. ఇది గత ఆగస్ట్ 9తో మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో 20 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఇక ఈ క్రమంలోనే స్కీమ్ లాంచ్ అయినప్పటి నుంచి నెలకు రూ. 10 వేలు సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన వారికి ఊహించని రీతిలో రూ. 1.16 కోట్లు వచ్చాయి. అంటే రూ. 10 వేల సిప్ నుంచి కోటీశ్వరులు అయ్యారు.ĀĀ ఇది ఒక ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీ కిందికి వస్తుంది. వాల్యూ రీసెర్చ్ నుంచి ఫైవ్ స్టార్ రేటింగ్ అందుకుంది. ఇంకా మార్నింగ్ స్టార్ 4 స్టార్ రేటింగ్ ఇచ్చింది. ఇక ఈ ఫండ్.. ఎన్నేళ్ల వ్యవధికి ఎంత రాబడి ఇచ్చిందనేది చూద్దాం. పదేళ్ల కిందట నెలకు రూ. 10 వేల చొప్పున పెట్టుబడి పెట్టిన వారికి రూ. 30.39 లక్షలు వచ్చాయి. ఇక్కడ వార్షిక ప్రాతిపదికన సగటున 17.70 శాతం రాబడి వచ్చింది. ఇదే ఐదేళ్లలో చూసుకుంటే రూ. 10.12 లక్షలు అందించింది. మూడేళ్ల వ్యవధిలో సగటున 20.24 శాతం రిటర్న్స్‌తో రూ. 4.83 లక్షలు అయింది. పైన చెప్పుకున్నది సిప్ అయితే.. ఇప్పుడు లంప్‌సమ్ పెట్టుబడి రిటర్న్స్ చూద్దాం. ఈ స్కీమ్ ప్రారంభమైనప్పుడు ఇందులో ఒకేసారి రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు రూ. 13.10 లక్షలు వచ్చాయి. పదేళ్లలో రూ. 4.34 లక్షలు వచ్చాయి. ఐదేళ్లలో రూ. 2.94 లక్షలు వచ్చాయని చెప్పొచ్చు. మూడేళ్ల వ్యవధిలో చూస్తే రూ. 1 లక్ష పెట్టుబడి కాస్తా రూ. 1.84 లక్షలు అయ్యాయి.

### ట్యాక్స్ పేయర్లూ.. ఫేక్ నోటీసులొస్తున్నాయ్..

## ఏది ఒరిజినల్ ఇలా గుర్తించండి




**న్యూఢిల్లీ-నవభూమి:** ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్ గడువు సమీపిస్తున్న క్రమంలో లక్షల మంది తమ రిటర్నులు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే దాదాపు 4 కోట్ల మంది రిటర్నులు ఫైల్ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అయితే, రిటర్నులు ఫైల్ చేసిన వారిలో చాలా మంది ట్యాక్స్ పేయర్లకు వివిధ కారణాలతో ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు వస్తుంటాయి. ఇలా నోటీసులు వస్తే ఒత్తిడి పెరుగుతుంది. దీనినే అదునుగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు, ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం పంపించినట్లు నకిలీ నోటీసులు పంపించి డబ్బులు దండుకుంటున్నారు. క్షణాల్లో ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. మరి మీకు ఐటీ నోటీసు వస్తే ఎలా? అది నకిలీనా, ఒరిజినలా ఎలా గుర్తించాలి? అనే వివరాలు తెలుసుకుందాం. ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు పంపే ముందు ట్యాక్స్ చట్టాలకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలు, ప్రోటోకాల్స్ పాటిస్తారు. వాటి ప్రకారమే నోటీసులు పంపుతారు. ఒక వేళ మీకు ట్యాక్స్ నోటీస్ వస్తే అది రియల్ లేదా ఫేక్ అని తెలుసుకునే అవకాశం ఉంటుంది. ట్యాక్స్ నోటీసులు ఎస్ఎంఎస్ లేదా ఇ-మెయిల్ ద్వారా వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా, అందులోని లింకులను తెరవకుండానే అది ఒరిజినల్ లేదా ఫేక్ అని గుర్తించవచ్చు. మొదటగా చేయాల్సింది మీకు వచ్చిన ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసుకు ప్రత్యేకమైన నంబర్ ఉందా లేదా చూడాలి. ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసుకు నంబర్ అనేది తప్పనిసరి. ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం.. 2019, అక్టోబర్ 1 తర్వాత ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం జారీ చేసే ఎలాంటి సమాచార నోటీసులకైనా యూనిక్ డాక్యుమెంట్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉండాలి. ఇలా ప్రత్యేకమైన యూనిక్ కోడు ఉన్నట్లయితే అది ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం నుంచి వచ్చిందని నమ్మవచ్చు. మీరు ఐటీఆర్ ఫైల్ చేయక ముందు లేదా చేసిన తర్వాత డీఐఎన్ నంబర్ లేకుండా నోటీసు వస్తే అది ఒరిజినల్ కాదని గుర్తించాలి. అలాంటి వాటికి స్పందించాల్సిన అవసరం లేదని ఐటీ శాఖ పలు సందర్భాలుగా అవగాహన కల్పిస్తూనే ఉంది. స్టేటస్ చెకింగ్ ద్వారా గుర్తించవచ్చు

ఇన్‌కమ్ ట్యాక్స్ అథారిటీ నుంచి నోటీసులు వచ్చినప్పుడు అది ఒరిజినల్ అవునా కాదా అని ఇ-ఫైలింగ్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చు.

ముందుగా ఇన్‌కమ్ ట్యాక్స్ ఇ-ఫైలింగ్ పోర్టల్ లోకి వెళ్లాలి.

హోమ్ పేజీలో క్విక్ లింక్స్ లోకి వెళ్లి అథెంటికేట్ నోటీస్/ ఆర్డర్ ఇష్యూడ్ బై ఐటీడీ అనే ఆప్షన్ క్లిక్ చేయాలి.


మీకు వచ్చిన నోటీసు డీఐఎన్ నంబర్, మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. లేదా పాన్, డాక్యుమెంట్ టైప్, అసెస్మెంట్ ఇయర్, ఇష్యూ డేట్, మొబైల్ నంబర్ వంటి వాటితోనూ అథెంటికేట్ చేయవచ్చు.

వివరాలన్నీ ఇచ్చిన తర్వాత సబ్మిట్ చేస్తే మీకు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేయాలి

ఒకసారి వాలిడేట్ చేసిన తర్వాత ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసు ఒరిజినల్ అయితే సక్సెస్ మెసేజ్ వస్తుంది. లేదా నో రికార్డ్ ఫౌండ్ అని స్క్రీన్ పై కనిపిస్తుంది.

## హైదరాబాద్‌లో ఏ జువెల్లరీలో గోల్డ్ రేటు గ్రాముకు ఎంత..

### 14 ఏళ్ల గరిష్టానికి వెండి



**న్యూఢిల్లీ-నవభూమి:** అంతర్జాతీయంగా రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం సురక్షితమైన పెట్టుబడిగా మారింది. ఇటువైపు ఆసక్తి చూపే వారి సంఖ్య పెరిగింది. దీంతో బంగారం ధర కూడా పెరుగుకుంటూ పోతోంది. మరోవైపు.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ కూడా వడ్డీ రేట్లను చాలా రోజుల తర్వాత తగ్గించనున్నట్లు సంకేతాలు ఇచ్చింది. సాధారణంగా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తే.. డాలర్ డిమాండ్ తగ్గి.. బంగారం ఆకర్షణీయంగా మారుతుంది. అప్పుడు ఇటువైపు పెట్టుబడులు పెరిగి.. దానికి అనుగుణంగానే రేట్లు కూడా పెరుగుతుంటాయి. ఇప్పుడు అదే జరుగుతోంది. బంగారం ధర ఒక్కసారిగా దేశీయంగా, అంతర్జాతీయంగా భారీగా పెరిగింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో చూస్తే స్పాట్ గోల్డ్ రేటు ఆల్ టైమ్ గరిష్టానికి చేరువలోకి వెళ్లింది. అప్పట్లో ఔన్సుకు 3500 డాలర్ల మార్కును దాటగా.. ఇప్పుడు 3480 స్థాయిలో కదలాడుతోంది. ఇక స్పాట్ సిల్వర్ ధర ఒక్కరోజే 2 శాతానికిపైగా పెరిగి ఔన్సుకు 40.60 డాలర్ల మార్కును దాటింది. 2011, సెప్టెంబర్ తర్వాత ఇదే గరిష్టం. అంటే 14 ఏళ్ల గరిష్టాన్ని నమోదు చేసింది.

దేశీయంగా కూడా గోల్డ్ రేట్లు భారీగా మారిపోయాయి. ఇన్ని రోజులు 24 క్యారెట్ల బంగారం ధర తులం రూ. 1 లక్ష దాటిందని మాట్లాడుకుంటే.. ఇప్పుడు 22 క్యారెట్ల ధర కూడా రూ. లక్షకు సమీపంలో ఉంది. ప్రస్తుతం 22 క్యారెట్లు, 24 క్యారెట్ల పసిడి ధర హైదరాబాద్ నగరంలో తులానికి రూ. 97,050బీ రూ. 1,05,880 వద్ద ఉన్నాయి. భారతదేశంలో ప్రస్తుతం పండగల సీజన్ నడుస్తోంది. ఈ సమయంలో ఎక్కువగా కొనుగోళ్లు జరుగుతుంటాయి. అయితే రేట్లు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో డిమాండ్ కాస్త తగ్గుతుందని చెప్పొచ్చు. ఇప్పుడు మనం హైదరాబాద్ నగరంలో.. దేశంలోని ప్రముఖ జువెల్లరీలో గోల్డ్ రేటు గ్రాము ఎంతుందో తెలుసుకుందాం.

తనిష్క్‌లో 22 క్యారెట్ల పసిడి ధర గ్రాముకు రూ. 9,660 గా ఉంది. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఇది కాస్త ఎక్కువగా ఉంది. ప్రస్తుతం రూ. 9,705 పలుకుతోంది. ఇక జోయాలుక్కాస్, కల్యాణ్ జువెల్లర్స్, ఖజానా జువెల్లరీ, లలితా జువెల్లరీల్లో కూడా గ్రాము పసిడి ధర రూ. 9,705 గానే ఉంది. ఇక వెండి ధర విషయానికి వస్తే గ్రాముకు రూ. 136 పలుకుతోంది. అంటే కేజీకి రూ. 1.36 లక్షలు అన్నమాట. అయితే మీరు జువెల్లరీ కొనుగోలు చేసినట్లయితే.. వీటిపై తరుగు ఛార్జీ, జీఎస్టీ పడుతుందని చెప్పొచ్చు. ప్రస్తుతం జీఎస్టీ 3 శాతంగా ఉంది. తరుగు.. ఆభరణాన్ని బట్టి మారుతుంటుంది. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు కచ్చితంగా.. హాల్ మార్కింగ్ చూసుకోవాలి. హాల్ మార్క్ చేసిన బంగారు ఆభరణమే.. స్వచ్ఛతతో కూడుకున్నదని ధ్రువీకరించుకోవాలి.

## దేశంలో యాపిల్ ఐఫోన్ థర్డ్ స్టోర్..ఈసారి సౌత్‌లో

**న్యూఢిల్లీ-నవభూమి:**టెక్ లవర్స్‌కి, యాపిల్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్. యాపిల్ ఇప్పుడు సౌత్ ఇండియాలో తన మొదటి స్టోర్‌ని ఓపెన్ చేయనుంది. బెంగళూరులోని ఫీనిక్స్ మాల్ ఆఫ్ ఏసియాలో యాపిల్ హెబ్బల్ స్టోర్ సెప్టెంబర్ 2, 2025న మధ్యాహ్నం 1 గంటలకు ఓపెన్ చేయనుంది. ఇది భారతదేశంలో యాపిల్‌కి మూడో ఆఫీషియల్ స్టోర్. ముంబైలోని యాపిల్ ఢిల్లీలోని యాపిల్ సాకేత్ తర్వాత ఇప్పుడు సౌత్ ఇండియాలోని బెంగళూరుకు వచ్చింది. త్వరలో పూణేలో యాపిల్ కోరెగావ్ పార్క్ ప్రాంతంలో నాలుగో స్టోర్ ఓపెన్ కానుంది.

యాపిల్ హెబ్బల్ స్టోర్ బెంగళూరులోని ఫీనిక్స్ మాల్ ఆఫ్ ఏసియాలో ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంది. మీరు మాల్ లోపలికి వెళ్లిన తర్వాత కుడి వైపు ఎస్కలేటర్ కనిపిస్తుంది. దాన్ని ఎక్కి ఫస్ట్ ఫ్లోర్‌కి వెళితే మీకు యాపిల్ హెబ్బల్ స్టోర్ కనిపిస్తుంది. ఈ స్టోర్ కేవలం షాపింగ్ స్పాట్ మాత్రమే కాదు. ఇదొక కమ్యూనిటీ హబ్. బెంగళూరు ఇన్నోవేషన్ స్పిరిట్‌ని సెలబ్రేట్ చేసే వేదికగా యాపిల్ దీన్ని రూపొందించింది.

70 మంది టీమ్ మెంబర్స్: ఈ స్టోర్‌లో 15 రాష్ట్రాల నుంచి వచ్చిన 70 మంది టీమ్ మెంబర్స్ మీకు బెస్ట్ షాపింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి రెడీగా ఉన్నారు. మీరు ఏ ప్రొడక్ట్ గురించి అడిగినా, సరైన సలహాలు, సపోర్ట్ అందిస్తారు. 100% రిన్యూవబుల్ ఎనర్జీ: యాపిల్ హెబ్బల్ స్టోర్ పూర్తిగా రిన్యూవబుల్ ఎనర్జీతో నడుస్తుంది. ఇది ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ స్టోర్ బిజినెస్ సపోర్ట్: స్మాల్ బిజినెస్ ఓనర్స్ కోసం బిజినెస్ ప్రోస్ టీమ్ రెడీగా ఉంది. డివైస్ సపోర్ట్, టూల్స్, గైడెన్స్‌తో మీ బిజినెస్‌ని బూస్ట్ చేసుకోవచ్చు. ప్రొడక్ట్స్ రేంజ్: ఐఫోన్ 16 సిరీస్, ఐఫోన్ 15, యాపిల్ వాచ్, ఎయిర్ పాడ్స్, మ్యాక్‌లు, ఐప్యాడ్‌లు, యాపిల్ పెన్సిల్, హోమ్‌పాడ్ లాంటి యాపిల్ డివైస్‌లు, యాక్సెసరీస్ ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. సెప్టెంబర్ 9న జరిగే ఈవెంట్‌లో లాంచ్ అయ్యే ఐఫోన్ 17 సిరీస్‌ని కూడా ఇక్కడ పొందవచ్చు. యాపిల్ జీనియస్ బార్: ఏదైనా యాపిల్ ప్రొడక్ట్ గురించి డౌట్స్ ఉంటే, జీనియస్ బార్‌లో ఎక్స్‌పర్ట్స్ మీకు సహాయం చేస్తారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ మంగళవారం 02 । సెప్టెంబర్ । 2025




# నవంబర్‌లో నారా వారింట పెళ్లి సందడి.. లీక్ చేసిన రోహిత్

టాలీవుడ్‌లో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న టాలెంటెడ్ హీరోల్లో నారా రోహిత్ ఒకరు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడి సోదరుడి కుమారుడిగా సినీ ఇండస్ట్రీకి పరిచయమైన రోహిత్, కెరీర్ ప్రారంభంలోనే బాణం, ప్రతినిధి వంటి సినిమాలతో సీరియస్ నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కొన్ని వరుస ఫ్లాపులతో అతని కెరీర్ కాస్త డౌన్ అయ్యింది. దీంతో కొన్నేళ్లు గ్యాప్ తీసుకుని వెయిట్ లుక్ లో భారీ మార్పులు చేసుకున్నారు. రోహిత్, తాజాగా 'సుందరకాండ' అనే సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇచ్చాడు. ఈ చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు రాగా, పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. సుదీర్ఘ విరామం తర్వాత వచ్చిన ఈ సినిమా, రోహిత్‌కి మంచి బూస్ట్‌ని అందించింది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను టార్గెట్ చేస్తూ రూపొందిన ఈ చిత్రం మంచి రెస్పాన్స్‌ను రాబట్టడంతో, రోహిత్ ప్రమోషన్స్‌లో ఫుల్ జోష్‌తో పాల్గొంటున్నారు. తాజాగా గుంటూరులో జరిగిన ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొన్న రోహిత్, అక్కడ గణేశుడిని దర్శించుకుని అభిమానులతో, మీడియాతో మాట్లాడారు. "ఇంత కాలం తర్వాత ఆడియెన్స్ నుంచి ఇలా స్పందన రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఇది నాకు నమ్మకాన్ని కలిగిస్తోంది," అని చెప్పారు. ఈ సందర్భంగా రోహిత్ తన పెళ్లి గురించి కూడా ఓ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ మొదటి వారంలో నా పెళ్లి జరుగుతుంది అని అధికారికంగా ప్రకటించారు.



# దయ్యంగా నేషనల్ క్రష్?

థ్రిల్లర్, హార్రర్, కామెడీ హార్రర్ ఈ జానర్లకు ఆడియన్స్‌లో స్పెషల్ క్రేజ్ ఉంటుంది. అందులో హార్రర్ కామెడీకి ఇంకాస్త ఎక్కువ క్రేజ్ ఉంటుంది. అయితే హార్రర్ కామెడీ సినిమాలు, అందులోనూ హిట్ ఫ్రాంచైజ్ అంటే వెంటనే గుర్తొచ్చే పేరు రాఘవ లారెన్స్ కాంచననే. ఓ వైపు కామెడీతో నవ్విస్తూనే మరోవైపు హార్రర్ తో భయపెట్టడం లారెన్స్ స్పెషాలిటీ. కాంచన4 షూటింగ్ లో లారెన్స్ బిజీ మంచి మెసేజ్ తో పాటూ ఆడియన్స్ ను అలరించే రాఘవ లారెన్స్ ఇప్పటికే కాంచన ఫ్రాంచైజ్ లో పలు సినిమాలు చేసి వాటితో మంచి హిట్లు అందుకున్నారు. మునితో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు కాంచన4 వరకు వచ్చింది. లారెన్స్ ప్రస్తుతం కాంచన4 షూటింగ్ లో బిజీగా ఉన్నారు. ఆల్రెడీ ఈ సినిమాను అనౌన్స్ చేసి సెట్స్ పైకి తీసుకెళ్లారు లారెన్స్. కీలక పాత్రల్లో పూజా హెగ్డే, నోరా ఫతేహి రాఘవ లారెన్స్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ హార్రర్ కామెడీ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా ఇందులో పూజా హెగ్డే హీరోయిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. పూజాతో పాటూ బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే కాంచన4 గురించి ఇప్పుడో క్రేజీ న్యూస్ కోలీవుడ్ మీడియాలో తెగ వినిపిస్తోంది. క్యాస్టింగ్ తోనే అంచనాలు పెంచేస్తున్న లారెన్స్‌ఈ సినిమాలో నేషనల్ క్రష్ రష్మిక కూడా జాయిన్ అయ్యారని, కాంచన4లో రష్మిక కూడా పూజాతో పాటూ దెయ్యంగా కనిపించనున్నారని అంటున్నారు. ఓ స్పెషల్ క్యారెక్టర్ కోసం లారెన్స్, రష్మికను రంగంలోకి దించారని అంటున్నారు. ఆల్రెడీ దీనిపై డిస్కషన్స్ కూడా జరిగాయని సమాచారం. ఇదే నిజమైతే అటు సౌత్ తో పాటూ ఇటు నార్త్ లో కూడా కాంచన4 పై భారీ అంచనాలు పెరగడం ఖాయం. లారెన్స్ ఈ సినిమా క్యాస్టింగ్ తోనే సినిమాపై హైప్ ను విపరీతంగా పెంచేస్తున్నారు. అయితే ఈ విషయంపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. వరుస సినిమాలతో బిజీ వరుస సక్సెస్‌లతో దూసుకెళ్తున్న రష్మిక ప్రస్తుతం బాలీవుడ్ హార్రర్ కామెడీ థ్రిల్లర్ థామాలో నటిస్తున్నారు. ఈ సినిమాలో రష్మిక చాలా విభిన్న పాత్రలో కనిపించనున్నట్టు ఆల్రెడీ రిలీజైన ఫస్ట్ లుక్ ను బట్టి చూస్తుంటే తెలుస్తోంది. థామాతో పాటూ ది గర్ల్‌ఫ్రెండ్, రెయిన్‌బో, మైసా సినిమాలతో రష్మిక బిజీగా ఉండగా, ఇప్పుడు మరో హార్రర్ కామెడీ మూవీ అయిన కాంచన4కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం.




# ఎన్టీఆర్ డ్రాగన్‌లో రుక్మిణీ..



ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో కన్నడ భామల హవా స్పష్టంగా కనిపిస్తోంది. రష్మిక మందానా బ్లాక్‌బస్టర్లతో దూసుకుపోతుంటే, నభా నటేష్, శ్రద్ధా శ్రీనాథ్ లాంటి యాక్ట్రెస్‌లు కాస్త వెనకబడ్డారు. ఇక ఆషిక రంగనాథ్‌కు తెలుగులో అవకాశాలు వచ్చిన హిట్ దక్కించుకోలేకపోయింది. ప్రస్తుతం ఆమె ఆశలన్నీ 'విశ్వంభర' మీదే ఉన్నాయి. ఇక ఈ పోటీలో మరో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ చేరింది. 2019లో 'బీర్బల్' సినిమాతో కన్నడలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన రుక్మిణీకి నిజమైన గుర్తింపు మాత్రం 2023లో వచ్చిన క్లాసిక్ లవ్‌స్టోరి 'సప్త సాగరాలు దాటి' తో వచ్చింది. ఇందులో ఆమె నటన, ఎమోషనల్ స్క్రీన్ ప్రెజెన్స్, క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకుంది. ఈ చిత్రం ఆమె కెరీర్‌ను పూర్తిగా మలిచేసింది. ఈ సినిమా నాకు రెండో జీవితాన్ని ఇచ్చింది. ఒక దశలో నటిగా నేను సెట్ అవుతానా లేదా అనే డైలమాలో ఉన్నాను. కానీ 'సప్త సాగరాలు దాటి' వల్ల నా జీవితం మారిపోయింది," అని ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో చెప్పింది. రుక్మిణీ వసంత్ తెలుగులో నిఖిల్ సరసన నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైంది. కానీ ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయింది. అయినప్పటికీ, రుక్మిణీకి అవకాశాలు మాత్రం తగ్గలేదు. ఈ బ్యూటీ ఇప్పుడు ఎన్టీఆర్ హీరోగా, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ మూవీ 'డ్రాగన్' లో హీరోయిన్‌గా నటిస్తోంది. కొద్ది రోజులుగా దీనికి సంబంధించి ప్రచారాలు జరుగు తుండగా, తాజాగా ఈ విషయాన్ని మదరాసి చిత్ర నిర్మాత ఎన్వీ ప్రసాద్ కన్‌ఫాం చేశారు.

# మిడ్ నైట్ చెమటలు పట్టిస్తున్న రాధిక!



నేహా శెట్టి..ఈ పేరు కంటే ఎక్కువగా రాధిక అనే పేరుతోనే వైరల్ అయింది.. ఈమె పోషించిన రాధిక అనే క్యారెక్టర్ మీద పాట కూడా పాడేశారు. అలా 'డీజే టిల్లు' సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీలో సెన్సేషన్ బ్యూటీగా మారిపోయిన నేహా శెట్టి కెరియర్ ఈ సినిమాతో మారిపోయిందని చెప్పుకోవచ్చు. అప్పటివరకు ఈ బ్యూటీ నటించిన సినిమాలేవి అంతగా పేరు తెచ్చిపెట్టలేదు. ఎప్పుడైతే డీజే టిల్లు సినిమాలో నటించిందో అప్పటినుండి నేహా శెట్టి టాక్ ఆఫ్ ది టౌన్ గా మారిపోయింది. టిల్లు స్క్వేర్ మూవీలో కూడా చిన్న గెస్ట్ రోల్ పోషించింది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ కేవలం సినిమాల్లోనే కాదు సోషల్ మీడియాలో కూడా అభిమానులకి చాలా దగ్గరగా ఉంటుంది. సోషల్ మీడియాలో ఎప్పుడు యాక్టివ్ గా ఉంటూ అభిమానులతో చిట్ చాట్ చేస్తూ తన గురించి ఎన్నో ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకుంటుంది. అయితే గత కొద్ది రోజుల నుండి సోషల్ మీడియాలో ఈ హీరోయిన్ సందడి తగ్గిపోయిందని చెప్పుకోవచ్చు. ఎందుకంటే చాలా రోజులుగా ఈ హీరోయిన్ కి సంబంధించిన కొత్త ఫోటోలు ఏవీ అభిమానులతో పంచుకోవడం లేదు. దాంతో చాలామంది నెటిజన్లు ఇదేంటి టిల్లు గాడి లవర్ మరీ అంత బిజీ అయిపోయిందా.. కనీసం ఒక్క ఫోటో కూడా వదలడం లేదే అని అభిమానులు అనుకోవడమే ఆలస్యం.. ఫటాఫట్ ఓ నాలుగైదు ఫోటోలు వదిలేసింది. ఆ ఫోటోలు కుర్రకారుకు ఈ చల్లటి వెదర్ లో హీట్ పుట్టిస్తున్నాయి. తాజాగా నేహా శెట్టి మాల్దీవ్స్ వెకేషన్ కి వెళ్లగా.. ఆ ఫొటోస్ ని అభిమానులతో పంచుకుంది. ఇక ఈ ఫొటోస్ అన్ని నేహా శెట్టి రాత్రిపూట తీసుకున్నట్టుగానే కనిపిస్తున్నాయి. ఇక ఆ నల్లటి చీకట్లో నేహా శెట్టి అందం మిరుమిట్లు గొలుపుతోంది.. అలా తాజాగా మాల్దీవ్స్ రిసార్ట్ లో దిగిన ఎన్నో హాట్ ఫోటోలను ఇన్స్టా వేదికగా తన అభిమానులతో పంచుకుంది నేహా శెట్టి.. స్లీవ్ లెస్ గోల్డెన్ షైన్ మ్యాక్సీవేర్‌లో ఈ బ్యూటీ ఘాటు ఫోజులిచ్చింది. పైగా మిడ్ నైట్ వాక్ అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. నేహా శెట్టి పెట్టిన ఒక్కొక్క ఫొటోకి లక్షల లైకులు వేల కామెంట్లు వస్తున్నాయి.. ఆమె వేసుకున్న ఆ గౌను మొత్తం లైటింగ్‌తో తెగ మెరుస్తోంది.. డ్రెస్ కు తగ్గట్టే నేహా శెట్టి ఫేస్ కూడా వెలిగిపోతోంది. ఈ ఫొటోస్ నేహా శెట్టి పార్టీ వైబ్ ని తెలుపుతున్నాయి.. ఈ ఫోటోలు చూసిన చాలా మంది అభిమానుల్లో ముఖ్యంగా అబ్బాయిల్లో హీట్ పుట్టిస్తున్నాయి..


# అనుష్క సరోజ-2 చేయాలని చెప్పిందట.. ఇంతకీ క్రిష్ ప్లాన్ ఏంటో మరి..?



స్టార్ హీరోయిన్ అనుష్కా శెట్టి నుంచి సినిమా వస్తుందంటే అంచనాలు ఏ రేంజ్‌లో ఉంటాయో తెలిసిందే. బాహుబలి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ పాపులారిటీ సంపాదించుకుంది స్వీటీ. లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో బాక్సాఫీస్‌ను షేక్ చేసే ఈ బెంగళూరు సుందరి తాజాగా ఘాటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నవిషయం తెలిసిందే.

క్రిష్ దర్శకత్వం వహించిన ఈ మూవీ సెప్టెంబర్ 5న తెలుగు, తమిళంతోపాటు పలు భాషల్లో విడుదల కానుంది. కాగా వేదం సినిమా తర్వాత క్రిష్, అనుష్క కాంబోలో వస్తున్న రెండో సినిమా కావడంతో ఘాటిపై అంచనాలు భారీగానే ఉన్నాయి. అయితే వేదం సినిమాలో అనుష్కా శెట్టి పోషించిన సరోజ పాత్రకు ఏ స్థాయిలో గుర్తింపు వచ్చిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చాలా కాలంగా అనుష్క, తాను ఓ ఎక్జయిటింగ్ ప్రాజెక్టుపై పనిచేయాలనుకుంటున్నామని చెప్పాడు క్రిష్. అంతేకాదు అనుష్క తనకు సరోజ 2 సినిమా చేయాలని కూడా సూచించిందని చెప్పాడు క్రిష్. నిజంగా ఈ ఐకానిక్ రోల్‌ను సిల్వర్ స్క్రీన్‌పై ప్రజెంట్ చేస్తే ప్రేక్షకులకు థ్రిల్ అందించడం పక్కా అనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి రాబోయే రోజుల్లో అనుష్క సలహాను క్రిష్ సీరియస్‌గా తీసుకుని సరోజ 2ను సెట్స్‌పైకి తీసుకెళ్తాడా..? లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఈ క్రేజీ కాంబో రిపీట్ అయితే మాత్రం బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కావడం గ్యారంటీ అని అప్పుడు చర్చించుకుంటున్నారు సినీ జనాలు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఘాటి తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీలో విక్రం ప్రభు, చైతన్య రావ్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# 17 ఏళ్ల నుండి ఆ షర్ట్‌ని జాగ్రత్తగా దాచుకున్న నాని.. ఎందుకంత స్పెషల్



నేచురల్ స్టార్ నాని నటుడిగా ఎంతవరకు పేరు తెచ్చుకున్నాడో, వ్యక్తిగా కూడా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు పొందాడు. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన నాని ఇప్పుడు స్టార్ హీరోగాను, సక్సెస్ ఫుల్ నిర్మాత గాను సత్తా చాటుతున్నాడు. తాజాగా ఆయన ప్రముఖ నటుడు జగపతి బాబు హోస్ట్ చేస్తున్న ప్రముఖ టాక్ షో 'జయమ్ము నిశ్చయమ్మురా' లో గెస్ట్‌గా పాల్గొని తన అభిమానులను అలరించారు. ఈ షోలో నాని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను షేర్ చేశారు. అయితే ఈ ఎపిసోడ్‌లో హైలైట్ ఏంటంటే.. 17 ఏళ్ల క్రితం నాని ధరించిన ఒక పాత టీ షర్ట్. ఎపిసోడ్ మధ్యలో జగపతి బాబు ఒక టీ షర్ట్ చూపించి, "ఈ షర్ట్ గుర్తుందా?" అని నానిని అడిగారు. షర్ట్‌ను చూసిన నాని ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యా రు. వెంటనే ఆ షర్ట్ వెనక ఉన్న ప్రత్యేకమైన జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. అష్టాచెమ్మా సినిమాకు ఆడిషన్స్ జరుగుతున్న సమయంలో, జూబ్లీహిల్స్‌లోని పార్క్‌లో నేను వేసుకున్న షర్ట్ ఇది. అప్పట్లో ప్రొఫెషనల్ ఫోటోషూట్ చేసే అవకాశం లేక, ఈ షర్ట్ మీదే ఫోటోలు తీసి పంపించాను. ఆ ఫొటోలే నాకు నటుడిగా తొలి అవకాశం తీసుకురావడంలో కీలకం అని అన్నారు. అంతేకాదు, అదే టీ షర్ట్‌ను ఆయన తన జీవిత భాగస్వామి అంజుని మొదటిసారి కలిసేటప్పుడు కూడా ధరించారట. అంజుతో మొదటి మీటింగ్ సమయంలో ఇదే షర్ట్ వేసుకున్నాను. అందుకే నాకు ఈ షర్ట్ ప్రత్యేకమైన జ్ఞాపకం. అంజు ఇప్పటికీ దాన్ని జాగ్రత్తగా దాచుకుంది. ఆమె మీకే ఇచ్చి ఉంటుంది" అంటూ ఎమోషనల్ కామెంట్స్ చేశారు నాని.

# చీర కట్టులో ఇంత అందంగా మరెవరైనా ఉంటారా?



సిద్దు ఫ్రమ్ సికాకుళం సినిమాతో 2008లో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రద్ధా దాస్. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ అమ్మడు ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది. అయితే ఈమెకు ప్రతిభకు తగ్గట్టుగా ఆఫర్లు దక్కలేదు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. హిట్స్ లేకున్నా, పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు రాకున్నా హీరోయిన్స్ వెంటనే కనుమరుగు అవుతారు. కానీ శ్రద్ధా దాస్ మాత్రం ఇప్పటికీ ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది. అప్పుడప్పుడు సినిమాల్లో, వెబ్ సిరీస్ ల్లో కనిపిస్తూ వస్తుంది. అంతే కాకుండా సోషల్ మీడియాలో ఈమె అందాల ఆరబోత ఫోటోలను రెగ్యులర్‌గా షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈమె సొంతం కావడంతో ఎలాంటి ఔట్ ఫిట్‌లో అయినా అలరిస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో శ్రద్ధా దాస్ అందాల షో శ్రద్ధా దాస్ టాలీవుడ్‌లో హీరోయిన్‌గానే కాకుండా విభిన్నమైన పాత్రల్లో నటించింది. ముఖ్యంగా నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలోనూ నటించడం ద్వారా అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. ఇండస్ట్రీలో పెద్దగా ఆఫర్లు లేకున్నా ఇంతటి క్రేజ్ దక్కించుకోవడం అంటే మామూలు విషయం కాదు. కానీ ఈ అమ్మడికి అందం అవకాశాలను తెచ్చి పెట్టింది, అదే అందం ఇన్నాళ్లు ఇండస్ట్రీలో కొనసాగేలా చేసింది. సోషల్ మీడియా ద్వారా ఈమె షేర్ చేసే ఫోటోలు, వీడియోలు ఎప్పుడూ వైరల్ అవుతూనే ఉంటాయి. అంతే కాకుండా ఈమె స్థాయిని ఆ ఫోటోలు, వీడియోలు పెంచుతూనే ఉంటాయి. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు సైతం ఈమె స్థాయిని మరింత పెంచే విధంగా అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాయి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. చీర కట్టులో శ్రద్ధా దాస్ కవ్వింపులు నాలుగు పదులకు చేరువ అయిన ఈ అమ్మడు ఇప్పటికీ పాతికేళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా అందంగా ఉంది. తాజాగా ఈమె చీర కట్టులో నడుము అందం చూపిస్తూ షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. సాధారణంగానే శ్రద్ద దాస్‌ను చీర కట్టు ఔట్ ఫిట్‌లో చూస్తే చూపు తిప్పలేం. అలాంటిది నడుము అందం చూపిస్తూ, కవ్విస్తే మతిపోవడం ఖాయం. చాలా సార్లు శ్రద్ధా దాస్‌ను చూర కట్టులో చూసి చాలా మంది ఇంత అందంగా మరే హీరోయిన్ ఉండదు అంటూ కామెంట్స్ చేసిన సందర్భాలు ఉన్నాయి. మరోసారి అదే తరహా కామెంట్స్ ను సోషల్ మీడియాలో నెటిజన్స్ చేస్తున్నారు.

# కోచ్‌పై ఉమ్మేసిన మియామి ఆటగాడు.. లీగ్స్ కప్ ఫైనల్‌లో ఉద్రిక్తతలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** లీగ్స్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సియాటిల్ సౌండర్స్ జట్టు ఇంటర్ మియామిపై 0–3 విజయ కేతనం ఎగురవేసింది నిజానికి ఈ మ్యాచ్‌ను మియామి గెలుచుకుం టుందని అందరూ అంచనా వేశారు. అయితే అత్యంత అవమానకర రీతిలో ఫైనల్ మ్యాచ్‌లో ఓటమిని మూటగట్టుకుంది. మ్యాచ్ అనంతరం మియామీ ఆటగాడు లూయిస్ సువారెజ్ వ్యవహరించిన తీరు తీవ్ర ఆగ్రహానికి కారణమవుతోంది. ఫైనల్‌లో అవమానకరమైన ఓటమితో కలత చెందిన సువారెజ్ స్టేడియంలో దిగ్భ్రాంతికర చర్యకు పాల్పడ్డాడు. మ్యాచ్ పూర్తయిన తర్వాత సియాటిల్ మిడ్‌ఫీల్డర్, ఓబెద్ వర్గాస్ వైపు సువారెజ్ పరిగెత్తి అతడిని హెడ్‌లాక్‌లో పడేశాడు. దీంతో సియాటిల్, మయామి ఆటగాళ్ల మధ్య గొడవ మొదలైంది. ఒకరినొకరు తోసుకుంటూ కొట్టుకున్నారు. రెండు జట్ల ఆటగాళ్లను వేరు చేయడానికి కొన్ని నిమిషాలు పట్టిందిఆ సమయంలో సువారెజ్ సియాటిల్ సౌండర్స్ అసిస్టెంట్ కోచ్ దగ్గరకు వెళ్లి అతడితో ఘర్షణకు దిగాడు. ఇతర ఆటగాళ్లు సువారెజ్‌ను తీసుకువెళుతుండగా, అతడు కోచ్ ముఖంపై కూడా ఉమ్మివేశాడు ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సువారెజ్ తీరుపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

# ఇంకెన్ని రోజులు వెయిట్ చేయాలి.. రిషభ్ పంత్ గాయంపై లేటెస్ట్ అప్‌డేట్



**లండన్-నవభూమి:** ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ పాదానికి గాయం అయిన సంగతి తెలిసిందే. గాయంతోనే బ్యాటింగ్‌కు దిగి అర్ధశతకం సాధించాడు. అనంతరం టెస్ట్ సిరీస్ నుంచి వైదొలిగాడు. అప్పట్నుంచి ఇంటికే పరిమితమయ్యాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కాబోతున్న ఆసియా కప్‌లో కూడా పంత్ ఆడడం లేదు. విండీస్‌తో టెస్ట్ సిరీస్‌లో కూడా పంత్ ఆడేది అనుమానంగానే మారింది అక్టోబర్‌లో ప్రారంభమయ్యే ఆస్ట్రేలియా పర్యటన సమయానికి మాత్రం పంత్ రెడీ అయ్యే అవకాశాలు కనబడుతున్నాయి (%ఖుత్ తీవఫశీజవతీం బజూఖ్వ%). సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే పంత్ తరచుగా పలు ఫొటోలను, వీడియోలను పోస్ట్ చేస్తున్నాడు. అలాగే జిమ్‌లో వర్కౌట్లు కూడా చేస్తున్నాడు. తాజాగా తన కాలికి పట్టీ వేసుకుని జిమ్‌లో ఉన్న ఫొటోను షేర్ చేసిన పంత్.. 'ఇంకా ఎన్ని రోజులు' అని కామెంట్ చేశాడు. ఈ పోస్ట్‌పై అభిమానులు భారీగా రియాక్ట్ అవుతున్నారు

# అద్వితీయం



**పారిస్-నవభూమి:** నిరుడు పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి క్వార్టర్‌ఫైనల్లోనే పరాజయం పాలై నిరాశగా వెనుదిరిగింది. సరిగ్గా ఏడాది తిరిగే సరికి.. అదే వేదిక.. కానీ టోర్నీ ప్రపంచ చాంపియన్‌షిప్.. ఈసారి ఫలితం కూడా మారింది. విశ్వక్రీడల్లో పతకం దూరమైనా, ప్రపంచ టోర్నీలో కాంస్యం సాధించి సాత్విక్, చిరాగ్ జంట అబ్బురపరిచింది. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 19–21, 21–18, 12–21తో ప్రపంచ 11వ ర్యాంకరైన చైనా జంట చెన్ బో యాంగ్/లియు యీ చేతిలో పోరాడి ఓడింది. సెమీస్ ఓటమితో సాత్విక్ ద్వయం కంచు పతకానికే పరిమితమైనా.. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండోసారి పతకం నెగ్గి అ'ద్వితీయ'ం అనిపించుకుంది. ఈ మెగా టోర్నీలో రెండు పతకాలు సాధించిన భారత డబుల్స్ జోడీగా సరికొత్త చరిత్ర సృష్టించింది. 2022 టోక్యోలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సాత్విక్/చిరాగ్ జంట కాంస్యం సాధించిన సంగతి తెలిసిందే.

**షి యుకి, యమగూచిలకు సింగిల్స్ టైటిళ్లు:** ప్రపంచ చాంపియన్‌షిప్ సింగిల్స్ టైటిళ్లను షి యుకి (చైనా), అకానె యమగూచి (జపాన్) దక్కించుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 19–21, 21–10, 21–18తో కున్లావత్ వితిసార్న్ (థాయ్‌లాండ్)పై గెలిచి విజేతగా నిలిచాడు. ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్), విక్టర్ లాయ్ (కెనడా) కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**